ప్రజాపక్షం
8th ANNIVERSARY
22nd October, 2026

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

మరాఠా ఉద్యమ నిర్వీర్యానికి రూ.500 కోట్లు

ఇండియా కూటమి వర్చువల్ సమావేశం వాయిదా

జాతీయ పతాకావిష్కరణకు అనుమతి అక్కర్లేదు : నేహా బోరా

07

సంపుటి 09, సంచిక: 322 | శుక్రవారం | 23-10-2026 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



భారతదేశంలో పాలస్తీనా రాయబారి అబ్దుల్లా ఎం.ఎ. అబుషవేష్ గురువారం సిపిఐ ప్రధాన కార్యాలయం అజోయ్ భవన్‌ను సందర్శించి సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, జాతీయ కార్యదర్శి డాక్టర్ బాలచంద్ర కాంగో, జాతీయ కార్యదర్శి, అంతర్జాతీయ విభాగం అధిపతి రామకృష్ణ పాండాలతో చర్చలు జరిపారు.

## జంతర్ మంతర్ ప్రజా నిరసనల వేదిక

### హోదా పునరుద్ధరణకు 'ఇండియా' పోరాటం: డి.రాజా

**న్యూఢిల్లీ:** ప్రజలు తమ నిరసన తెలిపేందుకు నిర్దేశించిన ప్రాంతంగా జంతర్ మంతర్‌కు గతంలో ఉన్న హోదాను పునరుద్ధరించాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా డిమాండ్ చేశారు. జంతర్ మంతర్‌ను నిరసన వేదికగా తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష ఇండియా ఐక్య సంఘటన పోరాడనున్నట్లు వెల్లడించారు. ఇండియా ఐక్య సంఘటన సమావేశం అనంతరం డి.రాజా విలేకరులతో మాటాడారు. జంతర్ మంతర్‌ను నిరసన స్థలాల జాబితాలో నుంచి తొలగించేందుకు ప్రభుత్వాన్ని అనుమతించరాదని సమావేశం నిర్ణయించిందన్నారు. ప్రజల నిరసనలు, ప్రజల చర్యల కోసం జంతర్ మంతర్ హోదా పునరుద్ధరణ లక్ష్యంతో తమ పోరాటం కొనసాగబోతోందని డి.రాజా తెలిపారు. కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) వైఖరి ఏమిటి... రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు ఏమటి... అది దేనికి కట్టుబడి ఉన్నదో తెలియదు. కానీ సిజెపి ఏ విధంగా ముందుకెళుతుందా వేచి చూడాలి' అని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ఈనెల 12న జంతర్ మంతర్‌ను నిరసన స్థలాల జాబితా నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం... ప్రత్యామ్నాయ నిరసన వేదికలుగా రాంలీలా మైదానం, బురారీ మైదానం, తూర్పు ఢిల్లీలోని సిబిడి మైదానాన్ని ఢిల్లీ పోలీసులు ప్రతిపాదించడాన్ని ప్రస్తావించారు. జంతర్ మంతర్ చరిత్రను మార్చలేరని,

తరువాయి 8లో



# బిసి–ఎలోకి ముదిరాజ్‌లు

### బిసి–డి నుంచి బిసి–ఎ గ్రూపులో చేర్చే అంశంపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం

- న్యాయనిపుణులు, అధికారులతో సంప్రదింపుల అనంతరం ముదిరాజ్‌లకు న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకుంటాం
- కులగణన లెక్కలే బలహీనవర్గాలకు ధైర్యానిచ్చాయి
- విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో పక్కా న్యాయం జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
- నిరుపేదల కోసం జీవితాలు త్యాగం చేసిన పోరాట యోధులు పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్య
- వారి విగ్రహాలను ట్యాంక్‌బండ్ పరిసర ప్రాంతాల్లో ప్రతిష్టించడానికి చర్యలు తీసుకుంటాం
- పండుగ సాయన్న 174వ జయంతి కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రకటన



ప్రజాపక్షం/హైదరాబాద్

ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బిసి–ఎ గ్రూపులో చేర్చే అంశంపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించారు. నిరుపేదల కోసం జీవితాలను త్యాగం చేసిన పోరాటయోధులు పండుగ సాయన్న, దొడ్డి కొమురయ్యల విగ్రహాలను ట్యాంక్ బండ్ పరిసరాల్లో ప్రతిష్టించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పండుగ సాయన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సాయన్నపై రూపొందించిన పాటలను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగాసిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ముదిరాజ్ సామాజికవర్గం బిసిడి నుంచి మరో గ్రూపులోకి మార్చే అంశంపై గతంలో సరైన లెక్కలు లేవనే కారణంగా న్యాయస్థానాలు ఆ ప్రతిపాదనను తిరస్కరించాయని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన ప్రాతిపదికగా భవిష్యత్తులో న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా ముదిరాజ్‌లను గ్రూపుఎ లోకి మార్చడంపై మంత్రివర్గ ఉపసంఘం సమగ్రంగా అధ్యయనం చేస్తుందని తెలిపారు. ఈ ఉపసంఘం న్యాయనిపుణులు, అధికారులతో సంప్రదింపులు జరిపిన అనంతరం మంత్రివర్గంలో చర్చించి ముదిరాజ్‌లకు న్యాయం జరిగేలా సరైన నిర్ణయం తీసుకుంటామని సిఎం చెప్పారు. ప్రభుత్వం నిర్వహించిన కులగణనతో ఇప్పుడు బిసిల లెక్కలు (ఎస్ఇఇపిసి) పక్కాగా ఉన్నాయని, పక్కా

తరువాయి 8లో



## ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలు ఆపాలి

### ఐడిబిఐ బ్యాంకు విక్రయాన్ని ఖండించిన ఎఐటియుసి

**న్యూఢిల్లీ:** కెనడాకు చెందిన ఫెయిర్ ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్ లిమిటెడ్‌కు రూ.52,748 కోట్ల విలువైన ఐడిబిఐ బ్యాంకు ఆస్తుల విక్రయానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడాన్ని ఎఐటియుసి తీవ్రంగా ఖండించింది. కార్పొరేట్ ప్రయోజనాల కోసం ప్రభుత్వ ఆస్తుల అమ్మకాల పద్ధతిని తక్షణమే నిలిపివేయాలని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయ సేకరణ, పార్లమెంటరీ పరిశీలన లేకుండా కేబినెట్ నిర్ణయం తీసుకోవడాన్ని ఆక్షేపించారు. దేశ బ్యాంకింగ్ వ్యవస్థ భవిష్యత్తుపై ప్రశ్నలకు ఈ పరిణామం తావిచ్చిందన్నారు. 'ఐడీబీఐ బ్యాంకు నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏలు), ఆర్థిక నష్టాల నుంచి కోలుకోవడానికి ప్రభుత్వ వనరులు, ఎల్ఐసీ మద్దతు కీలకం. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.9,513 కోట్ల నికర లాభాన్ని ఆర్జించిన బ్యాంకులో 60 శాతానికి పైగా వాటాలు విక్రయించి, యాజమాన్య నియంత్రణను విదేశీ ప్రైవేటు వలధనానికి అప్పగించడం జాతీయ ప్రయోజనాలకు విరుద్ధం. రుణాల రద్దు, వసూళ్లు, ప్రొవిజనింగ్, వలధన పెట్టుబడులు, ఆస్తుల విలువ వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలి. ంచి ఆదాయ సామర్థ్యం కలిగిన లాభదాయకమైన ప్రభుత్వ రంగ బ్యాంకును ఎందుకు విక్రయిస్తున్నారో ప్రజలకు

తరువాయి 8లో

## పరిశోధనాత్మక కథనాలతో ప్రభుత్వాలను కదిలించాలి

- 'ప్రజాపక్షం' 8వ వార్షికోత్సవ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కారదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- హాజరైన వ్యవస్థాపక ఎడిటర్ కె.శ్రీనివాస్ రెడ్డి, నవచేతన విజ్ఞాన సమితి చైర్మన్ పల్లా వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/ హైదరాబాద్

ఎనిమిదేళ్ల అక్షర ప్రస్థానాన్ని దిగ్విజయంగా పూర్తి చేసుకున్న 'ప్రజాపక్షం' దినపత్రిక ఇతర పెద్ద పత్రికలకు ధీటుగా మంచినాణ్యతా ప్రమాణాలతో కూడిన ప్రజాహిత వార్తలు అందించేందుకు రాజీలేని పోరాటం చేస్తూ పురోగమించడం అభినందనీయమని ముఖ్యఅతిథి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్త గూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మరిన్ని ప్రజాసమస్యలు, కుంభకోణాలను వెలికితీస్తూ ప్రభుత్వాలను కదిలించే, త్వరితగతిన స్పందించే, గుర్తించగలిగే పరిశోధనాత్మక వార్తలను జర్నలిస్టులు వెలుగులోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. హైదరాబాద్ నాగోల్ బండ్లగూడలోని నల్లమల గిరిప్రసాద్ భవన్‌లో గురువారం నిర్వహించిన 'ప్రజాపక్షం' దినపత్రిక 8వ వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తొలుత ముఖ్యఅతిథి, విశిష్ట అతిథులు ప్రజాపక్షం వార్షికోత్సవ కేక్‌ను కట్ చేసి ప్రజాపక్షం పురోగమనంలో పాలుపంచుకుంటున్న పాలకవర్గం, జర్నలిస్టులు, డెస్క్ జర్నలిస్టులు, విలేకరులు, అడ్వర్టైజ్‌మెంట్, సర్క్యులేషన్ విభాగాల సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. ఒకప్పుడు 'విశాలాంధ్ర' దినపత్రిక హైదరాబాద్ ఎడిషన్‌లో పనిచేసిన తనకు పత్రికారంగమే సామాజిక స్పృహ, సమస్యలపై అవగాహన, రాజకీయ, సమసమాజ చైతన్యాన్ని ఎంతగానో పెంచిందని కూనంనేని అన్నారు. పత్రికారంగంలో విశిష్టగుర్తింపు సాధించిన జర్నలిస్టు ప్రముఖులు, సి.రాఘవాచారి, మక్కెన సుబ్బారావు, ప్రస్తుత మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిల సాన్నిహిత్యంలో తాను కూడా జర్నలిస్టుగా ఎదిగానని ఆయన గుర్తుచేసుకున్నారు. విశాలాంధ్ర దినపత్రిక ప్రముఖ జర్నలిస్టులు, కవులు, సాహితీవేత్తలుగా పేరొందిన అనేక మంది ఉన్నతికి జన్మనిచ్చిందన్నారు. ప్రజాపక్షం కూడా అదే బాటలో పయనించడం అభినందనీయమన్నారు. ప్రజాపక్షం వ్యవస్థాపక ఎడిటర్, తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాపక్షం డెస్క్ జర్నలిస్టులు, పాత్రికేయులు నిత్యవిద్యార్థులుగా ఉంటూ సమసమాజ, ప్రాపంచిక జ్ఞానాన్ని మరింత పెంచుకోవాలని, నిష్పక్షపాత వార్తలు, సమాజానికి ఉపకరించే , సమాజాన్ని చైతన్యపరిచే వార్తలు అందిస్తూ ప్రజాపక్షం దినపత్రికను మరింత ఉన్నత స్థానంలో

తరువాయి 8లో



## ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే కరువు విలయ తాండవం

- అలయ్ బలయ్‌లో ప్రముఖుల ఉద్ఘాటన
- కులమతాలు, రాజకీయాలు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ఒకే వేదికపైకి తీసుకువచ్చే కార్యక్రమమని స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్

కుల, మతాలు, రాజకీయాలు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా నిర్వహించే ''అలయ్ బలయ్'' భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమని పలువురు ప్రముఖులు అన్నారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయలకు ఈ కార్యక్రమం ప్రతీకగా నిలుస్తుందన్నారు. 'అలయ్ బలయ్' సమ్మేళనం హైదరాబాద్, నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్మన్ బండారు విజయలక్ష్మి , మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తాసుఖేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ బండ ప్రకాష్, మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి జానారెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె. కేశవరావు, వి. హనుమంత రావు, మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, ఎంపిలు డాక్టర్ కె.లక్ష్మ ణ్,డి.కె.అరుణ, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్నతో తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, వివిధ

తరువాయి 8లో



### అందరూ కలిసి ఉంటేనే దేశం ముందుకెళ్తుంది.. : కూనంనేని

భారతదేశం విభిన్న జాతులు,సంస్కృతులు, కులాలకు నిలయమని, అందరూ కలిసి ఉంటేనే దేశం ముందుకు వెళ్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. అన్ని సిద్ధాంతాల కంటే మానవత్వం గొప్పదన్నారు. దసరా పండగ చెడుపైన మంచి సాధించిన విజయానికి ప్రతీక అని అన్నారు. మనమందరం ఒక్కటే' అనే సందేశాన్నిస్తూ దత్తాత్రేయ 20 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఒకే వేదికపై అన్ని రాజకీయ పార్టీలు రాలేరని, కేవలం బండారు దత్తాత్రేయ నిర్వహించే కార్యక్రమానికి భిన్నత్వంలో ఏకత్వంగా అలయ్ బలయ్ కార్యక్రమం నిలుస్తుందని చాడ వెంకట్ రెడ్డి అన్నారు. దేశంలో విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, భావాలు ఉన్న దేశంలో భిన్నత్వంలో ఏకత్వంగా అన్ని రాజకీయ పార్టీలను ఒకే వేదికపైకి తీసుకొచ్చారన్నారు.

## ఇందిరమ్మ ఇళ్లపై ప్రభుత్వం వివక్ష

ఖమ్మం కలెక్టరేట్ ఎదుట వామపక్ష పార్టీలు, బిఆర్ఎస్ ధర్నా



ప్రజాపక్షం/ ఖమ్మం

ఖమ్మం జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో రాజకీయ వివక్షపై విపక్షాలు అభ్యంతరం వ్యక్తంచేశాయి. వామపక్షాలు బిఆర్ఎస్ నేతృత్వంలో గురువారం భారీ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ సందర్భంగా ఖమ్మం ధర్నాచౌక్‌లో ఎంఎల్‌సి తాతా మధు అధ్యక్షతన ఆందోళన కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలు మాట్లాడుతూ రాజకీయ వివక్షను మానుకోకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని అసలైన అర్హులకు ఇండ్లు దక్కే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర

తరువాయి 8లో



రక్షణ,అంతరిక్ష,అణు ఇంధన రంగాల్లో

## భారత్– పోలెండ్ మధ్య అంగీకారం

ఉక్రేన్‌లో శాంతిసాధనకు భారత్ మద్దతు

**న్యూఢిల్లీ :** రక్షణ,అంతరిక్షం, అణు ఇంధన రంగాలలో మరింత లోతైన,బలమైన సంబంధాలు విస్తరించేందుకు భారత్–పోలెండ్ దేశాలమధ్య గురువారం అంగీకారం కుదిరింది. పోలెండ్ ప్రధానమంత్రి డోనాల్డ్ టస్క్, భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ న్యూఢిల్లీలో

తరువాయి 8లో

## సౌదీ ఎయిర్‌పోర్ట్‌పై హౌతీల దాడి

- భారతీయుడు మృతి – విదేశీ వ్యవహారాలశాఖ ఖండన
- విదేశీయులు అప్రమత్తంగా ఉండాలని పలు దేశాల హెచ్చరిక

**దుబాయ్ :** సౌదీఅరేబియాపై హౌతీ తిరుగుబాటు సైన్యాల దాడులు ఆగకుండా కొనసాగుతున్నాయి. దమ్మామ్ విమానాశ్రయంపై జరిగిన దాడిలో ఒక భారతీయుడు మరణించాడు. మరో భారతీయుడు సహా అనేకమంది గాయపడ్డారు. ఈ దాడి ఘటనను భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. బుధవారంరాత్రి పొద్దుపోయిన తర్వాత దమ్మామ్‌లోని కింగ్ ఫాండ్ అంతర్జాతీయ విమానాశ్రయంపై చేసిన దాడుల్లో ఒక భారతీయుడు సహా ఇద్దరు మరణించగా మరో ఇద్దరు భారత జాతీయులు సహా 8 మంది గాయపడ్డారు. గాయపడినవారిలో ఇద్దరు యెమెన్, ఇద్దరు బంగ్లాదేశీ, మరో ఇద్దరు నేపాలీ జాతీయులు ఉన్నారని జనరల్ అథారిటీ సివిల్ ఏవియేషన్(గాకా) ప్రకటించింది. దీనికి ముందు రోజు షైబా చమురు క్షేత్రాన్ని లక్ష్యంగా చేసుకుని హౌతీలు చేసిన డ్రోన్ దాడుల్లో ఒక భారతీయుడు గాయపడ్డారు. కాగా దమ్మామ్ విమానాశ్రయంలో మరణించిన భారతీయుడి కుటుంబానికి సమాచారం చేరవేశామని, పూర్తి



సహాయ సహకారాలు అందజేస్తున్నామని స్థానిక భారత దౌత్యకార్యాలయం ప్రకటించింది. పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేశారని భారత్ విదేశీ వ్యవహారాల మంత్రితత్వశాఖ పేర్కొంది. ఆరామ్‌కోకు చెందిన షైబాహ్ చమురుక్షేత్రంపై అక్టోబరు21న జరిగిన దాడిలో కూడా ఒక భారతీయుడు గాయపడ్డాడు. ''సౌదీ అరేబియాలో పౌర ఇంధన

తరువాయి 8లో

02

ప్రజాపక్షం

Telugu National Daily

కరీంనగర్

శుక్రవారం

23-10-2026

www.prajapaksham.in






# ధన్‌ఖడ్‌పై ఆర్ఎస్ఎస్ ఆకస్మిక ప్రేమ

దసరా రోజున నాగ్‌పూర్‌లో స్థాపించిన రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్) వందేళ్ళు పూర్తి చేసుకుంది. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా విజయ దశమి ఉత్సవ్ పేరుతో ఆవిర్భావోత్సవాలు జరిగాయి. ఏడాది పాటు జరుపుకున్న శతవార్షికోత్సవాలకు ముగింపు పలికారు. అయితే, ఈసారి నాగ్‌పూర్‌లో నిర్వహించిన ఆర్ఎస్ఎస్ ఉత్సవాలకు భారత మాజీ ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్ రావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సరిగ్గా 15 నెలల క్రితం ఆయన ఆకస్మికంగా ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామా తీవ్ర దుమారం రేపింది. ఆరోగ్యకారణాలతో రాజీనామా చేసినప్పటి నుంచి ప్రధాని మోదీ ఒత్తిడి మేరకే ఆయన ఆ పని చేశారని ప్రచారం జరిగింది. ధన్‌ఖఢ్ రాజీనామాకు కారణాలు చెప్పాలని ఇండియా కూటమి పెద్ద ఎత్తున ప్రశ్నించినా, మౌనమే సమాధానమైంది. ఆ తరువాత ఆయన కూడా క్రియాశీలకంగా కనిపించలేదు.

ఉపరాష్ట్రపతి పదవీ విరమణ అనంతరం రాజధాని ఢిల్లీలో ఇచ్చే అధికారిక భవనాన్ని సైతం కేంద్ర ప్రభుత్వం ఆయనకు కేటాయించలేదని వార్తలు వచ్చాయి. చివరకు బిజెపి నాయకులకు సైతం కారణాలు తెలియనప్పటికీ, ఎందుకైనా మంచిదనే ఉద్దేశ్యంతో ధన్‌ఖఢ్‌ను కలవకుండా దూరంగానే ఉన్నారు. ఒకరిద్దరు విపక్ష పార్టీ ప్రముఖులే ఆయనను కలిసారు. ఒక విధంగా ఆయన ఒంటరి అయిపోయారు. ఆయన కూడా సామాజిక కార్యక్రమాలలో కనిపించటం మానేశారు. అయితే, ఇటీవల ధన్‌ఖఢ్ రాజీనామా వెనుక కుట్ర సిద్ధాంతాన్ని కొన్ని మీడియా సమావేశాలు ముందుకు తీసుకువచ్చాయి.

ప్రధాని నరేంద్ర మోదీని పదవి నుంచి దింపేయాలని ధన్‌ఖడ్, పారిశ్రామిక వేత్త అనిల్ అంబానీని పురమాయించారని అందులో భాగంగా ప్రచారంలో పెట్టాయి. ఈ మేరకు వారిరువురు కేంద్ర ప్రభుత్వం అధికారంలో నిలిచేందుకు కీలకంగా ఉన్న టిడిపి, జెడి(యు), ఎల్‌జెపి తదితర పార్టీలను కట్టు తప్పించే ప్రయత్నం చేశారని ప్రచారంలోకి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని ఆయా పార్టీ ముఖ్యనేతలే ప్రధాని దృష్టికి తీసుకెళ్ళడంతో ధన్‌ఖఢ్ చేత ప్రధాని మోదీనే బలవంతంగా రాజీనామా చేయించారంటూ కథనాలను వండివార్చారు. తాజాగా పేపర్ లీకేజీపై పోరాటం, సిఇసి వ్యతిరేక ఉద్యమం ప్రజల్లోకి వెళ్ళడం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పట్టణ మధ్యతరగతి వర్గాలు మాట్లాడటం జరుగుతోంది. దీనిని తిప్పికొట్టేందుకు ఈ ఉద్యమాల వెనుక విదేశీ శక్తులు ఉన్నాయనే ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వ వర్గాలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయి. అదే కోవలో ధన్‌ఖఢ్ రాజీనామా వెనుక కూడా కుట్ర కోణాన్ని తీసుకొచ్చారు.

ఇది జరిగిన కొద్ది రోజులకే ఆర్ఎస్ఎస్ దసరా ఉత్సవాలకు అనూహ్యంగా ధన్‌ఖఢ్ అతిథిగా పాల్గొన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సరసన కూర్చున్నారు. ఆ ఫోటోను ఆర్ఎస్ఎస్ అధికారిక 'ఎక్స్' ఖాతాలో ట్వీట్ చేయటం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఎందుకు ఆకస్మికంగా ఆర్ఎస్ఎస్ ఇంత ప్రేమను కురిపించిందనే విషయం చర్చనీయాంశంగా మారింది. దీని వెనుక అసలు కారణం నిజానికి జగదీప్ ధన్‌ఖఢ్ ఆర్ఎస్ఎస్‌కు ఇష్టుడే. పశ్చిమబెంగాల్‌లో బిజెపి అధికారంలోకి రావాలనే వారి కాంక్షను నెరవేర్చడంలో అక్కడ గవర్నర్‌గా పనిచేసిన ధన్‌ఖఢ్ పాత్ర కూడా ఉంది. అందుకే ఆయనకు ప్రమోషన్‌గా ఉపరాష్ట్రపతి పదవీ దక్కింది. ఆ హోదాలో రాజ్యసభ చైర్మన్‌గా కూడా వ్యవహరించే అవకాశం ఉండడంతో అధికార పార్టీకి అనుకూలంగా దానిని ఉపయోగించారు కూడా. ప్రతిపక్ష ఎంపిలపై దురుసు వ్యాఖ్యలు చేయడం, పదేపదే దబాయించటంతో 2024 చివరలో ఆయనపై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మానం నోటీసు కూడా ఇచ్చాయి. అంతగా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించినా, ఆ తరువాత ఏమైందో ఏమో గాని ఆరునెలల్లో ఉపరాష్ట్రపతికి పదవికి రాజీనామా చేశారు. ప్రధాని మోదీ కంటే ఎక్కువగా ప్రోటోకాల్ ఆశించడమే అందుకు కారణమనే వాదన కూడా ఉంది. అందుకే రాజీనామా తరువాత కనీసం ఆయనకు ప్రభుత్వ బంగళా ఇవ్వలేదనే వాళ్ళూ ఉన్నారు.

ఇన్ని జరిగినప్పటికీ ఆర్ఎస్ఎస్ ఆయనను ఆహ్వానించటానికి ప్రధాన కారణం త్వరలో జరగబోయే ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికలే కారణమనే అభిప్రాయం నెలకొంది. ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ నేతృత్వంలో వరుసగా మూడవసారి బిజెపి ఆ రాష్ట్రంలో అధికారంలోకి రావాలని ఆర్ఎస్ఎస్ పట్టుదలతో ఉంది. ఎందుకంటే లోక్‌సభలో అత్యధిక స్థానాలు ఈ రాష్ట్రం నుంచే ఉన్నాయి. మోదీ అధికారంలో వచ్చిన మూడుసార్లలో, రెండు మార్లు అత్యధిక స్థానాలను కాషాయ పార్టీ గెలుచుకుంది.

2024లో మాత్రం బిజెపి కూటమి 36 ఎంపి స్థానాలలో గెలువగా, ఎస్‌పి నేతృత్వంలోని ఇండియా కూటమి 43 చోట్ల విజయం సాధించింది. ఇందుకు ఢిల్లీ సరిహద్దుల్లో ఏడాది పాటు సాగిన రైతు ఉద్యమం కూడా ఒక కారణమే. అందులో జాట్‌లు ఎక్కువ మందే పాల్గొన్నారు. ఆ ప్రభావం వారు అధికంగా ఉండే పశ్చిమ ఉత్తర్‌ప్రదేశ్‌లో బిజెపికి ఎంపి సీట్లు తగ్గడంపై పడింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఎన్‌డిఏకు సీట్లు తగ్గడంతో, ఇండియా కూటమిని 234 సీట్లతో అధికారం చేపట్టేందుకు సమీపంగా వచ్చింది. అంతకుముందు జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా వ్యవహరించిన సత్యపాల్ మాలిక్‌ను మోదీ ప్రభుత్వం ఇబ్బంది పెట్టిన తీరు కూడా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న జాట్ వర్గాల మనసులో ఉంది. అదే మాదిరిగా అదే వర్గానికి చెందిన ధన్‌ఖఢ్‌ను రాజీనామా చేయించిన విషయం కూడా వారు మరిచిపోలేదు. యుపిలో హ్యాట్రిక్ కోసం నష్ట నివారణ చర్యలో భాగంగానే ఆయనకు తిరిగి ప్రాధాన్యత కల్పిస్తూ తమ ప్రధాన కేంద్రం నాగ్‌పూర్‌లో జరిగిన విజయదశమి ఉత్సవాలకు ఆర్ఎస్ఎస్ ఆహ్వానించింది. దీంతో ఉపరాష్ట్రపతి పదవికి జగ్‌దీప్ ధన్‌ఖఢ్ రాజీనామా వెనుక కుట్ర సిద్ధాంతాలు పటాపంచలయ్యాయి. ●



## బిజెపి పాలిత రాష్ట్రాల్లో డ్రగ్స్‌ను ఎందుకు నిర్మూలించలేదు?

**బిజెపి పాలిత రాష్ట్రాలు అయిన బిహార్, గుజరాత్, రాజస్థాన్, గోవా రాష్ట్రాల్లో మాదక ద్రవ్య సమస్యను ఎందుకు నిర్మూలించలేదు? మంగళవారం పంజాబ్‌లో పర్యటించిన షా, రాష్ట్రంలో మాదకద్రవ్యాల సమస్యకు సంబంధించిన ఘటనల్లో మరణించిన వారి కుటుంబాలను కలిసినప్పుడు తన జీవితంలో అంతగా బాధపడలేదు అన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోగా మాదకద్రవ్యాల వ్యాపారాన్ని నిర్మూలిస్తామని వాగ్దానం చేసినప్పటికీ, దానిని అరికట్టడంలో పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ షా విమర్శించారు. 2029 డిసెంబర్ 31 నాటికి మాదకద్రవ్యాల వ్యాపారాన్ని నిర్మూలిస్తామని పంజాబ్ ప్రజలకు హామీ ఇచ్చారు. సంగ్రూర్, గురుదాస్‌పూర్‌లకు సంబంధించిన రెండు కేసులను దర్యాప్తు కోసం సిబిఐకి అప్పగించాలని భగవంత్ మాన్ ప్రభుత్వాన్ని కోరారు.**

– ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్

# వివాదాల మధ్య వివాదాస్పద బిల్లులు

దేశ రాజకీయాలు రసకందాయంలో పడ్డాయి. సిఇసి జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోసం ఒక వైపు సిజెపి, మరో వైపు ఇండీ కూటమి ఎన్డీఏ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడిని కొనసాగిస్తూ, నిరసనలతో దేశ రాజధానిలోను, ఇతర రాష్ట్రాల్లోను తమ ఆందోళనలను ఉధృతం చేస్తుండగా మరొకవైపు కేంద్ర ప్రభుత్వం ప్రత్యర్థులను కట్టడి చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఇంతకు ముందే జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి సంబంధించి, కాక్రోచ్ లు నిర్వహించిన ఉద్యమానికి స్పందించి కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించి, సోనమ్ వాంగ్ చుక్ చేత నిరాహార దీక్ష విరమింప చేసిన కేంద్ర ప్రభుత్వ పెద్దలపై మరోసారి ఒత్తిడి పెంచి, ఇప్పుడు సిఇసి జ్ఞానేష్ కుమార్ చేత రాజీనామా చేయించాలని వైరి పక్షాలు పట్టుబడుతున్నాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో బొద్దింకల ఉద్యమాన్ని పరిగణలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు ప్రస్తుతం సిఇసి విషయంలో తలెత్తిన నిరసన జ్వాలలను పట్టించుకోవడం లేదు. జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న సిజెపి, ప్రతిపక్షాల ఆందోళనలను అణచి వేయడానికే ఎన్డీఏ ప్రభుత్వం మొగ్గు చూపడం గమనార్హం. ప్రత్యర్థుల ఆందోళనలకు లొంగిపోతే కేంద్ర ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా తాము వారు చేసిన ఆరోపణలను అంగీకరించినట్టే అవుతుందని భావించి ఉండవచ్చు. అందుకే ఈ నిరసనలను పట్టించుకోకుండా, పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి డీ లిమిటేషన్ బిల్లుతో పాటు, మహిళలకు చట్టసభల్లో మూడో వంతు రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయానికి ఆమోద ముద్ర వేయించుకోవాలని ప్రయత్నిస్తున్నది. ఈ బిల్లులు ప్రస్తుతం జరుగుతున్న సిజెపి, విపక్షాల నిరసనల నుండి దృష్టి మళ్ళించడానికా? లేక ప్రతి పక్షాలు మహిళల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నాయని ప్రజల్లో దురభిప్రాయం కలిగించడానికా? అనే అంశాలను పక్కన బెడితే డీ లిమిటేషన్ బిల్లును, మహిళల రిజర్వేషన్ల బిల్లుతో ముడిపెట్టి, తాము అనుకున్న లక్ష్యం సాధించడానికే సన్నద్ధమవుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. గతంలో డీలిమిటేషన్ బిల్లుపై వ్యతిరేక గళం వినిపించిన స్టాలిన్ నేతృత్వంలోని డిఎంకె, తృణమూల్ కాంగ్రెస్ నుండి చీలిన పలువురు ఎంపిలు, ఇతర పార్టీలకు చెందిన సభ్యులు ఈ బిల్లులను గట్టెక్కించడంలో సహకరిస్తారనే సంకేతాలు వెలువడుతున్నాయి. 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని, పార్లమెంటు లోను, కేంద్రంలోను దక్షిణాది రాష్ట్రాల ప్రాభవం తగ్గి, ఉత్తరాది రాష్ట్రాలు ఆధిపత్యం చెలాయిస్తాయనే వాదన సత్య దూరం కాదు. అయితే లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల చట్టసభల సీట్లను 50శాతం పెంచి పునర్విభజన చేపట్టడం కొంతలో కొంత ఉపశమనం కలిగించే చర్య అయినప్పటికీ, ఇది పూర్తి స్థాయిలో సంతృప్తి కలిగించే చర్య మాత్రం కాబోదు. ప్రతిపక్షాలు సూచించిన విధంగా డీ లిమిటేషన్ బిల్లు పక్కన బెట్టి, ఇప్పుడున్న 543 స్థానాల్లోనే మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడానికి కేంద్రం అంగీకరించదు. జనాభా ప్రాతిపదికన డీ లిమిటేషన్ జరిగితే ఉత్తరాది రాష్ట్రాలు సీట్ల విషయంలో అధికంగా లబ్ధి పొందుతాయి. దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి. ఉత్తరాది ప్రాబల్యం పెరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గి, తీవ్ర వివక్షతకు గురయ్యే అవకాశాలున్నాయి.

అయితే గతంలో ప్రవేశ పెట్టిన బిల్లులోని అంశాలను మారుస్తారా? లేక యథాతథంగా బిల్లును ప్రవేశ పెడతారా? కాంగ్రెస్ కోరినట్టు ప్రతిపక్షాలతో సంప్రదిస్తారా? అనే విషయాలపై సందిగ్ధత తొలగితే కాని, ఈ అంశంపై పూర్తిస్థాయిలో స్పష్టత రాదు. డీ లిమిటేషన్ హేతుబద్ధంగా జరగాలి. ఉత్తర, దక్షిణ భారతాల మధ్య విబేధాలు తలెత్తకూడదు. డీ లిమిటేషన్‌పై లోతైన మేథోమధనం జరగాలి. తీవ్రమైన కసరత్తు జరగాలి. అందరికీ ఆమోదయోగ్యం పద్ధతిలో డీ లిమిటేషన్ ప్రక్రియను చేపట్టాలి.

సుంకవల్లి సత్తిరాజు, 9704903463

# ఆకలి నివారణ సమాజ సమష్టి బాధ్యత



చిటికెన కిరణ్ కుమార్

9490841284

ఒకవైపు ఆకాశాన్ని తాకుతున్న ఆహార ధరలు.. మరోవైపు పంట చేతికొచ్చినా అప్పుల ఊబి నుంచి బయటపడలేని రైతు కుటుంబాలు.. ఇంకోవైపు రెండు పూటలా తిండికి నోచుకోని అభాగ్యులు. గోదాముల్లో ధాన్యం నిల్వలు, మార్కెట్లలో రకరకాల ఆహార పదార్థాలు, హోటళ్లలో వృథాగా ఉన్న వంటకాలు కనిపిస్తున్నా ఆకలి మాత్రం పూర్తిగా కనుమరుగవడం లేదు. భూమి మనిషికి కావాల్సిన ఆహారాన్ని అందించే శక్తిని కలిగి ఉన్నప్పటికీ, ఆ ఆహారం ప్రతి ఒక్కరి కంచంలోకి చేరకపోవడం మన సామాజిక వ్యవస్థ ముందు నిలిచిన పెద్ద ప్రశ్న. ఆకలితో ఉన్నవారికి అన్నం అందించడం దాతృత్వం మాత్రమే కాదు, మనిషి గౌరవంగా జీవించడానికి అవసరమైన కనీస హక్కును గౌరవించడం కూడా.

ఆకలి అంటే కేవలం భోజనం చేయకపోవడం మాత్రమే కాదు. అది మనిషి చదువును, ఆరోగ్యాన్ని, పనితీరును, ఆత్మవిశ్వాసాన్ని ప్రభావితం చేసే పరిస్థితి. ఉదయం అల్పాహారం లేకుండా పాఠశాలకు వెళ్లే పిల్లవాడు పాఠంపై పూర్తిస్థాయి దృష్టి పెట్టలేడు. తగిన ఆహారం అందని గర్భిణి ఆరోగ్యపరమైన ఇబ్బందుల ను ఎదుర్కొనే అవకాశం ఉంది. రోజంతా శ్రమించిన కూలీకి సరిపడా భోజనం దొరకకపోతే మరుసటి రోజు పనిచేసే శక్తి కూడా తగ్గుతుంది. ఒక కుటుంబంలో ఆకలి చోటుచేసుకున్నప్పుడు దాని ప్రభావం ఒక్క వ్యక్తి కే పరిమితం కాదు; ఆ కుటుంబ భవిష్యత్తుపైనా పడుతుంది. అందుకే ఆకలి నిర్మూలనను సంక్షేమ కార్యక్రమంగా మాత్రమే కాకుండా సమాజ అభివృద్ధికి అవసరమైన పునాదిగా చూడాలి.

ప్రపంచవ్యాప్తంగా ఆకలి సమస్య తీవ్రతను పరిశీలిస్తే పరిస్థితి మరింత స్పష్టమవుతుంది. ఐక్యరాజ్య సమితి సంస్థల 2026 ప్రపంచ ఆహార భద్రత, పోషకాహార నివేదిక ప్రకారం 2025లో సుమారు 64.5 కోట్ల మంది ఆకలిని ఎదుర్కొన్నారు. ప్రపంచ జనాభాలో దాదాపు 7.8శాతం మందికి తగినంత ఆహారం అందని పరిస్థితి కొనసాగింది. అదే సమయంలో సుమారు 270 కోట్లమంది ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్నట్లు అంచనాలు వెల్లడిస్తున్నాయి. ఆకలి సమస్య కొంత తగ్గుతున్న సంకేతాలు కనిపించినా, ప్రతి ఒక్కరికీ తగిన ఆహారం అందించాలనే లక్ష్యానికి ప్రపంచం ఇంకా దూరంగానే ఉంది. ఈ సంఖ్యల వెనుక లెక్కలు మాత్రమే లేవు; ఆకలితో నిద్రపోయే కుటుంబాలు, ఎదుగుదలకు అవసరమైన పోషకాలు అందని పిల్లలు, ఆదాయానికి మించి పెరుగుతున్న ఆహార ఖర్చులతో ఇబ్బంది పడే సామాన్యులు ఉన్నారు.

ఆకలి సమస్యకు ఆహార ఉత్పత్తి కొరత ఒక్కటే కారణం కాదు. ఆహారం అందుబాటులో ఉన్నా దాన్ని కొనుగోలు చేసే ఆర్థిక స్థోమత లేకపోవడం కూడా ప్రధాన సమస్య. ఉపాధి స్థిరంగా లేకపోవడం, తక్కువ ఆదాయం, ఆహార ధరల పెరుగుదల, రవాణా ఖర్చులు, ప్రాంతాల మధ్య అసమానతలు ప్రజల ఆహార భద్రతను ప్రభావితం చేస్తాయి. కుటుంబ ఆదాయంలో అధిక భాగం బియ్యం, పప్పులు, కూరగాయలు, నూనె వంటి నిత్యావసరాలకే ఖర్చయితే విద్య, వైద్యం, పిల్లల చదువు కోసం మిగిలేది తక్కువ. కొన్ని కుటుంబాలు కడుపు నింపడానికి చౌకైన ఆహారాన్ని ఎంచుకోవాల్సి వస్తుంది; కానీ అది శరీరానికి అవసరమైన పోషకాలను అందించక పోవచ్చు. కాబట్టి ఆకలి నిర్మూలన గురించి మాట్లాడేటప్పుడు ఆహార లభ్యతతోపాటు దాని ధర, నాణ్యత, ప్రజల కొనుగోలు శక్తిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

మన దేశంలో రైతు వ్యవసాయ క్షేత్రంలో కష్టపడితేనే కోట్లాది కుటుంబాల కంచాల్లో అన్నం చేరుతోంది. విత్తనం నాటడం నుంచి పంట కోత వరకు ప్రకృతితో పోరాడుతూ రైతు తన శ్రమను ధారపోస్తాడు. వర్షాలు సకాలంలో కురవకపోయినా, అధిక వర్షాలతో పంట దెబ్బతిన్నా, తెగుళ్లు సోకినా, మార్కెట్లో ధరలు తగ్గినా మొదట నష్టాన్ని భరించాల్సి వచ్చేది రైతే. పంట పండించడానికి పెట్టిన పెట్టుబడులు తిరిగి రాకపోతే కుటుంబ అవసరాలను తీర్చడం కష్టమవుతుంది. రైతు ఆదాయం స్థిరంగా ఉండటం, సాగునీటి సదుపాయాలు మెరుగుపడటం,నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉండటం, పంటకు గిట్టుబాటు ధర లభించడం ఆహార భద్రతతో నేరుగా ముడిపడి ఉన్నాయి. అన్నం విలువ తెలిసిన సమాజం అన్నదాత శ్రమకు తగిన గౌరవం ఇవ్వాలి.



తెలంగాణ గ్రామీణ జీవితంలో వ్యవసాయం, పశుపోషణ, కూలీ పని అనేక కుటుంబాల జీవనాధారాలు. వరి, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయలు పండించే రైతులు స్థానిక ఆహార అవసరాలను తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే వాతావరణ మార్పులు, భూగర్భజలాలపై ఒత్తిడి, సాగు వ్యయాలు, మార్కెట్ అనిశ్చితి రైతుల ముందున్న సవాళ్లు. ఒక ప్రాంతంలో అధికంగా పండిన పంటకు మరో ప్రాంతంలో మంచి ధర లభించకపోవచ్చు. నిల్వ సదుపాయాలు లేకపోవడం వల్ల పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి రావచ్చు. గ్రామీణ ప్రాంతా ల్లో వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేయడానికి, శుద్ధి చేయడానికి, మార్కెట్‌కు చేర్చడానికి తగిన సదుపాయాలు పెరిగితే రైతుకు ఆదాయం పెరగడంతోపాటు వినియోగదారులకు ఆహారం అందుబాటు మెరుగుపడుతుంది. మన నేలలో పండిన పంటకు మన ప్రజల కంచంలో సముచిత స్థానం దక్కాలి.

ఆహారం అందుబాటులో ఉండటం ఎంత ముఖ్యమో, అందులో పోషకాలు ఉండటం కూడా అంతే ముఖ్యం. కడుపు నిండా తిన్నంత మాత్రాన శరీరానికి కావాల్సిన పోషకాలన్నీ అందినట్లు కాదు. ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు, తగినంత పీచు పదార్థం కలిగిన సమతుల ఆహారం ఆరోగ్యానికి అవసరం. పప్పులు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు, చిరుధాన్యాలు వంటి స్థానికంగా లభించే పదార్థాలను ఆహారంలో భాగం చేసుకోవడం మంచిది. ప్రతి కుటుంబం ఒకే రకమైన ఖరీదైన ఆహారాన్ని కొనుగోలు చేయలేకపోవచ్చు. అందువల్ల అందుబాటులో ఉన్న ఆహార పదార్థాలతో పోషక అవసరాలను ఎలా తీర్చుకోవచ్చో ప్రజలకు అవగాహన కల్పించాలి. ఆరోగ్యకరమైన ఆహారం కొద్ది మందికే పరిమితమైన సౌకర్యంగా కాకుండా అందరికీ అందే అవకాశంగా మారాలి.

పిల్లల విషయంలో పోషకాహారానికి మరింత ప్రాధాన్యం ఉంది. బాల్యంలో లభించే సరైన ఆహారం శారీరక ఎదుగుదలతోపాటు మెదడు వికాసం, అభ్యసన సామర్థ్యం, రోగనిరోధక శక్తిని ప్రభావితం చేస్తుంది. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాలు, అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార సేవలు, గర్భిణులు, బాలింతలకు అందించే సహాయం అనేక కుటుంబాల కు తోడ్పడతాయి. ఈ కార్యక్రమాల నాణ్యత, ఆహార పరిశుభ్రత, నిరంతర సరఫరా, స్థానిక అవసరాలకు తగిన మెనూ వంటి అంశాలపై నిరంతర శ్రద్ధ అవసరం. పాఠశాలకు వచ్చే ప్రతి బిడ్డ ఆకలితో కాకుండా నేర్చుకోవాలనే ఉత్సాహంతో తరగతి గదిలో కూర్చునే పరిస్థితి ఏర్పడితేనే విద్యకు నిజమైన అర్థం ఉంటుంది. పిల్లల కంచంలో పోషకాహారం నింపడం అంటే దేశ భవిష్యత్‌కు బలం చేకూర్చడ మే.

ఆహార భద్రతలో మహిళల పాత్రను కూడా విస్మరించలేం. వ్యవసాయ పనుల్లో పాల్గొనడం, పశువులను సంరక్షించడం, విత్తనాలను భద్రపరచడం, ఇంటి అవసరాలకు తగిన ఆహారాన్ని సిద్ధం చేయడం వంటి బాధ్యతలను మహిళలు నిర్వర్తిస్తున్నారు. అనేక సందర్భాల్లో వారి శ్రమకు తగిన గుర్తింపు, ఆదాయం, నిర్ణయాధికారం లభించడం లేదు. మహిళలకు భూమిపై హక్కులు, వ్యవసాయ శిక్షణ, రుణ సదుపాయాలు, మార్కెట్ అవకాశాలు కల్పిస్తే కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది. గ్రామీణ మహిళా సంఘాలు పోషకాహార తోటలు, చిరుధాన్యాల ఉత్పత్తులు, ఆహార శుద్ధి, నిల్వ వంటి రంగాల్లో ముందుకు రావడానికి అవకాశాలు కల్పించాలి. కుటుంబంలో ఎవరు ఎంత తినాలి అనే విషయానికి మించి, ప్రతి ఒక్కరికీ సమానంగా నాణ్యమైన ఆహారం అందేలా చూడటంలో మహిళల నిర్ణయాలకు ప్రాధాన్యం ఉండాలి. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలను పరిశీలిస్తే ఆకలికి అనేక కారణాలు కనిపిస్తాయి. కొన్ని ఆఫ్రికా ప్రాంతాల్లో దీర్ఘకాలిక కరువు, ఘర్షణలు, పేదరికం ఆహార సరఫరాను దెబ్బతీస్తున్నాయి. పశ్చిమాసియాలో సంఘర్షణలు, నిరాశ్రయం కారణంగా ప్రజలు ఆహారం, తాగునీరు వంటి ప్రాథమిక అవసరాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరదలు, తుపానులు, భూకంపాలు సంభవించే ప్రాంతాల్లో పంటలు నాశనమవడంతోపాటు రహదారులు, నిల్వ కేంద్రాలు, రవాణా వ్యవస్థలు దెబ్బతింటాయి. ఇలాంటి పరిస్థితుల్లో తక్షణ ఆహార సహాయం ప్రాణాలను కాపాడుతుంది. అయితే అత్యవసర సహాయంతో సమస్య పూర్తిగా పరిష్కారం కాదు. స్థానిక వ్యవసాయాన్ని పునరుద్ధరించడం, ఉపాధి అవకాశాలు కల్పించడం, తాగునీటి వనరులను రక్షించడం, ప్రజలు తిరిగి స్వయం సమృద్ధి సాధించేలా సహకరించడం కూడా అవసరం.

ఆహార వృథా నివారణపై కూడా సమాజం దృష్టి పెట్టాలి. పెళ్లిళ్లు, శుభకార్యాలు, హోటళ్లు, గృహాల్లో అవసరానికి మించి ఆహారం తయారు చేయడం వల్ల పెద్దమొత్తంలో వంటకాలు మిగిలిపోతుంటాయి. మరోవైపు రవాణా, నిల్వ సదుపాయాల లోపంతో పండ్లు, కూరగాయలు, ధాన్యం కొంత భాగం వినియోగానికి ముందే పాడైపోతుంది. ఆహారం వృథా కావడం అంటే దానితోపాటు రైతు శ్రమ, నీరు, విద్యుత్తు, భూమి, ఇంధనం వంటి వనరులు కూడా వృథా కావడం. అవసరానికి సరిపడా వంట చేయడం, మిగిలిన సురక్షిత ఆహారాన్ని సముచితంగా పంచడం, నిల్వ విధానాల ను మెరుగుపరచడం ద్వారా ఈ నష్టాన్ని తగ్గించవచ్చు. ఆహారాన్ని దానంచేసే వ్యవస్థలు పరిశుభ్రత, ఉష్ణోగ్రత నియంత్రణ, గడువు వంటి జాగ్రత్తలను పాటించాలి. ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం ఎంత గొప్పదో, ఆహారం వృథా కాకుండా చూడటం కూడా అంతే బాధ్యతాయుతమైన పని.

ఆధునిక సాంకేతికత ఆహార భద్రతకు కొత్త అవకాశాలను తెస్తోంది. వాతావరణ సూచనలు, నేలలో తేమను కొలిచే పరికరాలు, నీటి పొదుపు సాగు పద్ధతు లు, పంటలకు వచ్చే తెగుళ్లను ముందుగానే గుర్తించే సాంకేతికత రైతులకు ఉపయోగపడతాయి. మెరుగైన గోదాములు, శీతల నిల్వ కేంద్రాలు, వేగవంతమైన రవా ణా, డిజిటల్ మార్కెట్ల ద్వారా పంట నష్టాలను తగ్గించవచ్చు. అయితే ఈ సదుపాయాలు పెద్ద రైతుల కే పరిమితం కాకూడదు. చిన్న, సన్నకారు రైతులకు తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండాలి. సంప్రదా య వ్యవసాయ జ్ఞానాన్ని పక్కనపెట్టకుండా ఆధునిక పరిశోధనతో అనుసంధానించాలి. నీటి వనరులను కాపాడుతూ, నేల సారాన్ని తగ్గించకుండా, జీవవైవిధ్యాన్ని పరిరక్షిస్తూ ఆహారాన్ని ఉత్పత్తి చేయడం భవిష్యత్తు తరాల పట్ల మన బాధ్యత. ప్రపంచంలోని ప్రతి సమస్యను ఒక్క రోజులో పరిష్కరించలేకపోయినా, ప్రతి గ్రామంలో, ప్రతి పట్టణంలో ఆకలిని తగ్గించే ప్రయత్నం మొదలుపెట్టవచ్చు. ఆకలి అనివార్యమైన విధి కాదు; సమాజం కలిసికట్టుగా ఎదుర్కోవాల్సిన సమస్య. ఒకరి కంచంలో మిగిలిన అన్నం మరొకరి ఆకలిని తీర్చగలదనే స్పృహ నుంచి, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన ఆహారం అందే వ్యవస్థ నిర్మాణం వరకు మన ప్రయాణం సాగాలి.

# ఉద్యమంపై విదేశీ పేరుతో స్వదేశీ కుట్ర

న్యాయమైన డిమాండ్‌తో శక్తులు, వ్యక్తులు, పార్టీలు పోరాడుతున్నప్పుడు ప్రజల మద్దతు లభించడం అనివార్యం. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజల మద్దతును చెదరగొట్టేందుకు కొన్ని శక్తులు లేని విషయాలను ప్రచారంలోకి తీసుకురావడం చేస్తుంటాయి. ఇప్పుడు దేశంలో అచ్చు అలాగే జరుగుతుంది. దాదాపు రెండున్నర దశాబ్దాల తర్వాత దేశంలో ఒక నూతన పరిణామం చోటు చేసుకున్నది. సామాజిక అవగాహన లేదని, వ్యక్తిగత వ్యవహారాలు తప్ప బయట జరుగుతున్న వ్యవహారాలను పట్టించుకోని స్థితిలో ఓ తరం ఉందని ప్రచారం జోరుగా సాగింది. దాన్నే జన్‌జీ అన్నారు. అనేకమంది మేధావులు ఈ జన్‌జీ తీరుపై తమ అభిప్రాయాలను వెల్లడించడంతో పాటు సామాజిక అవగాహన లేమిని ఎత్తిచూపారు. కొందరు కుహనా మేధావులు ఇలా ఉండటం దేశానికి శ్రేయస్కరం అని కూడా చెప్పారనుకోండి అది వేరే సంగతి. మోదీ 12 ఏళ్ల పాలనపై ప్రజల్లో అసంతృప్తి రగులుతున్న వేళ జన్‌జీ ఉద్యమం ప్రారంభమైంది. నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్ దీని నేపథ్యంలోనే న్యాయమూర్తి బొద్దింకలు అంటూ చేసిన వ్యాఖ్యలు యువతలో గొప్ప ఆలోచనకు, పట్టుదలకు దారితీశాయి. సిజెపి పేరుతో ఆందోళనకు పిలుపు, యువత నుంచి విపరీతమైన స్పందన మనం చూశాం. చివరకు ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయక తప్పలేదు. ఈ పరిస్థితుల్లోనే ఎన్నికల కమిషన్ ఓటు చోరీ వ్యవహారం రచ్చకెక్కింది. దీనిపై ప్రతిపక్ష పార్టీలతోపాటు సిజెపి నేతృత్వంలో యువత ఆందోళనకు శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా సానుకూల స్పందన లభించింది. ఏ తరం ఆలోచన దేశం గురించి సమాజం గురించి సాగడం లేదని ప్రచారం చేశారో లేదా కొందరు నొచ్చుకున్నారో ఆ తరం పట్టుదలతో ఉద్యమబాట పట్టింది. ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఓటు తొలగింపు, ఫలితాలను ఈవిఎంల ద్వారా సానుకూలంగా మార్చడం మొదలైన వాటిపై జరుగుతున్న ఆందోళనలు మోదీ ప్రభుత్వంపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఢిల్లీలో దశాబ్దాల నాటి నిబంధనలను మార్పు చేశారు. సాయుధ బలగాలు మోహరించడం, పోలీసులు హద్దులు దాటి ప్రవర్తించడాన్ని దేశ ప్రజలు గమనించారు. ఓటును తొలగించడం, ఫలితాన్ని తారుమారు చేయడమనే విషయాన్ని నేరంగా భావిస్తున్న వేళ దేశ వ్యాప్తంగా ప్రభుత్వ వ్యతిరేక చర్చ ఆరంభమైంది. ఇంత చర్చ జరుగుతున్న సందర్భంలోనే ఇటీవల జరిగిన ఉప ఎన్నికల లెక్కింపు సందర్భంగా పశ్చిమబెంగాల్‌లో ఒక బూత్‌లో మొత్తం ఓట్ల కంటే పోలైన ఓట్లు 400 అదనంగా లెక్కించడం మళ్లీ తెరపైకి వచ్చింది. ఓటును కాపాడుకోవడం, ఫలితాలను తారుమారు చేయకుండా చూసుకోవడం అన్నది ప్రజాస్వామ్య పరిరక్షణగా భావిస్తూ జన్‌జీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్‌కుమార్ రాజీనామా దిశగా సాగుతుంది. దేశవ్యాప్తంగా సానుకూల స్పందన వస్తుండడంతో కేంద్ర ప్రభుత్వం ఇరకాటంలో పడింది. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేస్తే ప్రభుత్వం బలహీనపడుతుంది లేదా విపక్షాలకు తలవంచినట్లు అవుతుంది. లేదు ఈ ఉద్యమాలను ఇలాగే కొనసాగిస్తే ముమ్ముందు మరింత ప్రమాదం అన్న భావన అధికార పెద్దల్లో నెలకొంది.

ఈ దశలోనే బిజెపి దాని అనుబంధ సంస్థలు ఓ ప్రచారాన్ని ముందుకు తెచ్చాయి. జన్‌జీ ఉద్యమం వెనుక విదేశీ శక్తుల కుట్ర ఉందని ఆర్థిక సాయం అందిస్తున్నాయని ప్రచారం చేశాయి. దీనిని ప్రజలు పట్టించుకోలేదు. ఆ తర్వాత తటస్థ వ్యక్తులు, సంస్థలతో బిజెపి ప్రచారం చేయించింది. ఈ ప్రకటనలను ప్రజలు చాలా తేలికగా తీసిపారేశారు. ఆ ప్రయోగం విఫలమైన తర్వాత మోదీ సర్కార్ ఇప్పుడు మీడియాను ఎంచుకుంది. మీడియా ద్వారా జన్‌జీ లేదా ఢిల్లీ ఆందోళన వెనుక విదేశీ శక్తులు ఉన్నట్లు, దేశాన్ని అస్థిరపర్చడానికి జరుగుతున్న కుట్రగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. తప్పును తప్పుగా చూసే ప్రయత్నం చేయకుండా తప్పును ఒప్పుగా చిత్రీకరించే మీడియా సంస్థల సంఖ్య పెరిగింది. ప్రతి ఘటనను మసిబూసి మారేడుకాయ చేయడంలో సిద్ధ హస్తులుగా మారిన సంస్థలు ఇప్పుడు జన్‌జీ లేదా జ్ఞానేష్‌కుమార్ రాజీనామా ఆందోళన వెనుక విదేశీ శక్తుల కుట్ర ఉన్నట్లు గొంతు చించుకుంటున్నాయి. యజమాని చెప్పినట్లుగా నడుచుకునే ఉద్యోగుల్లా లేదా పెంపుడు జంతువుల్లా కొన్ని మీడియా సంస్థలు అధికారానికి దాసోహం అంటున్నాయి. అధికార పార్టీ చెప్పినట్లుగా ప్రజా ఉద్యమాలపైన విషం చిమ్ముతున్నాయి. ప్రజాస్వామ్యానికి పునాదిగా చెప్పుకునే ఓటు తొలగింపు, ఫలితాల తారుమారుపై మీడియా సంస్థలు బాధ్యతగా వ్యవహరించకపోగా వ్యవహరించే వారిని తప్పుబడుతున్నాయి. వాస్తవానికి ఈ దేశం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటుంది. సంపద కొందరి చేతుల్లో పోగుబడి ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వ సంస్థలు మూతపడి ప్రైవేటు సంస్థలు మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నా యి. ఉపాధి, ఉద్యోగ రంగాలు వట్టిపోయి నిరుద్యోగం పెరిగి దేశంలో యువశక్తి నిర్వీర్యమవుతుంది. దేశ జనాభాలో సగానికి పైగా ఆధారపడిన వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతుంది. పారిశ్రామిక రంగం మొత్తం కేంద్రీకృతమై కార్పొరేట్ శక్తుల హస్తగతమవుతున్నది. ఆర్థిక వ్యవస్థ పతనావస్థవైపు పరుగులు పెడుతుంది. ఈ పరిస్థితుల్లో మీడియా సంస్థలు జాతిని జాగృతం చేయడంతో పాటు ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ప్రజలను సన్నద్ధం చేయాల్సి ఉంది. కానీ ఎవరు ప్రశ్నిస్తున్నారో, ఎవరు తమ హక్కుల కోసం పోరాడుతున్నారో, ఎవరు ప్రజలను జాగృతం చేస్తున్నారో వారిని తప్పుగా చూపే ప్రయ త్నం చేస్తున్నారు. విదేశీ శక్తుల పేరున స్వదేశీ శక్తులు ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నాయి. రెండున్నర దశాబ్దాల తర్వాత ఓ తరం దేశంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై నిలదీస్తున్న సమయంలో కొందరి వైఖరి ముఖ్యంగా మీడియా సంస్థల వైఖరి ఆక్షేపణీయమైంది. ఇటువంటి సంస్థలు తప్పు డు ప్రచారాలు బలమైన ప్రజా ఉద్యమాలను నిర్వీర్యం చేయలేవన్న విషయాన్ని మరోసారి రుజువు చేయాల్సిన బాధ్యత జన్‌జీ పైన, ప్రస్తుతం పోరాడుతున్న రాజకీయ పక్షాలపైన ఉంది.

ఏనుగు వెంకటేశ్వరరావు, ఖమ్మం



## కుల వివక్ష నిర్మూలనకు ఉద్యమిద్దాం

### డిహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దళితుల హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వ సాధన కోసం పోరాటాలను ఉధృతం చేస్తామని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కె.ఏసురత్నం అన్నారు. డిహెచ్‌పిఎస్ 20వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం హిమాయత్‌నగర్‌లోని రాష్ట్ర కార్యాలయంలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనతో పాటు దళితులకు భూమి, విద్య, ఉపాధి, సామాజిక భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌సి సబ్‌ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో కేటాయించి పారదర్శకంగా ఖర్చు చేయాలని, దళితులపై దాడులను అరికట్టి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. దళితులు, పేదలు, కార్మికులు, మహిళలను ఐక్యం చేసి సామాజిక న్యాయం సాధించే ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బికెఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కె.కాంతయ్య, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.రాజ్ కుమార్, నాయకులు కె.బాబు, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ఆత్మగౌరవానికి ప్రతీక కొమురం భీమ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడిన మహనీయుడు కొమురం భీమ్ అని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కొమురం భీమ్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళ్లు అర్పించారు. 'జల్.. జంగల్.. జమీన్' నినాదం గిరిజన హక్కులకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. గిరిజన యువత తమ సంస్కృతిని కాపాడుకుంటూ ఆధునిక విద్య, సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధిలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

### పేదల ఆత్మగౌరవ పోరాటానికి ప్రతీక పండుగ సాయన్న

దోపిడీ, పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పేదల పక్షాన పోరాడిన పండుగ సాయన్న ప్రజా వీరుడని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సాయన్న జయంతి సందర్భంగా నివాళులర్పించిన ఆయన, ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన పోరాటం భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడమే నిజమైన నివాళి అని తెలిపారు.

## కొండ పోచమ్మ సాగర్ నీళ్ల మళ్లింపుపై విచారణ జరపాలి

### రాష్ట్ర ఇరిగేషన్ శాఖ కార్యదర్శి శ్రీధర్‌కు ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు ఫామ్ హౌస్‌కు కొండ పోచమ్మ సాగర్ నీళ్ల మళ్లింపుపై విచారణ జరపాలని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్‌కు ఆయన గురువారం ఒక లేఖ రాశారు. ప్రజల అవసరాల కోసం ఉపయోగించే లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌ను వ్యక్తిగత అవసరాల కోసం ఫామ్ హౌస్‌కు వాడుకోవడంపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని చామల కిరణ్ కుమార్ రెడ్డి తన లేఖలో కోరారు. ప్రాజెక్టు రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలిస్తే ప్రజా ధనం ఎంత దుర్వినియోగం అయిందో లెక్క బయటకు వస్తుందని లేఖలో ఆయన పేర్కొన్నారు. వీలైనంత త్వరగా కొండ పోచమ్మ సాగర్ నుంచి పాండురంగ చెరువుకు అక్కడి నుంచి కెసిఆర్ ఫామ్ హౌస్‌కు నీళ్ల తరలింపుపై దర్యాప్తు పూర్తి చేసి బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## మైనింగ్ తవ్వకాలతో ప్రకృతి విధ్వంసం.. ప్రజల ప్రాణాలకు ముప్పు

- కాచారంలో మైనింగ్ తవ్వకాలు తక్షణమే నిలిపివేయాలి
- తప్పుడు ప్రజాభిప్రాయ సేకరణతో అనుమతులు..27 ఏళ్లుగా గ్రామ అభివృద్ధి హామీలు గాలికి
- కాచారం ప్రజల పోరాటానికి సిపిఐ మద్దతు : సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**ప్రజాపక్షం/దేవరకొండ :** ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టి, ప్రకృతిని విధ్వంసం చేస్తూ మైనింగ్ కంపెనీలు లాభాలే లక్ష్యంగా వ్యవహరించడం దారుణమని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం విమర్శించారు. దేవరకొండ మండలం కాచారం గ్రామంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిన మైనింగ్ తవ్వకాలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తుల వ్యతిరేకతను పట్టించుకోకుండా తప్పుడు విధానాల్లో అనుమతులు పొందారని ఆరోపించారు. మైనింగ్ తవ్వకాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ ప్రజలు చేపట్టిన నిరవధిక దీక్ష గురువారం 11వ రోజుకు చేరుకోగా, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు తూం బుచ్చిరెడ్డిలతో కలసి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ 2022లో నవ భారత్ కంపెనీ మైనింగ్ పనులు ప్రారంభించినప్పటి నుంచి గ్రామంలో ఆశించిన అభివృద్ధి జరగలేదని విమర్శించారు. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీలు ఇచ్చి మైనింగ్ అనుమతులు పొందిన కంపెనీ, ఆ హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తులు మైనింగ్‌ను వ్యతిరేకించినప్పటికీ, కంపెనీ యాజమాన్యం తమకు అనుకూలంగా కొంత మందిని సమీకరించి తప్పుడు ప్రజాభిప్రాయంతో అనుమతులు పొందిందని ఆరోపించారు. గ్రామానికి సమీపంలో విచ్చలవిడిగా బ్లాస్టింగ్ నిర్వహిస్తుండటంతో రైతులు భయాందోళనల మధ్య వ్యవసాయ పనులు చేసుకోవాల్సి వస్తోందన్నారు. మైనింగ్ ద్వారా గ్రామం అభివృద్ధి చెందుతుందని, స్థానిక నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని ఆశలు కల్పించిన కంపెనీ,నేడు గ్రామ ప్రజలకు కష్టాలను మిగిల్చిందని అన్నారు. గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించకుండా, ఉద్యోగాల పేరుతో ఆశలు కల్పించి ప్రజల మధ్య విభేదాలు సృష్టించడం సరికాదన్నారు. గ్రామంలో ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలను మానుకోవాలని కంపెనీ యాజమాన్యానికి సూచించారు. మైనింగ్‌కు వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలుపుతున్న గ్రామస్తులకు పోలీసులు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా, వారి పోరాటానికి అవకాశం కల్పించాలని నెల్లికంటి సత్యం కోరారు. ప్రజల అభిప్రాయాలను గౌరవించకుండా అణచివేత ధోరణితో వ్యవహరించడం తగదన్నారు.కాచారం గ్రామ ప్రజల పోరాటానికి సిపిఐ పూర్తి మద్దతుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

### జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్సీ

కాచారం గ్రామంలో మైనింగ్ బాధితుల దీక్షా శిబిరం వద్ద నుండే ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను, బ్లాస్టింగ్‌తో ఇళ్లకు వస్తున్న పగుళ్లు, కాలుష్యంతో వస్తున్న అనారోగ్య సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని మైనింగ్ తవ్వకాలను తక్షణమే నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని, బాధిత గ్రామస్తులకు న్యాయం చేయాలని కోరారు. మైనింగ్ అధికారులు గ్రామస్తులను భయభ్రాంతులకు గురిచేస్తే సహించేది లేదని, తప్పుడు అనుమతుల పేరుతో ప్రజా ఉద్యమాలను అణచివేయడం సరికాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు తూం బుచ్చిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు నూనె రామస్వామి, పల్లా రంగారెడ్డి, గ్రామ సర్పంచ్ ముదిగొండ శ్యామలయ్య, అడ్వకేట్ సుందరయ్య, ఉపసర్పంచ్ మల్లేష్ యాదవ్, నాయకులు అలమోని మల్లయ్య,కాటం గోవర్ధన్, శ్రీను, సైదులు, అరుణ,సాలయ్య,సరిత,కడారి యాదయ్య, అబ్బనమోని తిరుపతయ్య, కొండల్,గణేష్,చంద్ర మౌళి, శ్రీనయ్య,హరికృష్ణ,నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## నేల ఆరోగ్యమే ఆహార భద్రతకు పునాది

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
- భూసార పరిరక్షణకు 'ఖేత్ బచావో అభియాన్' ప్రారంభం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేల సారాన్ని కాపాడుకుంటేనే భవిష్యత్ తరాలకు ఆహార భద్రత కల్పించగలమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వ 'ఖేత్ బచావో అభియాన్'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వినియోగించాలని, రసాయన ఎరువులు, పురుగుమందులను శాస్త్రీయ పద్ధతుల్లోనే వాడాలని సూచించారు. వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని పంటల ఎంపికలో మార్పులు చేసుకోవాలని, సేంద్రీయ, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. భూగర్భ జలాల సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ డ్రిప్ సేద్యం, వర్షపు నీటి నిల్వ, తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. పంట వ్యర్థాలను కాల్చకుండా మల్చింగ్‌కు, పశుగ్రాసంగా వినియోగించాలని, పంటల వైవిధ్యీకరణతో పాటు వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించాలని తెలిపారు. ఖేత్ బచావో అభియాన్‌ను నిరంతర ఉద్యమంగా చేపట్టి గ్రామస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ముఖ్య కమిషనర్ సురేంద్ర మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### పత్తి రైతులకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు : తుమ్మల

పత్తి కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించి, రైతులకు కనీస మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో మార్కెటింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రాష్ట్రంలో పత్తి సాగు, ఉత్పత్తి అంచనాలు, మార్కెట్ ధరలు, సిసిఐ కొనుగోళ్ల ఏర్పాట్లు, రైతులకు అందిస్తున్న సౌకర్యాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా 2026–27 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 48.20 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరగగా, 29.43 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నట్లు అధికారులు మంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి క్వింటాల్‌కు రూ.8,667 కనీస మద్దతు ధర ప్రకటించగా, ప్రస్తుతం రాష్ట్రంలో మోడల్ మార్కెట్ ధర సుమారు రూ.9 వేలు ఉందని తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో 335 జిన్నింగ్ మిల్లులను కొనుగోలు కేంద్రాలుగా గుర్తించినట్లు వెల్లడించారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ పత్తి మార్కెట్లలో ధరల వ్యత్యాసానికి కారణాలను విశ్లేషించాలని, సిసిఐ, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలని సూచించారు. తెలంగాణలో పత్తి ప్రాసెసింగ్, స్పిన్నింగ్, ఆయిల్ పరిశ్రమల విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పత్తి విక్రయాలకు సంబంధించిన వివరాల కోసం 18005995779 టోల్‌ఫ్రీ నంబర్, 8897281111 వాట్సాప్ సేవలను వినియోగించుకోవాలని రైతులను కోరారు. పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లే ముందు తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను పరిశీలించుకోవాలని మంత్రి సూచించారు.

## సింగరేణి సంస్థను బలహీనపరిచే, ప్రైవేటీకరణ ప్రయత్నాలు అడ్డుకుంటాం

### బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సింగరేణి సంస్థను బలహీనపరిచే, ప్రైవేటీకరణ ప్రయత్నాలను అడ్డుకుంటామని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సింగరేణి ప్రాంత బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టిబిజికెఎస్) నాయకులతో కెటిఆర్ గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింగరేణిలో ప్రస్తుత పరిస్థితులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంస్థ భవిష్యత్తు, కార్మిక సంఘం బలోపేతం తదితర అంశాలపై చర్చించారు. అనంతరం కెటిఆర్ మాట్లాడుతూ సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ ముప్పు నుంచి కాపాడటంతో పాటు సంస్థలో జరుగుతున్న అవకతవకలు, టెండర్ల వ్యవహారాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఖరిని కూడా ప్రశ్నించాలని, సింగరేణి సంస్థ ప్రయోజనాలకు విఘాతం కలిగించే నిర్ణయాలపై ఉమ్మడిగా పోరాటం చేయాలని సూచించారు. కార్మికులకు రావాల్సిన లాభాల వాటా, బోనస్, ఇతర ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రశ్నించాలని, కార్మికుల హక్కుల సాధన కోసం క్షేత్రస్థాయిలో నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. సింగరేణి కార్మికుల సమస్యలపై బిఆర్‌ఎస్ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందన్నారు. సింగరేణి కార్మిక సంఘం ఎన్నికలను ఎదుర్కొనేందుకు బిఆర్‌ఎస్,టిబిజికెఎస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు.






## పట్టణ పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి

### యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ ప్రతినిధులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** యునైటెడ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ తెలంగాణ ప్రతినిధి బృందం పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జిహెచ్‌ఎంసి ప్రత్యేక అధికారిని కలిసింది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్పొరేషన్‌ల పరిధిలోని సమస్యలు, పట్టణ పాలన మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై వారు వినతిపత్రాన్ని అందజేశారు. పట్టణ పరిపాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి క్యూర్ చట్టం కింద నిర్దేశించిన విధంగా వార్డు కమిటీలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సభ్యులు ఆ వినతిపత్రంలో స్పష్టం చేశారు. స్థానిక స్థాయిలో మెరుగైన పౌర సేవలు అందించడానికి, క్షేత్రస్థాయి పాలనను సమర్థవంతంగా నిర్వహించడానికి వార్డు కమిటీల పాత్ర అత్యంత కీలకమన్నారు. అలాగే వర్షపు నీటి నిర్వహించడంలో భాగంగా వీధుల్లో, ప్రధాన రహదారులపై వర్షపు నీటి ఇంకుడు గుంతల ఏర్పాటుతో పాటు రహదారుల మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరారు. గేటెడ్ కమ్యూనిటీల నుంచి వచ్చే అదనపు మురుగునీటి శుద్ధి ప్లాంట్ నీటిని సేకరించి, దానిని శాస్త్రీయంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పౌరుల భాగస్వామ్యాన్ని మరింత ప్రోత్సహించడానికి, నిబంధనల అమలును సులభతరం చేయడానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియలను సరళీకృతం చేయడంతో పాటు నమోదు రుసుములను తగ్గించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సీతారాం ధోలిపాల, వి.వి. రావు, ఆర్.సి.వి. బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.









## సమగ్ర ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ విధానం మరో ఐదేళ్ల పాటు పొడిగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రియల్ ఎస్టేట్, పట్టణాభివృద్ధి రంగాలకు ఊతమిచ్చేలా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అమలవుతున్న సమగ్ర ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ పాలసీని మరో ఐదేళ్ల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు మున్సిపల్, పట్టణాభివృద్ధి (ఎంఎయుడి) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ జి.ఓ నెంబర్ 950ని జారీ చేశారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండిఎ) మెట్రోపాలిటన్ కమిషనర్ నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం, 2020 నవంబర్ 3న జి.ఒ ఎంఎస్ నెంబర్ 189 ద్వారా తీసుకొచ్చిన విధానాన్ని కొనసాగించాలని స్పష్టం చేసింది. హెచ్‌ఎండిఎ యాక్ట్2008, కోర్ అర్బన్ రీజియన్ యాక్ట్ 2026, తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 ప్రకారం కల్పించబడిన అధికారాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.







04
ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
శుక్రవారం
23-10-2026
www.prajapaksham.in
ఉమ్మడి కరీంనగర్
సిద్దిపేట
స్థానికం
LOCAL NEWS

## దళితులంతా ఐక్యంగా ఉండాలి

ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** దళితులంతా ఐక్యంగా ఉండి రాజ్యాంగం ప్రకారం సంక్రమించిన తమ హక్కులను కాపాడుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి అన్నారు.గురువారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో దళిత హక్కుల పోరాట సమితి (డి.హెచ్.పి.ఎస్) 20వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై డి.హెచ్.పి.ఎస్ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ 20 వసంతాలు పూర్తి చేసుకోవడం చాలా గొప్ప విషయమని,దళితులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం పోరాడాలని,అప్పుడే సమస్యలు పరిష్కరించబడతాయని అన్నారు.దళిత సోదరులందరూ ఐక్యంగా ఉండి దళిత హక్కుల పోరాట సమితి ఇచ్చే పోరాటాల్లో పాల్గొని కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుకూరి రాజరత్నం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ సిపిఐ కార్పొరేటర్ మార్కాపూరి సూర్య, సిపిఐ నాయకులు గోసిక మోహన్,తాళ్ల పల్లి మల్లయ్య,తొడుపునూరి రమేశ్ ,కుమార్,తాళ్లపల్లి సురేందర్,ఆసాల నవీన్,జనగామ జగదీశ్వర్,తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణకారుల హక్కుల కోసం శంఖారావం



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** స్వర్ణకారుల వృత్తి పరిరక్షణ, హక్కుల సాధన కోసం ఈ నెల 24న హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్–స్వర్ణకార శంఖారావం' భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మెట్‌పల్లి స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వంగల మహేష్ పిలుపునిచ్చారు.రాష్ట్ర స్వర్ణకారుల సంఘం ఆదేశాల మేరకు గురువారం మెట్‌పల్లిలోని స్వర్ణకార సంఘ భవనం వద్ద సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ స్వర్ణకారుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని,జిఒ ఎంఎస్ నంబర్ 272ను సవరించి అమలు చేయాలని,అక్రమ రికవరీలను అరికట్టాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు నిండిన స్వర్ణకారులకు పింఛన్ ఇవ్వాలని,బ్యాంకు అప్రైజర్లకు సీలింగ్ విధానాన్ని తొలగించి సమానమైన కమీషన్ అందించాలని కోరారు. సభకు మెట్‌పల్లి పట్టణంతో పాటు మూడు మండలాల గ్రామీణ స్వర్ణకారులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇల్లెందుల కృష్ణమాచారి,ఇగ్యరపు వెంకటాద్రి,జిల్లా సలహాదారు ఇల్లెందుల శ్రీనివాస్,పట్టణ ఉపాధ్యక్షుడు శ్రీపాద సతీష్, ప్రధాన కార్యదర్శి తొగిటి విద్యాసాగర్, సహాయ కార్యదర్శి కలిగోటలక్ష్మణ్,రమేష్,నవీన్,నాంపల్లి శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## అటవీ భూములను రక్షించాలని వినతి



**ప్రజపక్షం/మల్లాపూర్ :** 50 సంవత్సరాలకు పైబడిగా తమ గ్రామ పరిధిలో ఉన్న అటవీ భూమిని రక్షించుకుంటూ వస్తున్నామని కొందరు తమ అటవీ భూములను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని వారి నుండి అటవీ భూములకు రక్షణ కల్పించాలని ఎంపి ధర్మపురి అరవింద్‌ను కలిసి ఓబులాపూర్ గ్రామస్థులు విన్నవించారు.ఈ మేరకు గురువారం నిజామాబాద్ పట్టణంలోని ఎంపి కార్యాలయంలో కలిసి ఫారెస్ట్ అధికారుల సహకారంతోనే ఒకరిద్దరు వ్యక్తులు అటవీ భూమిపై కన్నేసి ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని,అట్టి భూములలో ఎలాంటి సాగుకు అనుమతులు ఇవ్వకుండా చూడాలని వినతి పత్రం అందించి కోరారు. సానుకూలంగా స్పందించిన ఎంపి ధర్మపురి అరవింద్ అటవీ భూములను అక్రమార్కులకు అధికారులకు ఆదేశాలు ఇస్తామని ఓబులాపూర్ గ్రామస్తులకు అండగా ఉంటామని హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధురి తోటరాజరెడ్డి, రమేష్ శేఖర్ దానవేని శ్రీనివాస్, భూక్య రమేష్,గ్రామస్థులు మన సంరక్షణ సమితి సభ్యులు ఉన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలి: ట్రాఫిక్ ఎస్ఐ రాజు

**ప్రజాపక్షం/ వేములవాడ:** వాహనదారులు అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని వేములవాడ ట్రాఫిక్ ఎస్ఐ రాజు అన్నారు. గురువారం తిప్పాపురం ప్రధాన బస్టాండ్ వద్ద ట్రాఫిక్ నిబంధనలను పాటించకుండా హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న వాహనదారులను తనిఖీ చేసి వారికి అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా హెల్మెట్ ధరించకుండా వాహనం నడిపితే చలానా విధించబడుతుందని నిబంధనలను పాటించడం వల్ల ఇతరులకు వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని గ్రహించాలని ఆయన అన్నారు.

## దళితుల హక్కుల కోసం పోరాడాలి: డిహెచ్‌పిఎస్ నాయకులు



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** దళితుల హక్కుల కోసం పోరాడాలని డి హెచ్ పి ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు కందుకూరి రాజారత్నం, జిల్లా కార్యదర్శి పెరిక లక్ష్మణ్‌లు అన్నారు.గురువారం రోజున పెద్దపల్లి జిల్లా లో దళిత హక్కుల పోరాట సమితి 20వ వార్షికోత్సవాల సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ ఆఫీసులోజెండా ఆవిష్కరణ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పెరిక లక్ష్మణ్ ఆవిష్కరించడం జరిగింది.అనంతరం ఈ కార్యక్రమానికి అధ్యక్షుడిగా కందుకూరి రాజా రత్నం దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మణ్‌లు మాట్లాడుతూ దళిత హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి దళితులపై ఉన్నదని, దళితులందరూ ఏకమైతే మన హక్కులు మనమే సాధించుకోవచ్చననీ, రాజ్యాంగంలో పొందుపరచిన విధంగా మన హక్కులను కాపాడుకోవాలని మనకు రావలసిన సబ్ ప్లాన్లను,డబల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రతీ దళితుడికీ కేటాయించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ పెద్దపెల్లి జిల్లా కార్యదర్శి తాంద్ర సదానందం,కల్లపల్లి నవీన్,తాళ్ల పెల్లి సురేందర్,అరికెల తిరుపతి,అరకిల రవి, పాల్గొన్నారు.

# ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు కార్యాచరణ

రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి
అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల :** ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వచ్చే ఎనిమిది నెలల నీటి అవసరాలకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం జగిత్యాల జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ రానున్న ఎనిమిది నెలల్లో వర్షం పడకపోవచ్చనే పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని,ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు చెరువులు, ఇతర నీటి వనరుల్లో అందుబాటులో ఉన్న నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాల కోసం కాపాడుకోవాలని స్పష్టం చేశారు.దక్షిణ తెలంగాణలోని నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ వంటి జిల్లాల్లో పరిస్థితులు మరింత సమస్యాత్మకంగా ఉన్నాయని, జగిత్యాల జిల్లాలోనూ నీటి వినియోగంపై ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుత ఖరీఫ్ పంటలను సాధ్యమైనంత వరకు కాపాడేందుకు మండల స్థాయి అధికారులు, వ్యవసాయ అధికారులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. రైతుల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరిగేలా అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని, రైతులు ఎదుర్కొనే సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని అన్నారు.యాసంగి పంటల ప్రణాళికను ప్రస్తుత నీటి లభ్యతకు అనుగుణంగా పూర్తిగా సమీక్షించాలని మంత్రి ఆదేశించారు.ఎస్‌ఆర్‌ఎస్పీ నుంచి యాసంగి పంటలకు నీరు విడుదల చేసే అవకాశం లేదని స్పష్టం చేస్తూ, బోరు నీరు అందుబాటులో ఉన్నా వరి సాగుకు వెళ్లవద్దని రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నీటి కొరత ఏర్పడితే పంటలను చివరి వరకు కాపాడటం కష్టమవుతుందని, అందువల్ల తక్కువ నీటితో, తక్కువ కాలంలో చేతికొచ్చే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు.ప్రతి మండలంలో అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించి, గ్రామాల వారీగా యాసంగి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి తెలిపారు. తాగునీరు, పశువుల నీటి అవసరాలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని, రాబోయే రోజుల్లో పెరిగే డిమాండ్‌కు అనుగుణంగా నీటి వనరులు, నీటి నిల్వలు, భూగర్భ జలాల పరిస్థితిని మండలాల వారీగా అంచనా వేసి ప్రణాళికలను సవరించాలని ఆదేశించారు. స్ప్రింక్లర్ల కోసం రైతుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు వివరాలతో నివేదిక సమర్పించాలని, ఈ అంశాన్ని ప్రభుత్వంతో పాటు సంబంధిత మంత్రితో చర్చించి అవసరమైన చర్యలు తీసుకునేలా చూస్తామని తెలిపారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు అవసరమైన చోట నీటి సరఫరాపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ఆఖేపల్లి ఆయకట్టు రైతుల ప్రస్తుత పంటలను రక్షించేందుకు ఒకసారి నీటిని విడుదల చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఉద్యాన పంటల సాగును విస్తరించేందుకు రైతులను ప్రోత్సహించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. కూరగాయలు, ఇతర ఉద్యాన పంటల సాగు ద్వారా రైతుల ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. సోలార్ ఫెన్సింగ్‌కు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తున్న విషయాన్ని రైతులకు వివరించాలని సూచించారు. ఆయిల్ పామ్, కూరగాయల సాగును కూడా ప్రోత్సహించాలని ఆదేశించారు. భూగర్భ జలాలను పెంపొందించేందుకు విబిజి రామ్ జి పథకం ద్వారా అవసరమైన నీటి సంరక్షణ పనులు చేపట్టాలని మంత్రి పేర్కొన్నారు. తాగునీటి సరఫరాపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, గ్రామాల్లో చిన్న సమస్య తలెత్తినా వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. క్షేత్రస్థాయి సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరించి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ భూగర్భ జలాల పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం సుమారు 5 మీటర్ల మేర తగ్గుదల నమోదైనట్లు తెలిపారు.మిషన్ భగీరథ ద్వారా వచ్చే జూన్ వరకు ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మోటార్లకు క్రమం తప్పకుండా మరమ్మతులు చేయాలని, అవసరమైన విడిభాగాలను ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు.ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అధికారులు యాసంగి సాగు ప్రణాళికను రూపొందించాలని అన్నారు. వ్యవసాయ శాఖ ఇప్పటికే యాసంగిలో రెండు లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యాన్ని ప్రతిపాదించిందని, ప్రస్తుత పరిస్థితుల్లో ఆ లక్ష్యాన్ని ఎలా సాధిస్తారో సమీక్షించుకోవాలని సూచించారు. చెరువులు ఎండిపోతున్నాయని, భూగర్భ జలాలు తగ్గుతున్నాయని, ఎస్‌ఆర్‌ఎస్‌పి నుంచి నీటి విడుదల ఉండదని పేర్కొంటూ, ఈ పరిస్థితుల్లో వరి సాగును ప్రోత్సహించకూడదని స్పష్టం చేశారు. యాసంగిలో కనీసం 10 ఎకరాల్లో కూడా వరి సాగును ప్రోత్సహించకుండా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని తెలిపారు.సమావేశంలో జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.వాణి,మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నారాయణ రెడ్డి,తదితరులు ఉన్నారు.

## అధికారులను బెదిరిస్తే రైతు సమస్యలు పరిష్కారమవుతాయా?

బిఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తన్నీరు హరీష్ రావు



**ప్రజాపక్షం/గజ్వేల్:** అధికారులను సస్పెండ్ చేస్తే రైతుల సమస్యలు పరిష్కారం కావని, మరో 20 రోజులు నాణ్యమైన విద్యుత్, సాగు నీరందిస్తేనే అన్నదాతలకు న్యాయం జరుగుతుందని డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు స్పష్టం చేశారు. గురువారం గజ్వేల్ మండల పరిధిలో ఎండిన పంటలను పరిశీలించిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకపోవడం తోనే 12 లక్షల ఎకరాల్లో పంటలు ఎండినట్లు విమర్శించారు. మరో 20 రోజులు పంటలకు సాగునీరు అందిస్తేనే మిగతా పంటలు కాపాడుకోవచ్చని గుర్తు చేశారు. మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా లేకపోవడంతో ట్రాన్స్ ఫార్మర్లు, బోరు మోటార్లు కాలిపోతున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని వెంటనే కరువు మండలాలను ప్రకటించి రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో వరి పంటతో పాటు పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఉమ్మడి మెదక్, కరీంనగర్, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఈ దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు కాపాడేందుకు అందుబాటులో ఉన్న మల్లన్న సాగర్ విడుదల చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మాజీ జడ్పిటిసి డాక్టర్ మల్లేశం, మున్సిపల్ చైర్మన్ చందన రవీందర్, వైస్ చైర్మన్ పద్మాబాయి నర్సింగరావు, మాజీ చైర్మన్ రాజమౌళి గుప్త, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణా రెడ్డి, బిసి సెల్ జిల్లా మాజీ కార్యదర్శి ఆకుల దేవేందర్, మండల పార్టీ అధ్యక్షుడు బెండ మధు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సిఎం సహాయనిధి అండ



**ప్రజాపక్షం/జగిత్యాల టౌన్:** సిఎం స హాయనిధి నిరుపేదల కు అండ అనిజగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పే ర్కొన్నా రు.జగిత్యాల పట్టణంలోని మోతే రోడ్డు జిల్లా పార్టీ కార్యాలయ ంలో జగిత్యాల పట్టణానికి చెందిన 111 మ ంది లబ్ధిదారులకుసిఎం సహాయనిధి ద్వారా మంజూరైన రూ.52,04,450 విలువైన చెక్కులను జగిత్యాల శాసనసభ్యుడు సంజయ్ కుమా ర్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు సిఎం సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని అన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సిఎం సహాయనిధి ద్వారా సహాయం అందేలా తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు .జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు డు గజంగి నందయ్య మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్లవాణి శ్రీనివాస్ ఎఎమ్ సి చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి,దామోదర్ రావు,మాజీ మున్సిపల్‌చైర్మన్‌అడువాలజ్యోతిలక్ష్మ ణ్ ఉన్నారు.

## గజ్వేల్ అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వండి

మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్‌లను కలిసిన కాంగ్రెస్ నేతలు



**ప్రజాపక్షం/గజ్వేల్:** గజ్వేల్ అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వాలని, పెండింగ్ పనులు పూర్తి చేయాలని, ఖాళీగా ఉన్న నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ గురువారం గజ్వేల్ కాంగ్రెస్ నేతలు మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామిలను కలసి విజ్ఞప్తి చేశారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలలో గజ్వేల్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, గత మూడేళ్లుగా అసంపూర్తి దశలో నిలిచిన రింగు రోడ్డు, రోడ్ల విస్తరణ, ప్రభుత్వ కార్యాలయాల మరమ్మత్తులు, నూతన భవనాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అలాగే వివిధ నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయడంతో పాటు రాష్ట్రస్థాయి పోస్టుల్లో గజ్వేల్ నేతలకు అవకాశం ఇవ్వాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. కాగా ఈ విషయాలపై మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు గజ్వేల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి నాయిని యాదగిరి, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్ గుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, లీగల్ సెల్ నేత సాజిద్ బేగ్, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు అశోక్ రెడ్డి, కీసర వెంకటేష్, జిల్లా మైనార్టీ సెల్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు సమీర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రశ్నించినందుకు కత్తితో దాడి

నలుగురికి గాయాలు.. మరో ఇద్దరిపై రాడ్లతో దాడికి యత్నం

**ప్రజాపక్షం/కొండపాక:** కొండపాక మండలం వెలికట్ట ఎక్స్‌రోడ్డు వద్ద వేగంగా కారు నడపడంపై ప్రశ్నించిన యువకులపై ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. మరో ఇద్దరిపై రాడ్లతో దాడికి యత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. వెలికట్ట గ్రామానికి చెందిన మెరుగు ప్రభాస్ తన స్నేహితులతో కలిసి ఈ నెల 20న రాత్రి డెక్కన్ చాయ్ హోటల్‌లో టీ తాగి బయటకు వస్తుండగా, ఆర్‌జే 19 సీఆర్ 1479 నంబరు గల స్విఫ్ట్ కారు వేగంగా వచ్చి వారి బైక్ ముందు ఆగింది. దీంతో రోడ్డుపై ప్రమాదకరంగా కారు నడపడంపై వారు ప్రశ్నించడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో కారులో ఉన్న రాజస్థాన్‌కు చెందిన రమేష్ కత్తితో ప్రభాస్‌పై దాడి చేయగా, అడ్డుకునే ప్రయత్నంలో అతడి ఎడమ చేతి బొటనవేలికి గాయమైంది. అడ్డుకోబోయిన భాస్కర్, నరేందర్, రంజిత్‌కు మార్‌లపై కూడా కత్తితో దాడి చేయడంతో గాయాలయ్యాయి. అక్కడే ఉన్న దుద్దెడకు చెందిన బస్వరాజ్ చంద్రుపై కూడా దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మరో ఇద్దరు రాకేష్, ధర్మపాల్ రాడ్లతో దాడికి యత్నిస్తూ దుర్భాషలాడినట్లు బాధితుడు ఆరోపించారు. బాధితుడు మెరుగు ప్రభాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు క్రైమ్ నంబర్ 207/2026గా కేసు నమోదు చేశారు.

## రైస్ మిల్లుల బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రైస్ మిల్లుల నుంచి రా వాల్సిన బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి సంబంధిత రైస్ మిల్ల ర్లు, అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, బకాయిలు చెల్లించని డిఫాల్టర్ రైస్ మిల్లర్ల ఆస్తులు, బ్యాంకు ఖాతాలను గుర్తించాలని ఆదేశించారు.రెండు, మూడు రోజుల్లోగా బకాయిలు చెల్లించని పక్షంలో రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం నిబంధనలకు అనుగుణంగా సంబంధిత రైస్ మిల్లుల ఆస్తులు, బ్యాంకు ఖాతాలను సీజ్ చేయాలని స్పష్టం చేశారు.అదేవిధంగా, సంబంధిత రైస్ మిల్లర్లు,వారి కుటుంబ సభ్యుల ఆస్తుల లావాదేవీలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్,జిల్లా జిల్లా మేనేజర్ శ్రీకాంత్,డి.సి.ఒ.శ్రీమాల,ఆర్‌డిఒగంగయ్య,సంబంధిత అధికారులు,తదితరులు,పాల్గొన్నారు.

## అత్యంత పారదర్శకంగా భూభారతి రీ సర్వే

అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్



**ప్రజాపక్షం/సిద్దిపేట :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూభారతి రీ సర్వే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ తెలిపారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ అధికారులతో పలు అంశాలపైన జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ మాట్లాడుతూ....భూ భారతిరీ సర్వే ప్రక్రియ జిల్లాలో ప్రతి మండలంలోని ఎంపిక చేసిన 2 గ్రామాల్లో కొనసాగుతుందని,రీసర్వే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని,రోజు వారిగా సర్వే వివరాలను అప్లోడ్ చెయ్యాలని ఆదేశించారు. గ్రామాల్లో సర్వేయర్, లైసెన్స్‌డ్‌సర్వేయర్,జిపిఒ ప్రతి రోజూ 40 ఎకరాలు తప్పనిసరిగా సర్వే చెయ్యాలని ఆదేశించారు. ముందుగా గ్రామ సరిహద్దులు సర్వే చెయ్యాలని, సర్వే చేసిన వెంటనే ఎల్ ఆర్ ఇవ్వాలని తెలిపారు. భూ భారతి అప్లికేషన్లు డిస్పోజల్ ప్రక్రియ నిర్ణీత కాలవ్యవధిలోపు పూర్తి చేయాలని,పెండింగ్ అప్లికేషన్లు నవంబర్ 5వ తేదీ లోపు డిస్పోజల్ చేయాలని ఆదేశించారు. జిల్లాలో దేవాదుల ప్రాజెక్టు,గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువల భూ సేకరణ వేగవంతం చెయ్యాలి. తహసీల్దార్ లాగిన్‌లో జిఒ59 పెండింగ్ అప్లికేషన్స్ క్లియర్ చెయ్యాలని ఆదేశించారు. డిఆర్‌ఒ నాగరాజమ్మ, ఆర్ డిఒలు సదానందం,చంద్రకళ,రామ్మూర్తి,ఎడి సర్వేలను సుదర్శ న్,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య,ఆయా మండల తహసీల్దార్లు పాల్గొన్నారు.

## పేదల పక్షాన నిలిచిన ప్రజా నాయకుడు పండుగ సాయన్న





**ప్రజాపక్షం/కరీంనగర్ / రాజన్న సిరిసిల్ల :** నిజాం కాలంలో పెత్తందార్ల అన్యాయాలకు, దొరల దోపిడీకి వ్యతిరేకం గా పోరాడి ఎంతో మంది పేదల కు అండగా నిలిచిన నిలిచిన మహనీయుడు పండుగ సాయన్న అని కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. గురువారం నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడిఒసి) లో పండుగ సాయన్న జయంతి కార్యక్రమాన్ని బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, డిఆర్ఒ స్వామి, బిసి సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, ఇతర అధికారులు, ము దిరాజ్ సంఘం నాయకులు సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, ముదిరాజ్ నాయకులు ఎం. నాగేష్ ముదిరాజ్, సిహెచ్. రాజన్న, గంగాధర కనకయ్య, బొమ్మరవేని తిరుపతి, రావనవేని సంపత్, పల్లె రాజశేఖర్, నిర్మల కిషన్, కొలకాని నర్సయ్య, పండుగ నాగరాజు పాల్గొన్నారు.

### పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు

పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వేడుకలు నిర్వహించగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆమె పండుగ సాయన్న ముదిరాజ్ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పండుగ సాయన్న అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఒ లక్ష్మీ నారాయణ, జిల్లా బిసిసంక్షేమ శాఖ అధికారి సౌజన్య, జిల్లా సహకార శాఖ అధికారి రామకృష్ణ, ముదిరాజ్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

## మానవతావాదిని కోల్పోయాం

రిటైర్డ్ ఎంపిడిఒ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే చాడ పరామర్శ



**ప్రజాపక్షం/హుస్నాబాద్:** మానవతావాది మంచి కి మారు పేరుగా ప్రభుత్వ ఉద్యోగిగా కళారంగాంలో మంచి పేరు ప్రతిష్టలు సం పాదించిన చిగురుమామిడి మండల రిటైర్డ్ ఎంపిడిఒ ఐత కైలాసం గుండె పోటుతో ఆకాల మృతి చెందడం చాల భాదకరమని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం హుస్నాబాద్‌లోని మాజీ ఎంపిడిఒ కైలాసం ఇంటికి చాడ వెంకటరెడ్డి పార్టీ నాయకులతో కలిసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన చిత్ర పటాన్నికి పూల మాల వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి కైలాసం గారి మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కైలాసం సతీమని స్వరాజ్యం, కుమారులు కుతూళ్లను ఓదార్చ వారికి మనోధైర్యం కల్పించారు. వెంకటరెడ్డి వెంట నాయకులు సత్యనారాయణ జాగీరు, జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేష్, గూడ పద్మ, లక్ష్మి నారాయణ, మల్లారెడ్డి, బండి రవిందర్, తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి, రీ-సర్వే పనులపై దృష్టి

## కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/మందమర్రి :** భూ భారతి, భూముల రీసర్వే, ఓటరు జాబితా సవరణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నస్పూర్ తహశీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పరిపాలనా వ్యవహారాలను, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటిస్తూ ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలని స్పష్టం చేశారు. భూ భారతి ద్వారా భూ సమస్యల పరిష్కారం, రీసర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తూ తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సంతోష్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# కొమురం భీమ్ ఆశయాలు నెరవేర్చాలి



**ప్రజాపక్షం/మావల:** ఆదివాసీ పోరాట యోధుడు కొమురం భీమ్ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ కలెక్టర్ చౌక్‌లోని ఆయన విగ్రహానికి సిపిఐ జిల్లా కన్వీనర్ ఎస్ విలాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. జల్ జంగల్ జమీన్ కోసం ప్రాణాలర్పించిన భీమ్ ఆశయాలను నెరవేర్చేందుకు గిరిజనులకు భూమి, అటవీ హక్కులు, విద్య, వైద్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కట్ట చంద్రమౌళి, సీనియర్ నాయకులు నర్సింగ్ రావు, కిష్టయ్య, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సాయన్న చరిత్ర.. నేటి తరానికి స్ఫూర్తిదాయకం



**ప్రజాపక్షం/మెదక్:** అణగారిన, బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం పండుగ సాయన్న చేసిన పోరాటం, కనబరిచిన ధైర్యసాహసాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.గురువారం మెదక్ కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో పండుగ సాయన్న జయంతి వేడుకలను నిర్వహించి,ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా పోరాడిన పండుగ సాయన్న సేవలు తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని కలెక్టర్ కొనియాడారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డీపీఆర్వో రామచంద్రరాజు, డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఉపేందర్, వివిధ సంఘాల నాయకులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొని పండుగ సాయన్నకు నివాళులర్పించారు.

**ఆసిఫాబాద్:** పెత్తందారుల అన్యాయాలకు ఎదురొడ్డి, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన బహుజన చైతన్య స్ఫూర్తిప్రదాత పండుగ సాయన్న అని జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ కొనియాడారు. కలెక్టరేట్ భవనంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పండుగ సాయన్న జయంతి వేడుకలకు కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరితో కలిసి ఆయన హాజరయ్యారు.

# మధ్యాహ్న భోజనం అమలులో నిర్లక్ష్యం

## కమలాపూర్ హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎంపై సస్పెన్షన్ వేటు

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** డిచ్‌పల్లి మండలంలోని కమలాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజన పథకం అమలులో నిర్లక్ష్యం వహించినట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆ పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు అమర్‌సింగ్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. 2026 సెప్టెంబర్ 15 నుంచి 22 వరకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించడంలో నిర్లక్ష్యం జరిగినట్లు పలు వార్తపత్రికల్లో ప్రచురితమైన కథనాలతో పాటు సంబంధిత అధికారులకు అందిన ఫిర్యాదులపై స్పందించిన కలెక్టర్ ఈ ఉదంతంపై విచారణ జరిపించారు. మధ్యాహ్న భోజనం అమలులో అలసత్వం చోటు చేసుకున్నట్లు వెల్లడి కాగా, విచారణ నివేదిక ఆధారంగా, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుని ఇన్‌చార్జి హెచ్‌ఎం అమర్‌సింగ్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులకందాల్సిన సంక్షేమ పథకాలు, ప్రయోజనాల అమలులో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఎంత మాత్రం ఉపేక్షించబోమని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు.

# మేకల కాపరిపై దాడి చేసిన డిఆర్‌ఒపై చర్యలు తీసుకోవాలి

## డిఎఫ్‌ఒకు ఆదివాసీ సంఘాల వినతి

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** పెంబి మండలంలో మేకల కాపరిపై దాడికి పాల్పడిన డిఆర్ఓ ప్రతాప్ నాయక్‌పై సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టిఎజిఎస్) రాజ్ గోండ్ సేవా సమితి నాయకులు డిమాండ్ చేశారు. గురువారం నిర్మల్ జిల్లా అటవీ శాఖాధికారి (డిఎఫ్ఒ) సుశాంత్ సుఖదేవ్ బొబడేను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.పెంబి మండలం లోతురా తండా తాటిగూడకు చెందిన ఆదివాసీ (పివిటిసి) మేకల కాపరి ఆత్రం శేషరావుపై పెంబి డిఆర్ఓ ప్రతాప్ నాయక్ దౌర్జన్యంగా దాడి చేశారని ఆరోపించారు.వినతిపత్రం స్వీకరించిన డిఎఫ్ఓ సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. రాజ్ గోండ్ సేవా సమితి నిర్మల్ జిల్లా అధ్యక్షులు ఆత్రం రాజేశ్వర్, ఉపాధ్యక్షులు మారుసుకోలా భీంరావ్, గౌరవ అధ్యక్షులు భగవంత్ రావు, ప్రధాన కార్యదర్శి ఆత్రం భీంరావ్, టిఎజిఎస్ నిర్మల్ జిల్లా కార్యదర్శి శంభు,నాయకులు విలాస్,రాంచందర్, శేషరావు, పాల్గొన్నారు.

# ఎరువుల దుకాణాల్లో తనిఖీ

**ప్రజాపక్షం/పాపన్నపేట:** ఎరువుల విక్రయాల్లో నిబంధనలు పాటించి రైతులకు సహకరించాలని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి కె.దేవ్ కుమార్ అన్నారు. గురువారంమండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, రిజిస్టర్లు,గోదాముల్లోని ఎరువులనిల్వలనుపరిశీలించారు. ఎరువులవిక్రయాలను తప్పనిసరిగా ఎఫ్ఎఫ్ఎస్ యాప్ ద్వారానే నిర్వహించాలని, దుకాణాలకు సంబంధించిన రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఎరువుల విక్రయాల్లో అక్రమాలకు పాల్పడినా, నిబంధనలు ఉల్లంఘించినా సంబంధిత లైసెన్స్ డీలర్లపై తగినచర్యలుతీసుకుంటామనిహెచ్చరించారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి పి.శ్రీనివాస రాజు, వ్యవసాయ విస్తరణ అధికారులు ఆసిఫ్, సంతోష్ కుమార్‌తో పాటు ఎరువుల డీలర్లు ఉన్నారు.

# ‘ఎల్ నినో’తో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అమలు

## విద్యుత్, తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ, కలెక్టర్ ఇలా త్రిపాఠి




**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ఎల్‌నినో ప్రభావంను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా రానున్న రోజుల్లో తాగునీరు, విద్యుత్ అవసరాలకు సంబంధించి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను అమలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. యాసంగి సీజన్‌లో వరి సాగు చేయకుండా క్షేత్రస్థాయిలో రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. సాంప్రదాయంగా వస్తున్న వరి పంటకు బదులుగా నీటి లభ్యత ఉన్న ప్రాంతాల్లో మొక్కజొన్న, పప్పు ధాన్యాలు, నూనె గింజలు, కూరగాయలు వంటి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ రానున్న రోజుల్లో ఎదురయ్యే విపత్కర పరిస్థితులను సమర్థవంతంగా అధిగమించాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యల విషయమై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఎల్‌నినో ప్రభావం అంతకంతకు తీవ్ర రూపం దాలుస్తున్న దృష్ట్యా రానున్న పరిస్థితులను ముందుగానే అంచనా వేసి తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. జలాశయాల్లో అందుబాటులోని నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవల్సిన అవసరముందన్నారు. రానున్న ఎనిమిది నుండి పది నెలలకు సంబంధించి గ్రామాల వారిగా సమగ్ర ప్రణాళికలు రూపొందించి పక్కాగా అమలయ్యేలా చూడాలన్నారు. ప్రతి గ్రామంలో తాగునీటి అవసరాలు, సాగునీటి లభ్యత, భూగర్భజలాల స్థితి, విద్యుత్ వినియోగం, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీటి సంరక్షణ సమస్యలపై ముందస్తు అంచనాలు రూపొందించాలని తెలిపారు. పరిస్థితులకనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకునేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. వచ్చే వర్షాకాలం వరకు జిల్లాలో ఎక్కడ కూడా ప్రజలకు తాగునీటి కొరత తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. యుద్ధప్రాతిపదికన మంచినీటి పైపులైన్ల మరమ్మతులు, నూతన నిర్మాణాలు, వ్యవసాయ బోర్లను అద్దెకు తీసుకోవటం వంటి వాటికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా సమస్యలుంటే వాటిని వెంటనే పరిష్కరిస్తూ నీటి సరఫరా వ్యవస్థలు సక్రమంగా పని చేసేలా అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, అధికారులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ మార్కెట్‌లో పత్తి కొనుగోళ్లు ప్రారంభం

**ప్రజాపక్షం/మావల:** ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో సిసిఐ, ప్రైవేట్ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లను జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎఎంసి చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి గురువారం పూజలు చేసి ప్రారంభించారు. ఈ ఏడాది ముహూర్తం రోజే క్వింటాల్‌కు రికార్డు స్థాయిలో రూ.9260 ధర లభించిందని తెలిపారు. జిల్లాలో 33 జిన్నింగ్ మిల్లులు, 18 కొనుగోలు తెచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# వేగవంతంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

## మెదక్‌ను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలి, కలెక్టర్ ప్రతిమా సింగ్

**ప్రజాపక్షం/మెదక్ :** జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, మంజూరైన ప్రతి ఇంటి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో మెదక్ జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గురువారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ ప్రకటన విడుదల చేస్తూ, నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ప్రతి మండలానికి ఆరుగురు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. ఒక్కో అధికారి నాలుగైదు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు. మొదటి, రెండో విడతల్లో ఇళ్లు మంజూరై ఇంకా నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, పనులు ప్రారంభించేలా అవగాహన కల్పించాలన్నారు.ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న లబ్ధిదారులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, తక్కువ ఖర్చుతో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా అధికారులు సహకరించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ప్రతి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తయ్యేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



# భూ తగాదాలకు తావులేకుండా పక్కాగా భూ రీ-సర్వే

## అదనపు కలెక్టర్ నగేష్

**ప్రజాపక్షం/మనోహరాబాద్ :** భూ తగాదాలను పరిష్కరించి,రైతులకు ఎలాంటి భూ వివాదాలు తలెత్తకుండా భూ రీ సర్వేను పక్కాగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. సర్వే ప్రక్రియలో కచ్చితమైన వివరాలను సేకరించి,పారదర్శకంగా భూముల కొలతలు చేపట్టాలని సూచించారు. గురువారం మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో కొనసాగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహిస్తున్న తీరును, అధికారులు చేపడుతున్న చర్యలను సమీక్షించారు. భూ రీ సర్వే విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి తప్పులకు తావులేకుండా సర్వే నిర్వహించాలన్నారు.రైతుల మధ్య భూ సంబంధిత వివాదాలు తలెత్తకుండా,భూముల హద్దుల విషయంలో స్పష్టత ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఇప్పటికే 1,200 ఎకరాల్లో భూ సర్వే నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ వెల్లడించారు. క్షేత్రస్థాయిలో అధికారులు పూర్తి వివరాలతో సర్వే చేపట్టి,భూ రికార్డుల్లో కచ్చితత్వాన్ని పాటించాలని ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే కీలకమని, ఈ ప్రక్రియను బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ ఆర్డీవో బావయ్య,ఏడీ ల్యాండ్ సర్వే కిషన్,తహసీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహసిల్దార్ కౌశికి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నాగరాజు, సర్పంచ్ అనూష, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



# రైతాంగానికి సాగునీరు, నాణ్యమైన విద్యుత్‌నందించాలి

## ఎంపి ధర్మపురి అరవింద్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** రైతాంగానికి సాగునీరు, నిరంతర నాణ్యమైన విద్యుత్‌నందించాలని, క్రాప్ హాలీడే ప్రకటిస్తే ఎకరాకు రూ.50 వేల నష్టపరిహారం చెల్లించాలని ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. గురువారం బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఇందూరు పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గోపిడి స్రవంతిరెడ్డి హాజరయ్యారు. జిల్లాలోని తాగు, సాగునీటి సమస్యలు, ప్రజా సమస్యలపై బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ కులాచారి తీర్మానాలను ప్రవేశపెట్టగా వాటికి ఇందూరు ఎంపీ ధర్మపురి అరవిద్‌తో పాటు కార్యవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

**ప్రవేశపెట్టిన ప్రధాన తీర్మానాలు :** ఎల్‌నినో ప్రభావంతో జిల్లావ్యాప్తంగా సాగునీరందక రైతులు వేసిన పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నాయి. అన్నదాతలను ఆదుకునేందుకు వ్యవసాయానికి రోజుకు కనీసం 8 గంటల పాటు నిరంతర, నాణ్యమైన త్రీ ఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలి, కరెంట్ కోతలు, లోవోల్టేజీ సమస్యలను పరిష్కరించని పక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున పోరాటాలకు దిగుతాం. ఎల్‌నినో ప్రభావంతో నీటి కొరతను సాకుగా చూపి రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడైనా క్రాప్ హాలీడే ప్రకటిస్తే రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున ప్రభుత్వం పరిహారం చెల్లించాలన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లోని మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న పెద్ద ఎత్తున ‘దీక్ష’ కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భూమన్న, భారత్‌రెడ్డి, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, ప్రమోద్‌కుమార్, జ్యోతి, రాజేశ్వర్, కిషన్, జిల్లా పదాధికారులు, మోర్చ జిల్లా అధ్యక్షుడు, పాల్గొన్నారు.

# పకడ్బందీగా టిజిపిఎస్‌సి పరీక్షలకు ఏర్పాట్లు

## కలెక్టర్ ప్రతీక్ జైన్



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న జిల్లాలో నిర్వహించనున్న అసిస్టెంట్ సైంటిస్ట్ ( అనలిస్ట్ గ్రేడ్. II కంప్యూటర్ ఆధారిత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సంబందిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఈ నెల 24 న జరిగే అసిస్టెంట్ సైంటిస్ట్ ( అనలిస్ట్ II ) పరీక్షకు సంబందించి గురువారం కలెక్టరేట్ మిని సమావేశ మందిరంలో ఎస్పీ పరితోష్ ఫంకజ్ తో కలిసి కలెక్టర్ సంబదిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. రుద్రారం, గ్రామంలోని గీతం యూనివర్సిటీలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మొత్తం 150 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్ష రెండు సెషన్లలో ఉంటుందని మొదటి సెషన్ ఉదయం 10.00 గంటల నుంచి మద్యాహ్నం 12.30 గంటలకు వరకు రెండో సెషన్ మద్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మొదటి సెషన్‌కు ఉదయం 8.30 గంటల నుంచి కేంద్రంలోకి అనుమతిస్తారని ఉదయం 9.30 గంటలకు గేట్లు మూసివేస్తారని తెలిపారు. రెండో సెషన్ మద్యాహ్నం 1 గంట నుంచి అనుమతిస్తారని మద్యాహ్నం 2.00 మూసివేస్తారని స్పష్టం చేశారు. గేట్లు మూసివేసిన తరువాత ఆలస్యంగా వచ్చే అభ్యర్థులకు అనుమతి ఉండదని తెలిపారు. అదనపు కలెక్టర్ పాండు ట్రాన్స్ కో ఎస్ఈ ఆర్టీసీ వైద్య ఆరోగ్య మహిళా శిశు, పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

**ప్రజాపక్షం/కాసిపేట:** చదువుపై ధ్యాస పెట్టడం లేదని తండ్రి మందలించడంతో మనస్తాపం చెందిన ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాసిపేట మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ ఎ. ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యంపల్లి గ్రామానికి చెందిన రైతు పాలగాని రాజన్న కుమారుడు విజయ్ కుమార్ (17) కాసిపేట మోడల్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలకు సరిగ్గా వెళ్లకుండా చదువును నిర్లక్ష్యం చేస్తుండటంతో తండ్రి రాజన్న అతడిని మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన విజయ్ కుమార్ ఈ నెల 16న ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు వెంటనే అతడిని కాసిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మంచిర్యాల, అనంతరం కరీంనగర్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున విజయ్ కుమార్ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# రాఘవ ఏజెన్సీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్




**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** మిషన్ భగీరథలో రాఘవ ఏజెన్సీ ద్వారా పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించి, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. ఎఐటియుసి ఆధ్వర్యంలో గురువారం మిషన్ భగీరథ ఇఇ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆఫీస్ సూపరింటెండెంట్ అర్షద్‌కు వినతిపత్రం అందజేశారు.జిఒ నంబర్ 6 ప్రకారం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. పెండింగ్ వేతనాలతో పాటు ఇపిఎఫ్ బకాయిలు జమ చేయాలని, నిబంధనలు పాటించని ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ గుర్తింపు కార్డులు, ఇఎస్ఐ సౌకర్యం, రూ.50 లక్షల ఆరోగ్య బీమా, ప్రమాద బీమా కల్పించాలని స్పష్టం చేశారు. యూనియన్ బ్రాంచి అధ్యక్షుడు జయకృష్ణ, ఉపాధ్యక్షులు తిరుపతి, బాపురావు, వినోద్, కార్యదర్శి రాజేశ్వర్, సహాయ కార్యదర్శులు శ్రీకాంత్, నరేందర్, కోశాధికారి షాబాజ్ పాల్గొన్నారు.

# పత్తి పంటలో అంతర పంటగా గంజాయి సాగు

## రూ.4 లక్షల విలువైన 40 గంజాయి మొక్కలు స్వాధీనం, నిందితుడు అరెస్ట్, బోథ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ మండలం నిగిని గ్రామ శివారులోని వ్యవసాయ భూమిలో తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని దురుద్దేశంతో అక్రమంగా గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు.అతని వ్యవసాయ భూమిలో పత్తి పంట మధ్యలో పెంచుతున్న 40 గంజాయిమొక్కలనుగుర్తించారు వీటి విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని అంచనా వేశారు.నిగిని గ్రామానికి చెందిన లక్ష్మన్ మడావి (51) తనకు గంజాయి తాగే అలవాటు ఉండటంతో గంజాయి కొనుగోలు చేసి వినియోగించిన అనంతరం మిగిలిన గంజాయి నుంచి విత్తనాలనుసేకరించినట్లు విచారణలో వెల్లడించారు.తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో తన వ్యవసాయ భూమిలో పత్తి పంట మధ్యలో ఎవరికీ తెలియకుండా గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు తెలిపారు. మొత్తం 40 గంజాయి మొక్కలు గుర్తించారు. ఒక్కో మొక్క విలువ సుమారు రూ.10,000 చొప్పున మొత్తం రూ.4 లక్షలుగా అంచనా వేశారు. గంజాయి సాగు, విక్రయాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని బోథ్ సీఐ డి. గురుస్వామి హెచ్చరించారు. గంజాయి సాగు చేసే వారికి ప్రభుత్వ పథకాలు అందకుండా సంబంధిత శాఖలకు సిఫార్సు చేస్తామని తెలిపారు. ఈ ఘటనపై బోథ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్టు చేయడం జరిగిందని తెలిపారు.బోథ్ ఎస్ఐ వి.పురుషోత్తం,పోలీసు సిబ్బంది,పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్ కార్యకర్తలపై దాడులు అరికట్టండి

## మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/మెదక్:** మెదక్ పట్టణంలో బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులు జరుగుతున్నా, బాధ్యులపై చర్యలు తీసుకోకుండా బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్నారని మాజీ ఉపసభాపతి ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.మెదక్ పట్టణంలోని 15వ వార్డులో ఆటో దహనం ఘటనతో పాటు హవేలీ ఘనపూర్‌లో బీఆర్ఎస్ నాయకులపై జరిగిన దాడులు, కేసుల విషయంలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని పద్మా దేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు.ఈ ఘటనలపై రెండు రోజుల్లో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అకిరెడ్డి కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు జుబెర్ అహ్మద్, దీపక్ కుమార్, హవేలీ ఘనపూర్ సర్పంచ్ సాయిలు, నాయకులు కృష్ణ గౌడ్, లింగారెడ్డి,మాయ మల్లేశం, మోచి కిషన్ సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

## 24న 'నీలవేణి' నాటక ప్రదర్శన

**ప్రజాపక్షం/ ఖమ్మం :** గొల్లపూడి మారుతీరావు, శ్రీనివాస్ దెంచనాల రచించిన 'నీలవేణి' నాటక నాల్గవ ప్రదర్శన 24న ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రదర్శించనున్నారు. తెలుగులో ఆధునిక, ఆధునికాంతర నాటకాలను 40 ఏళ్లుగా ప్రదర్శిస్తున్న జానపదం, ఆధునిక సంచార నాటక రిపర్టరీ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన ఇవ్వనున్నారు. నీలవేణి నాటకం స్త్రీ, పురుషుల సంబంధాన్ని, ఘర్షణను సామాజిక సమానత్వాన్ని, ప్రేమకు, అధికారతత్వానికి ఉన్న నిరంతరతను, మోహానికి, మరణానికి ఉన్న తాత్వికతను చూపనుంది. జనపదం నాటక రిపర్టరీ ఇప్పటి వరకు శ్రీనివాస్ దెంచనాల దర్శకత్వంలో 65 నాటకాలను, మూడువేల ప్రదర్శనలు ఇచ్చింది. ఇప్పటి వరకు ఈ నాటకాలను 20 లక్షల మంది వీక్షించినట్లు సమాచారం. ఖమ్మంలో ప్రజా నాట్యమండలి, ఖమ్మం కళాపరిషత్ అన్నాబత్తుల కళా సంస్థ ఈ నాటక ప్రదర్శనను సంయుక్తంగా నిర్వహించనున్నాయి.

## నిరుపయోగంగా ఇండోర్ స్టేడియం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** క్రీడాకారుల సౌకర్యార్థం లక్షలాది రూపాయలతో నిర్మించిన ఇండోర్ స్టేడియం నిరుపయోగంగా మారింది. స్టేడియంలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో క్రీడాకారులు ఎవరు ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో ఇండోర్ స్టేడియంను నిర్మించారు. ఎంతో ఉన్నత ఆశయంతో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలన్న సదుద్దేశంతో ఈ స్టేడియంను లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించారు. పక్కనే ప్రభుత్వ విద్యాలయం ఉండటం, సమీప గ్రామాలకు అందుబాటులో ఉండడంతో ఎంతో మంది క్రీడాకారులను ఈ స్టేడియంలో శిక్షణ పొంది ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని ఆశించారు. కానీ స్టేడియంలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో కొంత మంది గుత్తేదారులు తమ యంత్రాలను ఇక్కడ ఉంచేందుకు స్థలాన్ని ఉపయోగించుకుంటున్నారు. ఇండోర్ స్టేడియంలో కొంత మంది తమ వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకున్నారు. ఇప్పటికైనా ఇండోర్ స్టేడియంలో పూర్తి స్థాయి వసతులు కల్పించి క్రీడాకారులకు ఉపయోగపడేవిధంగా దానిని తీర్చిదిద్దాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోస్టర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 48వ జూనియర్ బాలికల అంతర్ జిల్లా హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్2026 పోస్టర్‌ను కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తుమ్మల యుగంధర్ గురువారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సర్దార్ పటేల్ మైదానంలో 31 నుంచి నవంబర్ రెండు వరకు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ క్రీడాప్రాధికార సంస్థ (శాట్స్), డివైఎస్ఒ, ఒలింపిక్ అసోసియేషన్ సహకారంతో నిర్వహించే ఈ టోర్నీ గ్రామీణ, పట్టణ ప్రాంత బాలికల క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు మంచి వేదికని, పోటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, ఎఎంసి ఛైర్మన్ హన్మంతరావు, కృష్ణమోహన్, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వరికుటి మోహన్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత పాటించాలి



**ప్రజాపక్షం/కూసుమంచి:** ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నిజమైన పేద లబ్ధిదారులకు న్యాయం చేయాలని, ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల నాయకులు గురువారం ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీలను రద్దు చేయాలని, గ్రామ పంచాయితీల్లో గ్రామసభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని నాయకులు కోరారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించాలని, అవసరమైతే లాటరీ పద్ధతిని అమలు చేసి ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో కూసుమంచి మండలం నుంచి సిపిఐ, సిపిఎం, బిఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణం కోసం ఎమ్మెల్యేకు వినతి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపలిటీ పరిధిలోని 9వ వార్డులో సిసి రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు సుమారురూ.6లక్షల నిధులు మంజూరు చేయాలని కోరుతూ వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌కు గుమ్మడిదల వెంకటనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, సంబంధిత మున్సిపల్ ఎఇ శ్రీమాన్యను నిధుల మంజూరుకు అవసరమైన అంచనా వ్యయాలు తయారు చేయాలని ఆదేశించారు. ఎస్టిమేట్ సిద్ధం చేసి తదుపరి ప్రక్రియ చేపట్టేందుకు ఎమ్మెల్యే ఆదేశాలతో సిసి రోడ్లు నిర్మాణానికి మార్గం సుగమవుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## యాసంగిలో వరి, మొక్కజొన్న సాగు తగ్గించాలి

**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి రైతు వేదికలో ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల మార్పిడి ప్రాధాన్యం, భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగంపై వివరించారు. యాసంగి సీజన్‌లో వరి, మొక్కజొన్న సాగును తగ్గించి, తక్కువ కాలపరిమితి కలిగిన పప్పు ధాన్య పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ఈకార్యక్రమంలో సాంకేతిక వ్యవసాయ అధికారి అరుణ, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# దేశానికి అసలైన వారసులు ఆదివాసీలే...

### మంత్రి సీతక్క
### ములకపాడులో కొమురం భీమ్ విగ్రహావిష్కరణ
### లక్ష్మీనగరం నుంచి ములకపాడు వరకు భారీ ర్యాలీ





**ప్రజాపక్షం/దుమ్ముగూడెం:** భారతదేశానికి అసలైన వారసులు ఆదివాసీలేనని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణకు, ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. గురువారం దుమ్ముగూడెం మండల ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ములకపాడు సెంటర్‌లో ఏర్పాటు చేసిన అమరవీరుడు కొమురం భీమ్ విగ్రహాన్ని ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, గిరిజన నాయకులతో కలిసి మంత్రి విగ్రహాన్ని, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఆదివాసీ రాష్ట్ర నాయకుడు వీరయ్య గిరిజన జెండాను ఎగురవేశారు. అంతకు ముందు లక్ష్మీనగరం సెంటర్ నుంచి ములకపాడు వరకు వేలాది మంది ఆదివాసీలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆత్మగౌరవ నినాదాలు, జై ఆదివాసీ, జై కొమురం భీమ్ నినాదాలతో మండల కేంద్రం మారుమోగింది.

### ఆదివాసీ హక్కుల పరిరక్షణకు కృషి

విగ్రహావిష్కరణ అనంతరం ములకపాడు ప్రభుత్వాసుపత్రి క్రీడా మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ ఆదివాసీల హక్కుల పరిరక్షణతో పాటు ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆదివాసీల సమస్యలపై అసెంబ్లీలో పోరాడతామని తెలిపారు. ప్రతి గిరిజనుడు తమ సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుని భవిష్యత్ తరాలకు అందించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు కొమురం భీమ్ అని కొనియాడుతూ, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.

### జిఒ నంబర్ 3పై స్పందించాలి

మాజీ ఎంపి బాబురావు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిఒ నంబర్ 3 రద్దు అంశంపై గిరిజన ఎమ్మెల్యేలందరూ స్పందించి ఆదివాసీ హక్కుల సాధనకు ఉద్యమించాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి కీలకమైన ప్రగల్లపల్లి ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని మంత్రి సీతక్కను కోరారు. ఈ సందర్భంగా ఆదివాసీ సమాజం తమ హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని, కొమురం భీమ్ జీవితాన్ని, పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఆదివాసీలు స్వేచ్ఛగా జీవించాలనే లక్ష్యంతో కొమురం భీమ్ సాగించాలని పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన నినదించిన జల్ జంగల్ జమీన్ ఆదివాసీల హక్కులకు, జీవన విధానానికి, ప్రకృతితో వారి అనుబంధానికి ప్రతీకగా నిలిచిందని కొనియాడారు.

## రైతు రుణాలు మాఫీ..'సర్'ని రద్దు చేయాలి

### ఆళ్లపల్లి, గుండాలను కరువు మండలాలుగా ప్రకటించాలి
### ఎన్నికల కమిషనర్ రాజీనామా చేసే వరకూ ఉద్యమాలు
### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తక్షణమే స్పందించాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావంతో పంటలు దిగుబడులు తగ్గి రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆళ్లపల్లి, గుండాల మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని, రైతుల బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని కోరారు. అనిశెట్టిపల్లి నుంచి మార్కోడ్ వరకు డబుల్ రహదారి నిర్మించాలని, ఆళ్లపల్లి మండల కేంద్రంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రేసు ఎల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగం ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటోందని సాబీర్ పాషా ఆవేదన వ్యక్తం చేశారు. పంటల దిగుబడులు తగ్గడంతో రైతులు పెట్టుబడుల కోసం చేసిన అప్పులు తీర్చలేని పరిస్థితి నెలకొందన్నారు. ఆళ్లపల్లి, గుండాల మండలాల్లో వ్యవసాయ పరిస్థితులను పరిశీలించి కరువు మండలాలుగా ప్రకటించాలని, రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను మాఫీ చేసి ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్షేత్రస్థాయి పరిస్థితులను గుర్తించి రైతులకు ఉపయోగపడే ఉపశమన చర్యలు చేపట్టాలని కోరారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా చేపడుతున్న ఎస్‌ఐఆర్‌ను రద్దు చేసి, బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని సాబీర్ పాషా డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ ఉద్యమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా ఎన్నికల నిర్వహణ ఉండాలని అన్నారు. ఈసమావేశంలో గుండాల మండల కార్యదర్శి వాగబోయిన రమేష్, మండల సహాయ కార్యదర్శులు ఎస్‌కె రహీం, వజ్జ పగడయ్య, ఊకే సమ్మయ్య, వజ్జ ఉమా, మచ్చ చిరంజీవి, తాటి ఎల్లయ్య, పరమ ఇమ్మానియేల్, నదీమ్, ఎల్లబోయిన నవీన్, ఆమీర్, శ్రీరామ్, సమ్మయ్య, బచ్చల రామయ్య, గుగ్గిల లక్ష్మీ, వార్డు సభ్యులు, మండల నాయకులు, వివిధ గ్రామాల కార్యదర్శులు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

## డిసెంబర్‌లో ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర మహాసభలు

### మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మి కుమారి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్ఐడబ్ల్యూ) రాష్ట్ర 3 వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి పిలుపునిచ్చారు. డిసెంబర్ 27, 28, 29 తేదీల్లో ఖమ్మం నగరంలో రాష్ట్ర మహాసభలు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరగనున్నాయని ఆమె తెలిపారు. ఈ మహాసభల విజయవంతం కోసం శుక్రవారం ఖమ్మం బైపాస్ రోడ్డులోని వాసిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో మహాసభల ఆహ్వాన సంఘ సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సన్నాహక భేటీకి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నలుమూలల నుంచి సుమారు 200 మంది మహిళా సమాఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల మహిళా ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళల సమస్యల పరిష్కారానికి, హక్కుల రక్షణకు ఐక్య పోరాటాలు నిర్మించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రాబోయే రాష్ట్ర మహాసభలకు సంబంధించి పక్కా కార్యాచరణను ఈ సమావేశంలో రూపొందించనున్నట్లు వెల్లడించారు.

## కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

### స్వచ్ఛ ఆటో డ్రైవర్ శ్రీహరి మృతి బాధాకరం
### కార్మికుడి కుటుంబానికి అండగా ఉంటాం
### కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 58వ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆటో డ్రైవర్ శ్రీహరి ఆకస్మిక మరణం తీవ్ర విచారకరమని, వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని కొత్తగూడెం నగర మేయర్ మూడ్ గణేష్ పేర్కొన్నారు. చుంచుపల్లి మండలం గాంధీ కాలనీ నివాసి, కార్పొరేషన్ స్వచ్ఛ ఆటో డ్రైవర్ కె. శ్రీహరి (38) గురువారం గుండెపోటుతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మేయర్ వెంటనే మృతుడి స్వగృహానికి చేరుకుని, పార్థివదేహంపై పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజారోగ్యం కోసం శ్రమిస్తూ పారిశుద్ధ్య విభాగంలో సేవలందించిన నిబద్ధత కలిగిన కార్మికుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తామని, అకాల మరణం చెందిన శ్రీహరి కుటుంబాన్ని కార్పొరేషన్ తరఫున ఆదుకోవడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మృతుడి భార్య, వృద్ధురాలైన తల్లిని పరామర్శించి, వారికి మనోధైర్యాన్ని చెబుతూ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో ఎఐటియుసి జిల్లా కార్యదర్శి నగేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు, చుంచుపల్లి మండల సిపిఐ కార్యదర్శి వాసిరెడ్డి మురళి ఉన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా కార్మికుడి మృతిపట్ల సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

### గ్రామస్థాయిలో ముమ్మరంగా ఓటర్ల నమోదు చేపట్టాలి
### కాంగ్రెస్ నాయకుల పిలుపు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఖమ్మం–నల్గొండ –వరంగల్ పట్టభద్రుల నియోజక వర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. గురువారం వీడియోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో రఘునాథపాలెం మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఖమ్మం నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో అర్హులైన పట్టభద్రులందరిని ఓటర్లుగా నమోదు చేయించే బాధ్యతను గ్రామ సర్పంచ్‌లు, గ్రామశాఖ అధ్యక్షులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలన్నారు. ఈ నమోదు ప్రక్రియను నవంబర్ ఒకటవ తేదీ నాటికి నూటికి నూరు శాతం విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టభద్రుల నమోదు కోసం రఘునాథపాలెం మండలంలో ఆరు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, వి.వెంకటాయపాలెం సొసైటీ ఛైర్మన్ సైదుబాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఆనంద్, రఘునాథపాలెం మండల పార్టీ అధ్యక్షుడు దేవ్‌సింగ్, నాయకులు కొంటెముక్కుల నాగేశ్వరరావు, సర్పంచ్ సిద్దయ్య, భూక్యా సక్రి మంగిలాల్ పాల్గొన్నారు.

## గోవులను అక్రమ రవాణా చేస్తున్న వాహనం పట్టివేత

**ప్రజాపక్షం/పాల్వంచ :** గోవుల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ తోట నాగరాజు అన్నారు. పాల్వంచ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం అర్ధరాత్రి విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలం వైపు నుండి కొత్తగూడెం వెళుతున్న ఓ బొలెరో వాహనం అతి వేగంగా, అనుమానాస్పదంగా కనిపించినది. స్పందించిన పోలీసులు స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా గోవులను అక్రమంగా రవాణా చేస్తున్న తెలుసుకొన్నారు. వెంటనే వాహనాన్ని స్టేషన్‌కు, ఆవులను నవభారత్‌లోని గోశాలకు తరలించారు. లక్ష్మిదేవిపల్లి మండలం హాలియా తండాకు చెందిన వాహన డ్రైవర్ కొర్రా రాములు, కొత్తగూడెం ఓల్డ్ డిపో ప్రాంతానికి చెందిన ఫయాజ్ ఖురేషి, రెహాన్‌లపై కేసు నమోదు చేశామని ఎస్‌హెచ్ఒ తెలిపారు.

## అభివృద్ధికి స్పష్టమైన లక్ష్యంతో పనిచేయాలి

### స్వల్పకాలిక లక్ష్యాలను ఆరు నెలల్లో పూర్తి చేయాలి
### కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** జిల్లా అభివృద్ధి కోసం అన్ని శాఖలు స్పష్టమైన లక్ష్యంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ కోరారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిసి జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై సమీక్షించారు. అధికారులు వివరించిన ప్రణాళికలను కలెక్టర్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి శాఖ స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించుకోవాలని తెలిపారు. స్వల్పకాలిక లక్ష్యాలను ఆరు నెలల్లో వంద శాతం సాధించేలా, మధ్యకాలిక లక్ష్యాలను ఏడాదిలో నెరవేర్చుకునేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. ముఖ్యమైన పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన తెలిపారు. కార్యాచరణ సిద్ధమైన తర్వాత అవసరమైన కన్సల్టెన్సీ సేవలను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. వైద్య సేవలు మరింత మెరుగుపడాలని శిశు మరణాలు, మాతృ మరణాల రేటును తగ్గించేందుకు కృషి జరగాలన్నారు. పిల్లల్లో తీవ్రమైన పోషకాహార లోపం తగ్గించేందుకు ఒక ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రతి అంశంపైన లక్ష్యాలు అమలు విధానం పర్యవేక్షణకు సంబంధించి వివరాలను సరైన పద్ధతిలో నమోదు చేయాలన్నారు. శిక్షణ, ఉపాధి, విద్యా ప్రమాణాల పెరుగుదల, నైపుణ్య శిక్షణ, వసతి గృహాల్లో తాగునీటి పరిస్థితి, పరిశ్రమలు, మిర్చి ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆన్‌లైన్ సేవలు, పట్టణాల్లో మౌలిక సదుపాయం, జనాభా పెరుగుదలకు అనుగుణంగా నివాసాల విస్తరణ, కొత్త కాలనీల ఏర్పాటు తదితర వాటిపై చర్చించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, సిపిఒ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కార్మిక అధికారి కార్యాలయంలో ఇష్టారాజ్యం

### ఫైళ్లను పరిశీలిస్తున్న ప్రైవేటు వ్యక్తులు
### పైసలుంటేనే ఫైలు కదిలేది
### ఏజెంట్ల ద్వారా భారీ వసూళ్లు
### అసలైన లబ్ధిదారులకు మొండిచేయి






**ప్రజాపక్షం/ మధిర :** ఇక్కడ ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ కరువు. ప్రైవేటు వ్యక్తులు లేదా అధికారులు నియమించుకున్న ప్రైవేటు ఏజెంట్లు కార్యాలయానికి వచ్చి ఫైళ్లను చక్కబెడుతుంటారు. తమకు ఎవరైతే మామూళ్లు ఇచ్చారో వారి ఫైళ్లకు మాత్రమే కదిలే అర్హత ఉంటుంది. నిజమైన లబ్ధిదారులు ఏజెంట్లను ఆశ్రయించి ఎంతో కొంత ముట్టజెప్పకపోతే ఆ ఫైలు ఏళ్లు గడిచినా ముందుకు కదలదు. యథేచ్ఛగా కార్మిక శాఖ కార్యాలయానికి వచ్చిన ఫైళ్లను ప్రైవేటు వ్యక్తులు చక్కబెడుతున్నారంటే ఇక్కడి పనితీరు ఏ విధంగా ఉందో అవగతమవుతుంది. మధిర సహాయ కార్మిక శాఖాధికారి కార్యాలయం పైరవీలకు అడ్డాగా మారింది. అధికార యంత్రాంగమే పైరవీలను ప్రోత్సహిస్తుంది. కార్మిక శాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన మొత్తాన్ని ఇచ్చేందుకు పెద్ద మొత్తంలో లంచాలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కార్మికుల నుంచి వచ్చిన దరఖాస్తులను ప్రైవేటు వ్యక్తులు పరిశీలిస్తున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో చెప్పాల్సిన అవసరం లేదు. లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి వచ్చే మొత్తంలో సగ భాగం ఇక్కడ కార్యాలయంలో ఉన్న ప్రైవేటు వ్యక్తులే తీసుకుంటున్నారని దీనిలో అధికారులకు వాటాలను ముట్టజెబుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో కార్మిక శాఖ వద్ద రిజిస్ట్రేషన్ కాని వ్యక్తులకు ఇన్సూరెన్స్‌ల పేరుతో మరణించిన తర్వాత పెద్ద మొత్తంలో ఇప్పించి చాలా మంది అరెస్టయ్యారు. దీనికి సంబంధించి అప్పుడు రాష్ట్రంలో సంచలనం చోటు చేసుకుంది. దాదాపు 100 మందిని పోలీసులు విచారించారు. అయినా మధిర కార్మిక శాఖ తీరు మారలేదు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి. ఆసుపత్రుల్లో నర్సులుగా పనిచేస్తున్న వారిని వివిధ ప్రాంతాలలో వేరువేరు వృత్తుల్లో ఉన్న వారు ప్రమాదవశాత్తు మరణిస్తే కార్మికులుగా చూపించి ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి లబ్ధి చేకూర్చేందుకు పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నారు. కార్మికులు కానివారు అనేక మందిని అర్హులుగా గుర్తించి కార్మిక శాఖ గుర్తింపు కార్డులు అందజేస్తున్నారు. మధిర కార్యాలయం కేంద్రంగా దాదాపు 10 మందికి ఈ ఫైళ్లు పరిశీలించడం లబ్ధిదారుల నుంచి నగదు వసూలు చేయడం వృత్తిగా మారింది. దీనిపై పూర్తి విచారణ జరిపి కార్మిక శాఖలో జరుగుతున్న అవకతవకలను అరికట్టడంతో పాటు నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలని కార్మికులు కోరుతున్నారు.

### మేమే పిలిపించాం : కార్మిక అధికారి

కార్యాలయంలో ప్రైవేటు వ్యక్తులు ఫైళ్లు చక్కబెట్టడం లబ్ధిదారుల జాబితాను తయారు చేయడానికి సంబంధించి 'ప్రజాపక్షం' దినపత్రిక మధిర సహాయ కార్మిక అధికారి రమేష్‌ను ప్రశ్నించగా మా వద్ద సిబ్బంది లేరు మేమే కొంత మంది వ్యక్తులను పిలిపించాం. వారు క్రమం తప్పకుండా మా కార్యాలయానికి వస్తుంటారు. ఇందులో తప్పేముంది అంటూ ప్రశ్నించారు. మేము కార్యాలయంలో లేనప్పుడు ఫైళ్లు పరిశీలిస్తే తప్పు కానీ మేము మా కార్యాలయంలో ఉన్నప్పుడు ఇతరులు వచ్చి ఫైళ్లు పరిశీలించడం తప్పు కాదంటూ సమాధానం ఇచ్చారు. ఏ ప్రభుత్వ కార్యాలయంలోనైనా ఇలా ప్రైవేటు వ్యక్తులు లబ్ధిదారుల ఎంపిక జాబితాను పరిశీలిస్తారా? అని ప్రశ్నించగా ఆ విషయం నాకు తెలియదు. మావద్ద మాత్రం ఇలా జరుగుతుందంటూ ఆయన చెప్పుకొచ్చారు.

# దావూద్ ముఠాతో భారత్‌కు సంబంధమేంటి?

- ఐక్యరాజ్యసమితి నివేదికలో పక్షపాత ధోరణి
- భారత ప్రతినిధి రఘుపూరి విమర్శ



**న్యూయార్క్:** పాకిస్థాన్ ఉగ్రవాదులతో చేతుల కలిపి కుట్రచేసిన దావూద్ ఇబ్రహీం భారతదేశం నుండి ఏనాడో పారిపోయి వాంటెడ్ ఉగ్రవాదిగా ముద్రవేసుకుంటే అతడి డి– కంపెనీ భారతదేశానికి చెందిన నేర ముఠా ఎలా అవుతుందని ఐక్యరాజ్యసమితిని భారతదేశం ప్రశ్నించింది. ఐక్యరాజ్యసమితి మానవహక్కుల నివేదిక తప్పుల తడకలా ఉందని, ప్రపంచానికి సంబంధించిన ఇంతటి బాధ్యతాయుతమైన సంస్థ ఏ విధంగా ఇలా అసమర్థంగా తప్పులు చేస్తుందని నిలదీసింది. ఈ తప్పును సరిదిద్దాలని కోరింది. ఐక్యరాజ్యసమితిలో భారత్ శాశ్వత మిషన్ మొదటి కార్యదర్శి యు,ఎన్.రఘూపూరి బుధవారం ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో గట్టిగా నిలదీశారు. మానవహక్కుల రక్షణ, ప్రోత్సాహం, ప్రాథమిక హక్కులు స్వేచ్ఛలుపై ప్రత్యేక ప్రతినిధిగా ఉన్న ఐక్యరాజ్యసమితి అధికారి బెన్ సౌల్ రూపొందించిన నివేదికలో దావూద్ ఇబ్రహీం నాయకత్వానగల డి–కంపెనీని భారత్ కేంద్రంగా పనిచేసే నేర ముఠాగా పేర్కొనడాన్ని రఘుపూరి తీవ్రంగా తప్పపట్టారు. సౌల్ నిదికలో పక్షపాత ధోరణి ఉందని,ఈ అత్యున్నతమైన సంస్థ నిష్పక్షపాతం,నిజాయతీ పాటించాలని కోరింది.ఇది అంతర్జాతీయ సంస్థ అసమర్థతగా పేర్కొన్నారు.2003లో భద్రతామండలి దావూద్ ఇబ్రహీంను ఒక నేరముఠా నాయకుడుగా జాబితాలో చేర్చింది.డి–కంపెనీ అల్‌ఖైదాతో సంబంధాలు పెట్టుకుంది.1993లో భారతదేశంలో జరిగిన ఉగ్రవాదుల దాడులకు సంబంధించి దావూద్ ఇబ్రహీం ప్రధాన నిందితుడుగా దేశం వదిలివెళ్ళిపోయి పాకిస్థాన్ దేశంలో స్థిరపడి వాంటెడ్ క్రిమినల్‌గా ఉన్నప్పుడు భారతదేశానికి చెందిన డి–కంపెనీ నేరముఠాగా ఐక్యరాజ్యసమితి నివేదిక ఎలా గుర్తిస్తుందని పూరి ప్రశ్నించారు.బిన్‌లాడెన్‌ను అమెరికా సైన్యాలు హతమార్చిన (2011)నగరంలోనే దావూద్ ఇబ్రహీం కూడా ఉండేవాడని,లాడెన్‌కు అతడికి సంబంధాలు ఉన్నాయని చెప్పారు.

# ఫ్రాన్స్‌వ్యాప్తంగా నిరసనలపై నిషేధం

- నవంబరు 5న జాతీయ సమ్మెకు సంఘాల పిలుపు
- సంక్షోభ నివారణపై మేక్రాన్ చర్చలు
- విదేశీయుల జోక్యం, వ్యాఖ్యలపై విమర్శలు

**పారిస్:** ఫ్రాన్స్‌లో అల్లర్లు, హింసాకాండ పతాకస్థాయికి చేరుకున్న తర్వాత ప్రభుత్వం అప్రమత్తమై అణచివేత చర్యలను మరింత కఠినతరం చేసింది. జీవన వ్యయాలు, అసమానతలను వ్యతిరేకిస్తూ, పారిస్, లియోన్‌లలో ప్రధానంగా నిరసన ప్రదర్శనలు చెలరేగకుండా గురువారం అనేకచోట్ల నిషేధాజ్ఞలు, రాత్రిపూట కర్ఫ్యూ అమలులోకి తెచ్చారు. పారిస్, లియోన్, లిల్లే, గ్రెనోబుల్ ప్రాంతాలలో నిరసన ప్రదర్శనలను నిషేధించారు. కాగా నవంబరు ఐదో తేదీన జాతీయ సమ్మె పాటించేందుకు కార్మికసంఘాలు, ఇతర వివిధ గ్రూపులు పిలుపు ఇచ్చాయి. పాఠశాలలకు సెలవులు ప్రారంభమైనందువల్ల విద్యార్థులు వీధుల్లోకి వచ్చే అవకాశాలు మందగిస్తాయని, అందువల్ల తాము విద్యార్థులను సమీకరించే ప్రయత్నాలు చేస్తామని, నిరసన తమ హక్కు అని ఉన్నత పాఠశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థి సంఘాలు ప్రకటించాయి. శనివారంనాడు ''పసుపు చొక్కాల ఉద్యమం'' భారీ ప్రదర్శనకు పిలుపు ఇచ్చింది. 2018లో ఫ్రాన్స్‌ను దిగ్భ్రాంతపరచిన అతి సుదీర్ఘమైన నిరసనను ఈ పసుపు చొక్కాల ఉద్యమమే నిర్వహించింది.



దేశంలో ఏర్పడిన నిరసనల సంక్షోభంపై గూఢచారి విభాగంతో, ఇతన ఉన్నతాధికారులు, మంత్రులతో దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ సమీక్షా సమావేశం నిర్వహించారు. శాంతి భద్రతల నిర్వహణలో ఇప్పటివరకూ జరిగిన తప్పులను ఆయన సమీక్షించారు. ఇక మీదట ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న విషయాలపూ ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే 2,400 మందిని అరెస్టు చేయగా, కీలక వ్యక్తులుగా భావించిన 174 మంది జైళ్ళకు తరలించారు. విదేశీ నాయకులు, ముఖ్యంగా డోనాల్డ్ ట్రంప్ ఫ్రాన్స్ అల్లర్ల విషయంలో జోక్యం చేసుకుని, పనిగట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మేక్రాన్ విమర్శలు చేశారు. విదేశాలల ఉండే నాయకులు తమ స్వార్థంకోసం ఫ్రాన్స్‌లో ఉన్న అస్థిర సంక్షోభ పరిస్థితులను ఉపయోగించుకుని వ్యాఖ్యానాలు చేస్తున్నారని విమర్శించారు.
పారిస్ నగరానికి ఆగ్నేయంగా ఉన్న క్రెటెయిల్‌లోని ఒక ఉన్నతపాఠశాలలో సిబ్బంది కొరతను వ్యతిరేకిస్తూ గతనెలలో మొట్టమొదట నిరసన ప్రారంభమై క్రమంగా దేశమంతా విస్తరించింది.చివరకు ఇది ఎన్నికల సమస్యగా కూడా మారింది.మేక్రాన్ రాజీనామా చేయాలని నిరసన ప్రదర్శకులు,ప్రతిపక్షాలు కూడా డిమాండ్ చేస్తున్నాయి.ప్రస్తుతం ఉద్యమం నివురుగప్పిన నిప్పులా ఉంది.

# రష్యా-ఉక్రేన్ పరస్పర దాడులు

- శాంతి చర్చలపై ఆశలు ఆవిరి

**కీవ్:** శాంతి చర్చల పునరుద్ధరణకు చర్చలు జరిగిన మరునాడే రష్యా–ఉక్రేన్ దేశాల మధ్య పరస్పర దాడులు జరిగాయి. మాస్కోపైకి దూసుకువస్తున్న 808 డ్రోన్లను కుప్పకూల్చినట్లు రష్యా సైనిక బలగాలు ప్రకటించగా, రష్యా చేసిన దాడుల్లో ఏడుగురు మరణించినట్లు ఉక్రేన్ చెప్పింది. గురువారం తెల్లవారకముందుగానే గంటలతరబడి రష్యా తమ దేశంలోని 12 ప్రాంతాలపై దాడులు చేసిందని పేర్కొంది. ఉక్రేన్ ప్రధాన నగరం కీవ్‌పై 21 బాలిస్టిక్ క్షిపణి దాడులు జరిగాయి. ఈ పరస్పర దాడులకు ముందురోజు రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని కాన్‌స్టాంటిన్ ప్యాలెస్‌లో అమెరికాఅధ్యక్షుడు ట్రంప్ ప్రతినిధులు స్టీవ్ విట్‌కాఫ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్‌తో మూడు గంటల సేపు సమావేశం జరిపారు. ఈ సమావేశంలో యుద్ధానికి తెరదించేవిధంగా అడుగులు పడ్డాయి. యుద్ధం ముగించేందుకు, మధ్యవర్తిగా అమెరికాతో కలిసి ఉక్రేన్‌తో త్రైపాక్షిక చర్యలు పునరుద్ధరించేందకు పుతిన్ సూత్రప్రాయంగా అంగీకారం తెలియజేశారని రష్యా విదేశాంగమంత్రి యూరి ఉషకోవ్ బుధవారం ప్రకటించారు.

# మితవాదంవైపే ఇజ్రాయెల్ మొగ్గు!

- వచ్చే సోమవారమే ఎన్నికలు

**టెల్‌అవీవ్:** మరో ఐదు రోజుల్లో అక్టోబరు 27న నెతన్యాహూ భవిష్యత్తును తేల్చిచెప్పే కీలక ఎన్నికలు ఇజ్రాయెల్‌లో జరుగనున్నాయి.మొదటిసారి ఓటింగ్‌లో పాల్గొనే కొత్త జనరేషన్ ఈసారి రంగంలోకి దిగుతున్నది. దాదపు 5.90 లక్షల మంది కొత్త ఓటర్లు ఈసారి 19 వయసుకు చేరుకుని బ్యాలెట్ పత్రాలను చేతుల్లోకి తీసుకుంటున్నారు. పోల్ సర్వేల ప్రకారం ఎక్కువమంది కొత్త ఓటర్లు మితవాదంవైపు మొగ్గుచూపుతున్నారు. రెండు దేశాల పరిష్కారం(ఇజ్రాయెల్–పాలస్తినా శాంతియుత సహజీవనం) విధానాన్ని వ్యతిరేకిస్తున్నారు. 2022 నాటికంటే ఈ సారి చాలా తక్కువమంది శాంతియుత సహజీవాన్ని ఆశ్రయించారు. పార్లమెంటులో మొత్తం 120 స్థానాలు ఉండగా, 61 స్థానాలు గెలుచుకున్న కూటమి లేదా పార్టీ అధికారాన్ని చేజిక్కించుకుంటుంది. ట్రంప్ బహిరంగ మద్దతు,ఫ్లయ్ దుబాయ్ హైజాక్ ప్రయత్నం సంఘటనలు నెతన్యాహూకు ఎంత వరకూ కలిసివస్తాయన్న విషయం మరో వారం రోజుల్లో తేలిపోతుంది.నెతన్యాహూను గెలిపించాలంటూ ఇజ్రాయెల్ ప్రజలకు ట్రంప్ బహిరంగంగా పిలుపు ఇచ్చారు. తాను ఎవరిపక్షం వహించబోనని మొన్నటివరకూ ఆయన మాట్లాడి ఆకస్మికంగా మాట మార్చి బహిరంగంగా నెతన్యాహూకు బాసటగా నిలిచారు.

## అమ్మకాలు ఆపాలి

(మొదటి పేజీ తరువాయి)

వివరించాలి' అని అమర్‌జిత్ కౌర్ పేర్కొన్నారు. ఈ విక్రయం ఉద్యోగ భద్రత, వేతనాలు, కార్మిక హక్కులు, కార్మిక సంఘాల స్వేచ్ఛ, సామూహిక చర్చల హక్కులు, పెన్షనర్ల ప్రయోజనాలకు విఘాతమన్నారు. బ్యాంకు శాఖల నిర్వహణ, ఆర్థిక సేవల సమ్మిళితత్వం, ఖాతాదారుల డిపాజిట్లు, వ్యవసాయం, చిన్న వ్యాపారాలు, సామాన్య ప్రజలకు రుణాలపై కూడా ప్రభావం తప్పబోదని హెచ్చరించారు. ఉద్యోగులు, పెన్షనర్లు, ఖాతాదారుల ప్రయోజనాలకు చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని అమర్‌జిత్ కౌర్ డిమాండ్ చేశారు. నిరుద్యోగం, ఆర్థిక అనిశ్చితి వేళ ప్రభుత్వం ఈ విధంగా పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటీకరణ విధానాలను అనుసరించడం ఎంత వరకు సమంజమసని ప్రశ్నించారు. తక్షణమే ఈ విధానాన్ని విడనాడాలని అమర్‌జిత్ కౌర్ సూచించారు. ప్రభుత్వ ఆస్తుల విక్రయం ద్వారా వచ్చే తాత్కాలిక ఆదాయం, అవి భవిష్యత్తులో అందించే నిరంతర ఆదాయానికి, డివిడెండ్లకు, ప్రజా ప్రయోజనాలకు ప్రత్యామ్నాయం కాలేవన్నారు. ఐడీబీఐ బ్యాంకు విక్రయాన్ని నిలిపివేయాలని, ఈ లావాదేవీని పార్లమెంటు పరిశీలించాలని, ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల సొమ్ము వారి ప్రయోజనాలకే ఉపయోగపడాలన్నారు. ప్రజలకు, ఆర్థిక వ్యవస్థకు దోహదమయ్యే విధంగా బ్యాంకింగ్ వ్యవస్థ పని చేయాలని ఏఐటీయూసీ కోరుతున్నట్లు అమర్‌జిత్ కౌర్ తెలిపారు.

## బిసి–ఎలోకి ముదిరాజ్‌లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రణాళికతో సముచిత నిర్ణయం తీసుకుంటామన్నారు. ముదిరాజ్‌లను బిసి–ఎ గ్రూపులో చేర్చడం ద్వారా గంగపుత్రులకు అన్యాయం జరుగుతుందన్న అనుమానాలు, అపోహలు ఉన్నాయని, అన్ని వివరాలపై ఆ వర్గాలతో చర్చించి వారిలోని అపోహలను దూరం చేయాలని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సిఎం సూచించారు. ''కులగణన లెక్కలే బలహీనవర్గాలకు ధైర్యాన్నిచ్చాయి. అడిగే హక్కును కల్పించింది. ప్రతి ఇంటి తలుపు తట్టి సమాచారాన్ని నిక్షిప్తం చేశారు. లెక్కల్లో తేడాలు ఉన్నాయని భావిస్తే, ఏదైనా కారణంతో ఎవరి వివరాలైనా నమోదు కాకపోతే, వారి వివరాలను నమోదు చేయించండి. ఒకటి అరా ఎక్కడైనా తప్పిపోతే లెక్కలను సవరించుకోవడం మన బాధ్యత. ప్రభుత్వం పారదర్శకంగా ఉంది. పక్కాగా లెక్కగట్టి సామాజిక న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ ఆశయం. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో పక్కా న్యాయం జరగాలన్నదే లక్ష్యం'' అని ముఖ్యమంత్రి వివరించారు. ఎస్‌సి ఉపకులాల వర్గీకరణ కోసం చాలా మంది బిడ్డలు ప్రాణాలు కోల్పోయారని, 40 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న ఈ సమస్యను ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిష్కరించిందని గుర్తు చేశారు. దేశంలోనే ఎస్‌సి కులాల వర్గీకరణ చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలబడ్డామని చెప్పారు. నిరుపేదలు, బహుజనులకు అండగా వారి భూములను రక్షించాలని, జమీందార్లు, జాగీర్దార్లు, భూస్వాములకు వ్యతిరేకంగా పౌరుషంతో నేలకొరిగినా ఫరవాలేదని సర్వం ఒడ్డి పండుగ సాయన్న పోరాటం చేశారని కొనియాడారు. నిరుపేదలు పండుగ సాయన్న పేరును జానపదాల రూపంలో పల్లెల్లో ఇప్పటికీ స్మరిస్తారని చెప్పారు. ఆ గొప్ప పోరాటయోధుడు పాలమూరు బిడ్డ అయినందుకు తనకెంతో గర్వకారణంగా ఉందన్నారు. జాతి మొత్తం తలెత్తుకునే విధంగా చరిత్ర పుటల్లో పండుగ సాయన్నకు ఒక పేజీ ఉండాలని, సమాజానికి ఉపయోగపడేది ఏదైనా తక్షణ నిర్ణయం తీసుకుంటానని సిఎం చెప్పారు. గత పాలకులు అమలు చేసిన సంక్షేమ పథకాలు వేటినీ రద్దు చేయకుండా వాటిని మరింత మెరుగ్గా రెండింతలు చేసి అమలు చేస్తున్నామని వివరించారు. సర్వాయి పాపన్న గౌడ్, దొడ్డి కొమురయ్య, కొండా లక్ష్మణ్ బాపూజీ, జ్యోతీరావు పూలే, చాకలి ఐలమ్మ ఎంతో మంది బహుజనుల కోసం పోరాడిన యోధులని సిఎం గుర్తు చేశారు. కొందరు పోరాట యోధుల చరిత్రను కనుమరుగు చేశారని, జాతి కోసం జీవితాంతం తపించి, సర్వం త్యాగం చేసిన వారికి చరిత్రలో స్థానం లేకపోతే, ఈ నేల ఉన్నా లేకపోయినా ఒకటేనని సిఎం వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండ ప్రకాష్, ఎంపిలు ఎం.అనిల్ కుమార్ యాదవ్, ఈటల రాజేందర్, సలహాదారు వి.హనుమంతరావు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కదిలించాలి

(మొదటి పేజీ తరువాయి)

నిలపాలన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు ఆశ్చర్యపరిచేవిగా ఉన్నప్పటికీ ప్రమాదకరంగా మారడం బాధాకరమన్నారు. జర్నలిస్టులు, సబ్‌ఎడిటర్లు, గ్రామీణ విలేకరులు అందరూ ఆధునిక పోకడలకు అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)పై నిరంతర అధ్యయనం చేస్తూ సమగ్ర, విశ్లేషణాత్మక వార్తలు అందించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే, నవచేతన విజ్ఞాన సమితి చైర్మన్ పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అత్యంత ప్రజాదరణ, విశ్వసనీయ వార్తలతో పురోగమిస్తున్న ప్రజాపక్షం దినపత్రిక 8 ఏళ్ల ప్రస్థానం పూర్తిచేసుకుని, 9వ సంవత్సరంలోకి అడుగిడటం సంతోషదాయకమని, ఈ కృషి వెనక ప్రజాపక్షం జర్నలిస్టులు, సబ్‌ఎడిటర్లు, జిల్లా, మండల విలేకరులు, అడ్వర్టైజ్‌మెంట్, సర్క్యులేషన్ విభాగం, సిబ్బంది పాత్ర వెలకట్టలేనిదని అభినందించారు. ప్రజాపక్షం సంపాదకులు మక్కెన సుబ్బారావు మాట్లాడుతూ వార్తల్లో క్వాలిటీ, ప్రింటింగ్ క్వాలిటీపై మరింత దృష్టి పెట్టామని, అక్షరదోషాలకు తావులేని మరిన్ని మెరుగైన వార్తలతో పత్రికను సర్వాంగ సుందరంగా పాఠకులకు అందించే కృషి జరుగుతోందన్నారు. జర్నలిస్టులు అనునిత్యవిద్యార్థులుగా పత్రికాపఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలన్నారు. నవచేతన విజ్ఞాన సమితి కార్యదర్శి మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోశాధికారి వి.రత్నాకర్ రావు, 'నవచేతన' గవర్నింగ్ బాడీ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, జనరల్ మేనేజర్ (యాడ్స్) వి.మదన్, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ బొమ్మగాని కిరణ్ కుమార్, అసిస్టెంట్ ఎడిటర్ బి.లక్ష్మి నారాయణ (బిఎల్), న్యూస్ ఎడిటర్ పి.శ్రీనివాస్ రెడ్డి (ఎస్‌విఆర్) సబ్ ఎడిటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



## అంగీకారం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశమై, పెరుగుతున్న ప్రపంచ అస్థిరతలమధ్య ఇరుదేశాల ద్వైపాక్షిక భాగస్వామ్యానికి మరింత ప్రోత్సాహం,కొత్త ఊతం ఇవ్వాలని ప్రతిజ్ఞ చేశారు. ఉక్రేన్‌లో యుద్ధం ముగించే శాంతిసాధన ప్రయత్నాలకు మరింత బలం చేకూర్చాలనే ప్రపంచ సంకల్పం నేపథ్యంలో డోనాల్డ్ టస్క్ భారత్‌లో మూడురోజులు పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా నరేంద్రమోదీ మాట్లాడుతూ, ఉక్రేన్‌లో శాంతి సాధనకు జరుగుతున్న ప్రతి అర్థవంతమైన ప్రయత్నానికీ భారతదేశం మద్దతు తెలియజేస్తుందని ప్రకటించారు. భారత్–పోలెండ్ రెండు దేశాలు ప్రజాస్వామ్య విలువలను, చట్టపరమైన నిబంధనలను విశ్వసిస్తాయని, అందువల్ల ప్రశ్చిమాసియాలోనూ,ఉక్రేన్‌లోనూ శాంతిని కోసం పునరుద్ధరించిన ప్రతి అర్థవంతమైన ప్రయత్నానికీ భారత్ మద్దతు ఇస్తుందన్నారు. కాగా, పోలెండ్ కంపెనీలను భారత్‌కు ఆహ్వానిస్తామని, ఇరు దేశాల కంపెనీలు వ్యూహాత్మక రంగాలలో సహ–అభివృద్ధి, సహ–ఉత్పత్తి, సహ–భాగస్వామ్యం వహిస్తాయన్నారు. పోలెండ్ నిపుణులతో కలిసి కీలకమైన ఖనిజవనరులు, బొగ్గు ఆధారిత వ్యవస్థలను అభివృద్ధి చేయడంలో కొత్త భాగస్వామ్యం చేపడతామన్నారు.భారత్–పోలెండ్ మధ్య స్నేహసంబంధాలు కేవలం దౌత్యబంధంపై మాత్రమే ఆధారపడిలేవని,మానవసంబంధాల ఉమ్మడి వారసత్వం,అనుబంధంపై కూడా ఆధారపడి ఉందన్నారు.
''రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో జామ్‌నగర్ రాచకుటుంబాలు,కొల్హాపూర్ రాచకుటుంబాలు వేలాదిమంది పోలెండ్‌కు చెందిన పిల్లలకు ,కుటుంబాలకు భారతదేశంలో ఆశ్రయం కల్పించారని ఈ సందర్భంగా నరేంద్ర మోదీ గుర్తుచేశారు.2022లో రష్యాతో యుద్ధం ప్రారంభమైనప్పుడు ఉక్రేన్‌లో చదువుకుంటున్న భారతీయు విద్యార్థులను సురక్షితంగా స్వదేశం చేర్చడానికి పోలెండ్ ప్రభుత్వం ఎంతగానో సహకారం అందజేసి తన పూర్తి మద్దతు ఇచ్చిందని కూడా గుర్తుచేసుకున్నారు.రెండు దేశాలమధ్య పెరుగుతున్న ఆర్థిక లావాదేవీలను కూడా ఆయన తన పత్రికా ప్రకటనలో ఉటంకించారు.''ప్రపంచం ఈనాడు అనిశ్చితికాలంలో కొనసాగుతోంది,మార్పులకు గురవుతోంది.ఇలాంటి సమయంలో కూడా భారత్–పోలెండ్ దేశాలు వృద్ధి,సాంకేతికత,నూతన ఆవిష్కరణల విషయంలో ముఖ్యమైన కేంద్రాలుగా రూపుదిద్దుకుంటున్నాయి,ఉభయదేశాల భాగస్వామ్యంతో కొత్త అవకాశాలు వస్తాయి,భారత్–యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం తదుపరి ఈ అవకాశాలు మరింతగా విస్తరిస్తుంది,యంత్రాలు,రసాయనాలు,ప్లాస్టిక్స్‌వంటి ఎగుమతులకు అవకాశాలు వస్తాయి,భారత్‌నుండి ఇంజనీరింగ్ వస్తువులు కూడా పోలెండ్‌కు ఎగుమతి అవుతాయి'' అని చెప్పారు.రైల్వేలు,ఇతర రవాణారంగ వ్యవస్థలు,తయారీ రంగం,ఆహార శుద్ధి,బయోటెక్ వంటి రంగాలలో కూడా పోలెండ్ నుండి భారత్‌కు పెట్టుబడులు తరలివస్తాయని మోదీ తన ప్రకటనలో పేర్కొన్నారు.ప్రపంచానికి సరఫరా గొలుసు వ్యవస్థలుగా ఇరు దేశాలు పనిచేయగలవన్న విశ్వాసం వ్యక్తం చేశారు.2030 నాటికి రెండు దేశాల మధ్య వాణిజ్య రెట్టింపుస్థాయికి పెరుగుతుందన్నారు.

## ప్రజా నిరసనల వేదిక

(మొదటి పేజీ తరువాయి)

దానికి మించిన ప్రజానిరసన వేదిక మరొకటి లేదని అన్నారు. అందుకోసమే జంతర్ మంతర్‌ను నిరసన స్థలిగా కొనసాగించేందుకు ఇండియా ఐక్య సంఘటన డిమాండ్ చేస్తున్నట్లు డి.రాజా వెల్లడించారు. ఇదిలావుంటే, ఇండియా ఐక్య సంఘటన ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో భాగంగా ఆందోళనలు చేపట్టనున్నది. నవంబరు 1న న్యూఢిల్లీలో భారీ ర్యాలీ... ఎన్నికల సంఘం కార్యాలయం వరకు మార్చ్ నిర్వహించనున్నది.

**పలస్తీనాకు సిపిఐ సంఘీభావం**

పలస్తీనాకు భారత కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ సంఘీభావం ప్రకటించింది. భారత్‌పలస్థీనా సంఘీభావం వర్ధిల్లాలని నినాదమిచ్చింది. భారత్‌కు పలస్తీనా రాయబారి అబ్దుల్లా ఎంఎ అబుషావేశ్ గురువారం న్యూఢిల్లీలోని సిపిఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌ను సందర్శించారు. ఆయనకు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శులు డా.బాలచంద్ర కాంగో, రామకృష్ణా పాండా ఆత్మీయ ఆహ్వానం పలికారు. అంతర్జాతీయ పరిణామాల గురించి చర్చించారు. పలస్తీనా ప్రజలకు సంపూర్ణ సంఘీభావం తెలిపారు. గజాలో మారణహోమాన్ని అంతం చేయడమే కాకుండా తమ స్వాతంత్ర్యం, మర్యాద, సార్వభౌమత్వం, దేశహోదా కోసం పలస్తీనా ప్రజలు చేస్తున్న పోరాటానికి సిపిఐ నాయకులు పూర్తిస్థాయిలో మద్దతు ప్రకటించారు.

## ప్రభుత్వం వివక్ష

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్దిదారుల ఎంపికకు సంబంధించి ఇందిరమ్మ గ్రామ కమిటీలను తక్షణం రద్దు చేయాలని లాటరీ పద్ధతిలో లబ్దిదారులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ, సిపిఎం, బిఆర్‌ఎస్, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్, సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ తదితర పార్టీల నేతృత్వంలో ఖమ్మం ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి వివిధ పక్షాల నాయకులు మాట్లాడుతూ అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు దక్కడం లేదని ఎల్1, ఎల్2, ఎల్3 తో పాటు ప్రభుత్వ నిబంధనలను పక్కనపెట్టి అధికార పార్టీ కార్యకర్తలకు ఇండ్లు కట్టబెడుతున్నారన్నారు. రాష్ట్ర మంత్రులు ఇందిరమ్మ ఇండ్లలో ఎటువంటి వివక్ష లేదని అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెబుతున్న మాటలకు గ్రామాల్లో జరుగుతున్న పరిణామాలకు పొంతన లేదన్నారు. ఆచరణలో తద్విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అధికార యంత్రాంగం సైతం అధికార పార్టీకి దాసోహం అంటూ క్యాంపు కార్యాలయాల్లో లబ్దిదారులను ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి ఖర్చు చేస్తున్న సొమ్ము కాంగ్రెస్ పార్టీదో , మంత్రులదో కాదని అది ప్రజా ధనమని ప్రజా ధనంపై అందరికీ హక్కు ఉంటుందని వారు స్పష్టం చేశారు. రాజీవ్ గాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు 73, 74 రాజ్యాంగ సవరణ చేశారని దానిని కూడా కాంగ్రెస్ పార్టీ తుంగలో తొక్కి సర్పంచులకు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపికలో కనీస ప్రమేయం లేకుండా చేస్తుందని నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ వారే పన్ను కడుతున్నారా ఇతరులు పన్ను కట్టడం లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ కండువ కప్పుకుంటేనే ఇండ్లు ఇస్తామన్నది సమాంజసం కాదని పద్దతి మార్చుకోకపోతే పతనం తప్పదని హెచ్చరించారు. పేదలందరికీ ఇండ్లు ఇవ్వాల్సిన ప్రభుత్వం రాజకీయ వివక్షకు తావిచ్చి కాంగ్రెస్సేతర రాజకీయ పక్షాలలో ఉన్న వారికి ఇండ్లు ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని బోనకల్లు, కల్లూరు మండలం మర్లపాడులో ప్రభుత్వం వ్యవహరించిన తీరుకు నిదర్శనమన్నారు. గతంలో పేదలను గుర్తించి లాటరీ పద్ధతిలో లబ్దిదారులను ఎంపిక చేసే వారని కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం తీరు మార్చుకుని తక్షణం ఇందిరమ్మ గ్రామ కమిటీలను రద్దు చేసి అర్హులను గుర్తించి లాటరీ పద్ధతిలో లబ్దిదారులుగా ఎంపిక చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ గేటు వద్ద దాదాపు గంట సేపు బైఠాయించారు. జిల్లా నలుమూలల నుంచి వామపక్షాలు, బిఆర్‌ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేయడంతో పాటు జిల్లాలో నెలకొన్న పరిస్థితిని అర్హులకు జరుగుతున్న అన్యాయాన్ని కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, ఎంఎల్‌సి తాతా మధు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌ఎలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోత్ చంద్రావతి, జెడ్పి మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజు, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి సివై పుల్లయ్య, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి బండారు ఐలయ్య, సిపిఐ(ఎంఎల్)చంద్రన్న వర్గం నాయకులు సురేందర్, వివిధ పార్టీల నాయకులు మహ్మద్ మౌలానా, బెల్లం వేణుగోపాల్, బండి రమేష్, మాదినేని రమేష్, జమ్ముల జితేందర్ రెడ్డి, యర్రాబాబు, ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, ఆవుల అశోక్, జి. రామయ్య, శిరోమణి, ఝాన్సీ, లక్ష్మి నారాయణ, యర్రా శ్రీనివాసరావు, పగడాల నాగరాజు, బొమ్మెర రామ్మూర్తి, వివిధ గ్రామాల సర్పంచులు, కౌన్సిలర్లు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

## ఏయిర్‌పోర్ట్‌పై హౌతీల దాడి

(మొదటి పేజీ తరువాయి)

మౌలిక సదుపాయాలపై చేసిన ఈ దాడులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం''అని విదేశీమంత్రిత్వశాఖ ప్రకటన పేర్కొంది. ఈ దాడులు చాలా దురదృష్టకరమని, పౌరులు మరణిస్తున్నారని పేర్కొంది. మృతుడి కుటుంబానికి హృదయపూర్వక సంతాపం, సానుభూతి తెలియజేసింది. రియాద్‌లో ఉన్న భారత దౌత్య కార్యాలయం కూడా సౌదీ అధికారులతో ఎప్పటికప్పుడు ఈ పరిణామాలపై సంప్రదింపులు చేస్తోంది.
కాగా సౌదీ అరేబియాలో ఉన్న ప్రస్తుతం నెలకున్న పరిస్థితులపై భారత్ సహా అనేకదేశాలు తమ తమ ప్రజలకు ముందస్తు అప్రమత్తత హెచ్చరికలు జారీ చేశాయి. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ప్రమాద ప్రాంతాలకు వెళ్ళవద్దని, బయట తిరగవద్దని కోరాయి. ఇక అమెరికా మాత్రం సౌదీఅరేబియాలో ఉన్న అమెరికా ప్రజలు, కుటుంబాలు ఖాళీచేసి రావాలని అదేశించింది. సౌదీ అరేబియా నుండి సౌదీఅరేబియాలోని ఆరామ్‌కో ఆయిల్ ఫీల్డ్‌పై హౌతీ తిరుగుబాటుదారులు డ్రోన్లు ప్రయోగించారు. ఈ డ్రోన్లను సౌదీ దళాలు కూల్చివేశాయి. ఐతే ఈ డ్రోన్ల శకలాలు తగలడంతో ఇద్దరు సౌదీయులు మరణించారు. చమురు కార్యకలాపాలకు తాజా దాడుల్లో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. అదేవిధంగా దమ్మామ్ ఏర్‌పోర్ట్‌పై జరిగిన దాడుల్లో మరణించినవారి సంఖ్య రెండుకు పెరిగింది. మరోవైపు యెమెన్‌లో అంతర్జాతీయ గుర్తింపు పొందిన సౌదీఅరేబియా కూటమి దళాల మద్దతుగల ప్రభుత్వ సైన్యాలకు, హౌతీ తిరుగుబాటుదారులకు మధ్య తైజ్ రాష్ట్రంలో ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. గడచిన ఆగస్టు నుండి ఇప్పటివరకూ 2.60 లక్షలమంది యెమెన్ సాధారణ పౌరులు నిరాశ్రయులయ్యారని, ఇతర ప్రాంతాలకు వలసవెళ్ళారని ఐక్యరాజ్యసమితి మానవతావ్యవహారాల పమన్వయ కార్యాలయం (ఓసిహెచ్‌ఎ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. బుధవారం జరిగిన దాడుల్లో అనరుల్లా హౌతీసైన్యానికి చెందిన 285 మంది మరణించడమో, ఎక్కువమంది గాయపడటమో జరిగిందని ఓసిహెచ్‌ఎ ప్రకటించింది.

## పశ్చిమాసియాలో మళ్ళీ యుద్ధం?

హౌతీ తిరుగుబాటుదారులు పేట్రేగిపోవడంతోపాటు హోర్ముజ్ జలసంధిలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, చమురు ట్యాంకర్లు, నౌకలపై ఆగని దాడుల పూర్వరంగంలో ఇరాన్‌పై ఈసారి మళ్ళీ అమెరికా–ఇజ్రాయెల్ యుద్ధాన్ని పునరుద్ధరించే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ''ఇరాన్ విషయంలో త్వరలో ఏదో ఒకటి జరుగుతుంది'' అని డోనాల్డ్ ట్రంప్ తాజా సంకేతాలు పంపించారు. ఇరాన్‌తో తాము ఎలాంటి చర్చలూ జరపడం లేదని కూడా స్పష్టం చేశారు. దీనికి ప్రతిగా ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి స్పందిస్తూ, తమ దేశాన్ని కాపాడుకునేందుకు సర్వసన్నద్ధంగా ఉన్నామని ప్రకటించారు. సాధ్యమైనంతవరకూ దౌత్యానికే ప్రాధాన్యతనిస్తామని, అంతర్జాతీయ నిబంధనలను గౌరవిస్తామని ఫైనాన్సియల్ టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.
అదేవిధంగా ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్(ఐఆర్‌జిసి) ఒక ప్రకటన చేస్తూ, ఇరాన్ కళ్ళుగప్పి, తమను సంప్రదించకుండా అక్రమ దారులలో వాణిజ్య నౌకలు ప్రయాణాలు సాగిస్తే దాడులు తప్పవని, అమెరికా గనుక ఇదేవిధంగా అడ్డదారుల్లో నౌకల ప్రయాణాలను ప్రోత్సహిస్తే ఈ ప్రాంతంలో దాని కీలక స్థావరాలపై మళ్ళీ దాడులు ప్రారంభిస్తామని హెచ్చరిక చేసింది. ఇప్పటికే గల్ఫ్‌లో నాలుగు ట్యాంకర్లపై దాడులు చేశామని, మరో మూడు ట్యాంకర్లు హోర్ముజ్ జలసంధిలో దొడ్డిదారిన ప్రయాణాలు చేస్తూ సముద్ర మందుపాతరలను ఢీకొట్టి ధ్వంసమయ్యాయని గుర్తుచేసింది. కాగా, ఇరాన్ అణు కేంద్రాలు, ఇతర ప్రాంతాలపై అక్టోబరు 10వ తేదీన తాము తలపెట్టిన దాడులను ట్రంప్ అడ్డుకున్నారన్న మీడియా వార్తలు నిజం కాదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ అన్నారు.ఐతే నవంబరు మూడోతేదీన మధ్యంతర ఎన్నికలు ముగిసేవరకూ ట్రంప్ యుద్ధానికి ఇష్టంగా లేరని అనధికార వర్గాలు ప్రకటించాయి. ఇరు దేశాలమధ్యా చర్చల ప్రక్రియ కూడా స్తంభించిపోయింది. ఈ విధంగా ఇరువైపుల నుండీ పరస్పర హెచ్చరికలు వస్తూ ఉండటంతో అంతర్జాతీయ మార్కెట్‌లో మరోవైపు ప్రామాణిక బ్రెంట్ కూడ్రాయిల్ బ్యారెల్ ధర 111.26 డాలర్లకు చేరుకుంది.

## విలయ తాండవం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజాసంఘాల నాయకులు హాజరయ్యారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా సాగిన ఈ వేడుకలో డప్పులు, సాంస్కృతిక ప్రదర్శనలు అందరిని అలరించాయి. విభిన్న రంగాల్లో ప్రతిభ కనబరిచిన కళాకారులను దత్తాత్రేయ, విజయలక్ష్మి సన్మానించారు. అతిథులకు తెలంగాణ సంప్రదాయ వంటకాలతో ఆత్మీయ ఆతిథ్యం ఇచ్చారు. తెలంగాణ అంటే ఆత్మగౌరవం, అన్యాయాన్ని ఎదుర్కొనే తత్వమని విజయలక్ష్మి అన్నారు.

**కలిసే వేదిక : దత్తాత్రేయ**

కులమతాలు, రాజకీయాలు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రజలందరిని ఒకే వేదికపైకి తీసుకొచ్చే కార్యక్రమమే అలయ్ బలయ్ అని బండారు దత్తాత్రేయ అన్నారు. వ్యక్తుల మధ్య ఎన్ని భిన్నాభిప్రాయాలు, రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వాటన్నింటినీ పక్కనపెట్టి ఆత్మీయంగా కలుసుకోవాలని, ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకోవాలని సూచించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు పరస్పర సహకారంతో ముందుకు సాగుతూ అభివృద్ధి చెందాలని, రెండు రాష్ట్రాల ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగాలని ఆయన అన్నారు.

**2047 నాటికి వికసిత్ భారత్ : వెంకయ్య నాయుడు**

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ మనుషులతో కేవలం కాంటాక్ట్ కాకుండా కనెక్ట్ అయి ఉండాలని సూచించారు. ఆకలి దప్పులు లేని, అవినీతికి, అఘాయిత్యాలకు తావులేని దేశాన్ని నిర్మించుకోవాలన్నారు. గతంలో భారతీయుల మధ్య ఉన్న విభేదాలను బ్రిటిష్ పాలకులు తమకు అనుకూలంగా మలుచుకుని దేశాన్ని పాలించి, దేశ సంస్కృతిని దెబ్బతీశారన్నారు. మనుషుల మధ్య ప్రేమను పంచేది, మానవత్వాన్ని ముందుకు తీసుకెళ్లేది అలయ్ బలయ్ అని ఆయన అన్నారు. ప్రకృతితో కలిసి జీవించాలని, ప్రకృతిని నిర్లక్ష్యం చేయడం వల్లనే కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నామన్నారు. తెలుగును కాపాడుకోవాలని, భారతీయ భాషలను గౌరవించాలని, మాతృభాష కంటి చూపు లాంటిదని చెప్పారు.

**దేశంలోని అన్ని ప్రాంతాల్లో మత్తును పారదోరలి : గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా**

నషా ముక్త్ భారత్ చేయాలని, దేశంలోని అన్ని ప్రాంతాలలో మత్తును పారదోరలని గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా పిలుపునిచ్చారు. మన సంస్కృతిని పాటిస్తూనే ఇతరుల సంస్కృతులను, సాంప్రదాయాలను గౌరవించాలని యువతకు సూచించారు. మత్తుకు దూరంగా ఉండాలన్నారు. మత్తును పారదోసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. దేశ ఐక్యత తెలంగాణ సాంప్రదాయాన్ని, సంస్కృతిని అలయ్ బలయ్‌లో చూస్తున్నామన్నారు. భిన్నంత్వంలో ఏకత్వంగా దేశం ఐక్యతతో ముందుకు సాగాలన్నారు.

**మత్తు వల్ల యువతే కాదు..దేశం, ఆ కుటుంబం కూడా బలహీనమే... : పంజాబ్ గవర్నర్**

మత్తు పదార్థాల బారిన పడి యువత బలహీనపడుతోందని, తద్వారా దేశం, ఆ కుటుంబం కూడా బలహీనపడుతోందని పంజాబ్ గవర్నర్ గులాబ్ చంద్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశ యువతను బలహీనపరిచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, మత్తును పారదోలడమే ముఖ్యమని, దాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. అందరిని ఒకే వేదికపైకి తీసుకొచ్చి, భిన్నత్వంలో ఏకత్వాన్ని ఈ వేదిక నిరూపించిందన్నారు.

**హిందువులంతా ఐక్యంగా ఉంటేనే పండుగలు జరపుకోగలం : కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

హిందువులంతా ఐక్యంగా ఉంటేనే పండుగలు జరపుకోవచ్చని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ప్రపంచంలోని హిందువులంతా దసరా జరుపుకుంటారని, అయితే కొన్ని ప్రాంతాల్లో హిందూ పండుగలు జరుపుకోలేని పరిస్థితి ఉందన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులు మైనార్టీలుగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు హిందూ దేవుళ్లను అవహేళన చేస్తున్నారన్నారు. దసరా వచ్చిందంటే అలయ్ బలయ్ గురించే మాట్లాడుకుంటామని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు నుంచే దత్తాత్రేయ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని గుర్తుచేశారు. మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు మాట్లాడుతూ రాజ్యాంగంలో సౌభ్రాతృత్వం అనే పదాన్ని చేర్చడానికి అంబేద్కర్ ఎంతో కృషి చేశారన్నారు. ప్రపంచమంతా భారత్ వైపే చూస్తోందని, అన్ని రంగాల్లో భారతదేశాన్ని గురువుగా భావిస్తున్నారన్నారు.

**రాజకీయాలకు అతీతంగా తెలంగాణ అభివృద్ధికి కలిసి పనిచేయాలి : మంత్రి పొన్నం ప్రభాకర్**

తెలంగాణ అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దత్తన్న అలయ్ బలయ్ గొప్ప ఆలోచనతో చేస్తుందన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసం అన్ని రాజకీయ పార్టీలను ఒకే వేదికపైకి తీసుకరావాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న బండారు విజయలక్ష్మి, దత్తాత్రేయలకు అభినందనలు తెలిపారు. తెలంగాణ అభివృద్ధి అనేది ఒక రాజకీయ పార్టీకి సంబంధించిన అంశం కాదని, తెలంగాణ ప్రజలందరి ఆకాంక్ష అని అన్నారు. మాజీ మంత్రి జానారెడ్డి మాట్లాడుతూ 20 ఏళ్లుగా కులమతాలు, పార్టీలకు అతీతంగా అలయ్ బలయ్ జరుగుతోందని, ఇది మనందరి ఐక్యతకు చిహ్నమని, తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే వేదిక అని అన్నారు.

# ఆసియా పారా క్రీడల్లో భారత్‌కు పతకాల పంట

**టోక్యో:** జపాన్‌లో జరుగుతున్న ఆసియా పారా క్రీడల్లో భారత అథ్లెట్ల పతకాల వేట కొనసాగుతోంది. నాలుగో రోజు గురువారం అథ్లెటిక్స్‌లో దిలీప్ గవిత్, సోలైరాజ్ ధర్మరాజ్ స్వర్ణ పతకాలు సాధించారు. దీంతో భారత్ మొత్తం పతకాల సంఖ్య 88కి చేరింది. ఇందులో 21 స్వర్ణాలు, 26 రజతాలు, 41 కాంస్యాలు ఉన్నాయి.

**శీతల్ దేవికి రెండు స్వర్ణాలు...**చేతులు లేకుండానే విలువిద్యలో ప్రపంచస్థాయిలో రాణిస్తున్న భారత ఆర్చర్ శీతల్ దేవి మరోసారి తన అసాధారణ ప్రతిభను చాటుకుంది. మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకం సాధించి, వరుసగా రెండో ఆసియా పారా గేమ్స్‌లో ఛాంపియన్‌గా నిలిచింది. శీతల్ దేవి వ్యక్తిగత విభాగంలో స్వర్ణం గెలవడానికి కొన్ని గంటల ముందే తోమన్ కుమార్‌తో కలిసి కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలోనూ పసిడి పతకం సాధించింది. ఒకే రోజు రెండు స్వర్ణాలు గెలుచుకుని భారత పతకాల సంఖ్యను పెంచింది. ఈ ఆసియా పారా క్రీడల్లో శీతల్‌కు ఇది వడో పతకం. వ్యక్తిగత, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో స్వర్ణాలు సాధించగా, మహిళల డబుల్స్‌లో ఒడిశాకు చెందిన పాయల్ నాగ్‌తో కలిసి రజత పతకాన్ని గెలుచుకుంది.






**400 మీటర్ల పరుగులో దిలీప్‌కు రెండో స్వర్ణం**
పురుషుల 400 మీటర్ల టీ47 ఫైనల్లో దిలీప్ గవిత్ 48.27 సెకన్లలో గమ్యాన్ని చేరి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఇప్పటికే 100 మీటర్ల టీ47 విభాగంలోనూ పసిడి పతకం సాధించిన అతడు.. ఈ పోటీల్లో రెండో స్వర్ణాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. 2023లో హాంగ్‌జౌలో జరిగిన ఆసియా పారా క్రీడల్లో గెలిచిన 400 మీటర్ల టైటిల్‌ను కూడా నిలబెట్టుకున్నాడు.

**లాంగ్‌జంప్‌లో ఆసియా క్రీడల రికార్డు...**పురుషుల లాంగ్‌జంప్ టీ44/టీ62/టీ64 ఫైనల్లో సోలైరాజ్ ధర్మరాజ్ 7.15 మీటర్ల దూరం దూకి స్వర్ణం సాధించాడు. ఈ క్రమంలో ఆసియా పారా క్రీడల రికార్డును నెలకొల్పాడు. గత క్రీడల్లో సాధించిన టైటిల్‌ను నిలబెట్టుకున్నాడు.

**స్విమ్మింగ్‌లో మరో రెండు కాంస్యాలు**
పారా స్విమ్మింగ్ పురుషుల 50 మీటర్ల ఫ్రీస్టైల్ ఎస్13 ఫైనల్లో రవి కార్తిక్ బుడిగిన 25.89 సెకన్లలో రేసును పూర్తి చేసి కాంస్య పతకం గెలిచాడు. ఇప్పటికే రెండు రజతాలు సాధించిన అతడు తాజాగా మరో పతకాన్ని ఖాతాలో వేసుకున్నాడు. ఇండోనేషియా స్విమ్మర్ యవియాండా మౌలానా రజతం సాధించగా.. రవికి రజతం కంటే 0.38 సెకన్లు మాత్రమే ఎక్కువ సమయం పట్టింది. పురుషుల 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఎస్7 ఫైనల్లో తేజస్ నంద్‌కుమార్ 1 నిమిషం 18.58 సెకన్లలో గమ్యాన్ని చేరి కాంస్యం సాధించాడు. 50 మీటర్ల మలుపు వద్ద నాలుగో స్థానంలో ఉన్న అతడు.. చివర్లో వేగం పెంచి ఉజ్బెకిస్థాన్ స్విమ్మర్ సర్దోర్ బఖ్తియోరోవ్‌ను అధిగమించాడు.

**400 మీటర్ల పరుగులో రవణ్ణికి కాంస్యం**
మహిళల 400 మీటర్ల టీ11 ఫైనల్లో రవణ్ణి వలసనైనికి కాంస్య పతకం దక్కింది. పోటీ ప్రారంభ దశలో పతక పోటీలో లేనప్పటికీ.. చివరి మలుపు వద్ద వడో స్థానానికి చేరుకుని అదే స్థానాన్ని నిలబెట్టుకుంది. భారత అథ్లెట్లు, స్విమ్మర్లు సాధిస్తున్న విజయాలతో ఆసియా పారా క్రీడల్లో దేశ పతకాల సంఖ్య 88కు చేరింది. పతకాల పట్టికలో భారత్ 21 స్వర్ణాలు, 26 రజతాలు, 41 కాంస్యాలతో కొనసాగుతోంది.

# కివీస్‌తో తొలి టి–20లో భారత్ విజయం

**క్రైస్ట్‌చర్చ్:** నమన్ ధీర్ స్టన్నింగ్ బ్యాటింగ్ చేశాడు. కేవలం 15 బంతుల్లోనే అతను 42 రన్స్ చేసి నాటౌట్గా నిలిచాడు. అతని ఇన్నింగ్స్లో 5 బౌండరీలు, రెండు సిక్సర్లు ఉన్నాయి. 280 స్ట్రయిక్ రేట్తో అతను బ్యాటింగ్ చేశాడు. దీంతో కివీస్తో జరిగిన తొలి టీ20 మ్యాచ్ లో.. టీమిండియా 4 వికెట్ల తేడాతో ఉత్కంఠ విజయాన్ని నమోదు చేసింది. 226 రన్స్ భారీ టార్గెట్తో బరిలోకి దిగిన భారత్ మరో రెండు బంతులు మిగిలి ఉండగానే విక్టరీ ఖాతాలో వేసుకుని అయిదు మ్యాచ్లో సిరీస్లో ఆధిక్యాన్ని సాధించింది. భారత ఇన్నింగ్స్లో ఓపెనర్లు అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ ఆరంభంలో ఊచకోత కోశారు. ఆ ఇద్దరూ తొలి వికెట్కు 93 రన్స్ జోడించారు. పవర్ప్లేలో సంజూ, అభిషేక్ .. బౌండరీలతో హోరెత్తించారు. అభిషేక్ 12 బంతుల్లో 2 ఫోర్లు, మూడు సిక్సర్లతో 29 రన్స్ చేశాడు. ఇక శాంసన్ 33 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 67 రన్స్ చేశాడు. కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ కూడా బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడాడు. అతను 28 బంతుల్లో 42 రన్స్ స్కోరు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు.




ఫస్ట్ బ్యాటింగ్ చేసిన కివీస్ నిర్ణీత ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 225 రన్స్ చేసింది. ఫిన్ అలెన్, గ్లెన్ ఫిలిప్స్ ఇద్దరూ విధ్వంసకర బ్యాటింగ్ చేశారు. అల్లెన్ 24 బంతుల్లో 45, ఫిలిప్స్ 40 బంతుల్లో 82 రన్స్ చేశారు. టీ20ల్లో స్వదేశీ పిచ్‌పై కివీస్కు ఇదే అత్యధిక స్కోరు కావడం విశేషం. దాదాపు నాలుగేళ్లు ఇంటర్నేషనల్ క్రికెట్ దూరంగా ఉన్న భువనేశ్వర్ కుమార్ ఈ మ్యాచ్లో ఆడాడు. అయితే భువీ అంతగా ఆకట్టుకోలేకపోయాడు. అతని ఖాతాలో వికెట్ పడలేదు. కివీస్ ఓపెనర్ టిమ్ సీఫర్ట్ 17 బంతుల్లో 24 రన్స్ చేశాడు. న్యూజిలాండ్ చివరి 30 బంతుల్లో 67 రన్స్ చేసింది. అర్షదీప్, అక్షర్, మయాంక్ యాదవ్లు చెరో ఒక వికెట్ తీసుకున్నారు.

# పోటీ కోసం జికె

(యుపిఎస్‌సి, గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)



## అంతరిక్ష శాస్త్రం.. చరిత్ర..కంప్యూటర్.. ఆధునికసాంకేతిక

### అంతరిక్ష శాస్త్రం

☞ భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ సంక్షిప్త నామం ఏమిటి?
ఇస్రో.
☞ ఇస్రో పూర్తి రూపం ఏమిటి?
ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్.
☞ భారతదేశపు తొలి చంద్ర మిషన్ ఏది?
చంద్రయాన్1.
☞ భూమి చుట్టూ కక్ష్యలో ఉన్న ఉపగ్రహాల వేగాన్ని ప్రధానంగా ప్రభావితం చేసేది ఏమిటి?
గురుత్వాకర్షణ.

### కంప్యూటర్.. ఆధునిక సాంకేతికత

☞ సిపియు పూర్తి రూపం ఏమిటి?
సెంట్రల్ ప్రాసెసింగ్ యూనిట్.
☞ కంప్యూటర్లో తాత్కాలికంగా డేటాను నిల్వ చేసే మెమరీ ఏది?
☞ రామ్ (RAM).
ఎఐ పూర్తి రూపం ఏమిటి?
☞ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు).
☞ మెషిన్ లెర్నింగ్ అంటే ఏమిటి?
డేటా నుంచి నమూనాలను నేర్చుకుని పనితీరును మెరుగుపరుచుకునే కంప్యూటింగ్ విధానం.
☞ క్వాంటమ్ కంప్యూటింగ్లో ప్రాథమిక సమాచార ప్రమాణాన్ని ఏమంటారు?
క్యూబిట్.
☞ బ్లాక్చెయిన్ అంటే ఏమిటి ?
లావాదేవీలను వికేంద్రీకృత, పరస్పరం అనుసంధానమైన డిజిటల్ లెడ్జర్లో నమోదు చేసే సాంకేతికత.
☞ ఐఓటి పూర్తి రూపం ఏమిటి?
ఇంటెర్నెట్ ఆఫ్ థింగ్స్.
☞ బయోటెక్నాలజీ అంటే ఏమిటి?
జీవులు, కణాలు లేదా జీవసంబంధ ప్రక్రియలను ఉపయోగించి ఉపయోగకరమైన ఉత్పత్తులు లేదా సాంకేతికతలను అభివృద్ధి చేయడం.
☞ సిఆర్ఐఎస్‌పిఆర్ (CRISPR) సాంకేతికత ప్రధానంగా దేనికి ఉపయోగపడుతుంది?
జన్యు ఎడిటింగ్‌కు.
☞ నానోటెక్నాలజీ సాధారణంగా ఏ స్థాయిలో పదార్థాలను అధ్యయనం చేస్తుంది?
నానోమీటర్ స్థాయిలో.
☞ డ్రోన్ అంటే సాధారణంగా ఏమిటి?
మానవుడు నేరుగా కూర్చోకుండా రిమోట్ లేదా స్వయంచాలక నియంత్రణతో పనిచేసే మానవరహిత వైమానిక వాహనం.
☞ 5జిలో 'జి' అక్షరం దేనిని సూచిస్తుంది?
'జనరేషన్' (అంటే ఐదవ తరం మొబైల్ కమ్యూనికేషన్ సాంకేతికత).

### చరిత్ర

☞ సింధు లోయ నాగరికతలో ప్రసిద్ధ రేవు పట్టణం ఏది?



లోథల్.
☞ సింధు లోయ నాగరికతలో 'గ్రేట్ బాత్'ను ఎక్కడ కనుగొన్నారు?
మొహెంజోదారో.
☞ వేదాలలో అత్యంత ప్రాచీనమైనది ఏది?
ఋగ్వేదం.
☞ బౌద్ధమత స్థాపకుడు ఎవరు?
గౌతమ బుద్ధుడు.
☞ గౌతమ బుద్ధుడు జ్ఞానోదయం పొందిన ప్రదేశం ఏది?
బోధ్ గయ.
☞ మహావీరుడు జైనమతంలోని ఎన్నవ తీర్థంకరుడు?
24వ తీర్థంకరుడు.
☞ మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించినవారు ఎవరు?
చంద్రగుప్త మౌర్యుడు.
☞ అశోకుడి శాసనాల్లో ఎక్కువగా ఉపయోగించిన లిపి ఏది?
బ్రాహ్మీ లిపి.
☞ అర్థశాస్త్రాన్ని రచించినవారు ఎవరు?
కౌటిల్యుడు (చాణక్యుడు).
☞ గుప్తుల కాలాన్ని భారత చరిత్రలో సాధారణంగా ఏమని పిలుస్తారు?
భారతదేశపు స్వర్ణయుగం.
☞ నలందా విశ్వవిద్యాలయం ప్రస్తుత ఏ రాష్ట్రంలో ఉంది?
బిహార్.
☞ హర్షవర్ధనుడి రాజధాని ఏది?
కన్యాకుబ్జం (కనౌజ్).
☞ ఢిల్లీ సుల్తానుల కాలంలో బానిస వంశాన్ని స్థాపించినవారు ఎవరు?
కుతుబుద్దీన్ ఐబక్.
☞ కుతుబ్ మినార్ నిర్మాణాన్ని ప్రారంభించిన వారు ఎవరు?
కుతుబుద్దీన్ ఐబక్.
☞ విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించిన సోదరులు ఎవరు?
హరిహరుడు మరియు బుక్కరాయలు.
☞ విజయనగర సామ్రాజ్యంలో ప్రసిద్ధ రాజు ఎవరు?
శ్రీకృష్ణదేవరాయలు.
☞ మొఘల్ సామ్రాజ్యాన్ని భారతదేశంలో స్థాపించినవారు ఎవరు?
బాబర్.
☞ మొదటి పానిపట్ యుద్ధం ఎప్పుడు జరిగింది?
1526.
☞ అక్బర్ ఆస్థానంలోని ప్రసిద్ధ చరిత్రకారుడు ఎవరు?
అబుల్ ఫజల్.
☞ తాజ్ మహల్ను నిర్మించిన మొఘల్ చక్రవర్తి ఎవరు?
షాజహాన్.

### ఆధునిక భారత దేశం

☞ భారతదేశానికి సముద్రమార్గం ద్వారా వచ్చిన తొలి యూరోపియన్ ఎవరు?
పోర్చుగీసులు.
☞ వాస్కోడిగామా భారతదేశానికి ఎప్పుడు చేరుకున్నాడు?
1498లో.
☞ ప్లాసీ యుద్ధం ఎప్పుడు జరిగింది?
1757.
☞ బక్సర్ యుద్ధం ఎప్పుడు జరిగింది?
1764.

# 'ప్రజాపక్షం' వార్షికోత్సవ వేడుకల దృశ్యాలు



ఖమ్మం జిల్లాకేంద్రంలోని యూనిట్ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎడిషన్ ఇంచార్జి ఏనుగు వెంకటేశ్వరరావు



'ప్రజాపక్షం' జాతీయ తెలుగు దినపత్రిక 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని పత్రిక స్టేట్ బ్యూరో కార్యాలయంలో కేక్ కట్ చేసి ఘనంగా సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పత్రిక స్టేట్ బ్యూరో చీఫ్ ఇ.చంద్రశేఖర్, సిటీ బ్యూరో చీఫ్ ఎల్.శ్యామ్‌సుందర్‌రెడ్డితో పాటు స్టేట్ బ్యూరో, సిటీ బ్యూరో విలేకరులు పాల్గొన్నారు.



వేములవాడలో...



నల్లగొండలో...



వికారాబాద్‌లో...



జనగామ జిల్లా కేంద్రంలో కేక్ కట్ చేస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి రాజారెడ్డి



పెద్దపల్లిలో...



జగిత్యాలలో...



భూపాలపల్లిలో...




కరీంనగర్ జిల్లా కార్యాలయంలో కేక్ చేస్తున్న సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్



నారాయణపేటలో...



గద్వాలలో...



ములుగులో ..







వరంగల్ జిల్లా శివనగర్ తమ్మెర భవన్, హనుమకొండ జిల్లా బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయాల్లో జరిగిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి బాషుమియా, సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని లక్ష్మణాచారి భవన్‌లో కేక్ కట్ చేస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల నరసింహ, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు ఆనంద్ జీ



## మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ

**ప్రజాపక్షం/కోదాడ రూరల్** : సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదక ద్రవ్యాల నిర్మూలనపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ అన్నారు. కోదాడకు చెందిన బచ్చలకూ సురేష్ స్వయంగా రచించి, రూపొందించిన మాదక ద్రవ్యాలపై యుద్ధం డాక్యుమెంటరీ పోస్టర్‌ను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, యువత జీవితాలు ఏవిధంగా చిన్నాభిన్నం అవుతున్నాయనే విషయాలను, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాల్సిన ఆవశ్యకతను ఈ డాక్యుమెంటరీ ద్వారా ప్రజలకు వివరించే ప్రయత్నం చేయడం అభినందనీయమన్నారు. సమాజ హితం కోసం వినూత్నంగా ఆలోచించి ఈ డాక్యుమెంటరీని తెరకెక్కించిన బచ్చలకూర సురేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరూ మాదక ద్రవ్యాల నిర్మూలనకు తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బొల్లె విద్యాసాగర్, పవన్ పాల్గొన్నారు.

## 23న సర్‌కు వ్యతిరేకంగా నిరసన




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : అక్టోబర్ 23న అక్రమ సర్‌కు వ్యతిరేకంగా జిల్లా, తహశీల్ కేంద్రాల్లో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివిధ సంఘాల నాయకులు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఎస్‌ఐఆర్‌ను తక్షణమే రద్దు చేయాలని, ముఖ్యంగా విద్యార్థులు, యువతపై ఢిల్లీ పోలీసులు, నేరపూరిత శక్తులు జరిపిన దాడులకు వ్యతిరేకంగా నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, రైతు కూలీలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొప్పోజు సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ రాష్ట్ర నాయకులు మందారి డేవిడ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల శ్రీనివాస్, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి, ఏఐపికెఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పేర్ల నాగయ్య, తెలంగాణ రైతాంగ సమితి జిల్లా కార్యదర్శి నల్లెడ మాధవరెడ్డి, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు కునుకుంట్ల సైదులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు నమోదు చేసుకోండి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని 15వ వార్డులో కౌన్సిలర్ పిల్లల భవాని రమేష్ నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు సహాయ కేంద్రాన్ని వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఓటర్ల నమోదు ప్రక్రియపై పట్టభద్రులకు అవగాహన కల్పించడంతోపాటు నమోదు సమయంలో అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఈ కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి ఖమ్మం వరంగల్ నల్లగొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, వార్డు కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా కల్పించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దళిత క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు, సామాజిక న్యాయం సాధనకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఎమ్మెల్సీ ఎం.సి. కోటిరెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని హౌసింగ్ బోర్డు విజయ గార్డెన్స్‌లో యునైటెడ్ దళిత క్రైస్తవుల ఫెడరేషన్, టీసీ జేఏసీ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత క్రైస్తవుల ఎస్సీ హోదా సాధన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని ప్రకటించి, వారికి న్యాయం జరిగేలా తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.దళిత క్రైస్తవులకు విద్య, ఉపాధి, సామాజిక రంగాల్లో సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని కోటిరెడ్డి పేర్కొన్నారు. వారి హక్కులు, సంక్షేమం పరిరక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, ప్రొఫెసర్ డాక్టర్ ఖాసీం, ప్రొఫెసర్ డాక్టర్ నతనియేలు, డీఎస్పీ వ్యవస్థాపకులు డాక్టర్ విశారదన్, నిర్వాహకులు డి.ఐ. శాంసన్, పెదమాము డేవిడ్ రాజు, ఆదిముల్ల ప్రభుదాస్ పాల్గొన్నారు.

## ప్రజలందరికీ దుర్గామాత ఆశీస్సులు



**ప్రజాపక్షం/దేవరకొండ** : దేవరకొండ పట్టణంలోని నాలుగవ వార్డులో కొలువుదీరిన దుర్గామాత అమ్మవారిని గురువారం దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, రైతులకు పాడిపంటలు సంవృద్ధిగా పండాలని, ప్రతి ఇంటా శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని అమ్మవారిని ఎంఎల్‌ఏ ప్రార్థించారు. మార్కండేయ స్వామి ఆలయంలో దుర్గామాత నిమజ్జన కార్యక్రమం సందర్భంగా అమ్మవారి చీరల వేలంపాటలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ రయిస్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సురేష్‌గౌడ్, లింగయ్య, మధు, నర్సింహ, మల్లయ్య, ఇస్తారి పాల్గొన్నారు.

# జులైలో యంగ్ ఇండియా స్కూల్ ప్రారంభం

రూ.200 కోట్లతో నిర్మాణం..పనుల వేగవంతం చేయాలి

ఐటిపాముల ఎత్తిపోతల పథకాన్ని కూడా త్వరగా పూర్తి చేయాలని : ప్రభుత్వ విప్ వీరేశం ఆదేశాలు



**ప్రజాపక్షం/నకిరేకల్:** ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను జులైలో ప్రారంభించేలా నాణ్యతతో కూడిన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు. గురువారం నకిరేకల్ మండలం కడపర్తి గ్రామ శివారులో రూ.200 కోట్ల భారీ వ్యయంతో నిర్మిస్తున్న పాఠశాల పనులను ఆయన పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో చర్చించి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు.విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి వసతులతో కూడిన ఆధునిక విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. పాఠశాల నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఐటిపాముల ఎత్తిపోతల పథకం పనులను కూడా త్వరగా పూర్తి చేసి,ఇంటిగ్రేటెడ్ స్కూల్‌తోపాటు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభిస్తామని తెలిపారు.ఈ పథకం ద్వారా కడపర్తి పరిసర గ్రామాలకు శాశ్వత సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో రైతులు పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నకిరేకల్ మండల,పట్టణ అధ్యక్షులు గాదగోని కొండయ్య,లింగాల వెంకన్న, నెలిబండ సర్పంచి ఆదేపురాఘవులు,ఏసు పాదం, యాస కరుణాకర్ రెడ్డి, వీరార్జున్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

ఆసుపత్రిలో శానిటేషన్,లైటింగ్,నీటి సౌకర్యాలు మెరుగుపరచాలి

ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ బి.చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నకిరేకల్:** ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని,విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ వైద్యాధికారులను హెచ్చరించారు.గురువారం ఆయన నకిరేకల్‌లోని 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఓపీ రిజిస్టర్‌ను, రోగులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా పరిశీలించారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ శోభ, ఇతర వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో మాట్లాడి ఆసుపత్రి నిర్వహణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన ఆసుపత్రిలోని ఫార్మసీ,ఎమర్జెన్సీ వార్డు,లేబర్ రూమ్, స్టోర్ రూమ్,గైనిక్ వార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డాక్టర్లు,నర్సింగ్ స్టాఫ్,ఇతర సిబ్బంది హాజరు శాతాన్ని రికార్డుల ద్వారా పరిశీలించారు. అనంతరం ఆయా వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి వారితో నేరుగా మాట్లాడారు. డాక్టర్లు సమయానికి వచ్చి వైద్యం అందిస్తున్నారా, మందులు ఉచితంగా ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రి ద్వారా నిర్వహిస్తున్న సాధారణ ప్రసవాలు,సిజేరియన్ ప్రసవాల సంఖ్యపై సమాచారం సేకరించారు.ఆసుపత్రి ఆవరణలో సరిపడా లైటింగ్, నిరంతర నీటి సరఫరా, పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.డాక్టర్లు, సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటిస్తూ విధులను సక్రమంగా నిర్వహించాలని,ప్రజలకు నమ్మకమైన వైద్య సేవలందించాలని ఆదేశించారు.

# జాతీయ సమైక్యతకు బిజెపి విధానాలే ప్రమాదకరం



సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు

**ప్రజాపక్షం/నల్లగొండ:** పంటలు నష్టపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు డిమాండ్ చేశారు.గురువారం నల్లగొండ మండలం చర్లపల్లి గ్రామంలో ఎండిపోయిన వరి, పత్తి పంట పొలాలనుసిపిఐ(ఎం)రాష్ట్ర,జిల్లా నాయకత్వం,రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు.రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్ లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.నల్లగొండ జిల్లాలో వరి,పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.వరి పంటలో ధాన్యం కంటే గొడ్డు, తాలు మాత్రమే మిగిలిందని, పత్తి పంట ఎండ తీవ్రత, వర్షాభావంతో పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు.పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి రాని పరిస్థితి ఉందని, చిన్న సన్నకారు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన సహాయం సరిపోదని,తక్షణ పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.జాతీయ సమైక్యతకు బీజేపీ ప్రభుత్వ విధానాలే ప్రమాదకరమని విమర్శించారు. డీలిమిటేషన్ వల్ల జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే తెలంగాణ,ఆంధ్రప్రదేశ్, తమిళనాడు,కేరళ,కర్ణాటక వంటి దక్షిణాది రాష్ట్రాలకు రాజకీయ ప్రాతినిధ్యం తగ్గి తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.తెలంగాణలో 93 లక్షల మంది ఓటర్ల తొలగింపు, జనగణన, కులగణనలో పారదర్శకత లోపించడంపై ఆందోళన వ్యక్తం చేశారు.ఆత్మనిర్భరత పేరుతో విదేశీ పెట్టుబడులకు 51 శాతం వాటా కల్పించడం విరుద్ధమని అన్నారు.ఈ సమావేశంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి,పోతినేని సుదర్శన్, తీగల సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి,సుధాకర్ రెడ్డి,నారి ఐలయ్య,జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు నాగార్జున,బండ శ్రీశైలం, సయ్యద్ హాశం,పాలడుగు ప్రభావతి,చినపాక లక్ష్మీనారాయణ,వీరపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## జనగణన దేశ భవిష్యత్తు ప్రణాళికలకు మూలం




**ప్రజాపక్షం/నల్లగొండ:** జనగణన కార్యక్రమాన్ని ఎలాంటి తప్పులు దొర్లకుండా పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.గురువారం నల్లగొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ప్రణాళిక అధికారి ఆధ్వర్యంలో జనగణనపై జిల్లా స్థాయి,డివిజనల్ స్థాయి అధికారులు,ఛార్జ్ ఆఫీసర్లు (తహసీల్దార్లు),అదనపు ఛార్జ్ ఆఫీసర్లు (ఎంపీడీఓలు,మున్సిపల్ కమిషనర్లు)లకు రెండు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ జనగణన అనేది దేశ భవిష్యత్తు ప్రణాళికలకు మూలమని,కాబట్టి ప్రతి ఒక్కరి వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని సూచించారు.జనగణన రెండో దశ షెడ్యూల్ ను వివరించారు.2027 జనవరి 10 నుంచి జనవరి 24 వరకు ప్రజలు స్వయంగా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు, జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఎన్యుమరేటర్లు ఇంటింటికి వెళ్లి గణన చేపడతారు.ఫిబ్రవరి 28 రాత్రి ఇళ్లు లేని నిరాశ్రయులను గణిస్తారు.మార్చి 1 నుంచి మార్చి 5 వరకు నిర్వహిస్తారు అని తెలిపారు.జనగణనలో భాగంగా ఎన్యుమరేటర్లు ప్రతి కుటుంబాన్ని సంప్రదించి మొత్తం 40 రకాల ప్రశ్నలకు సంబంధించిన వివరాలను సేకరిస్తారని తెలిపారు. అధికారులంతా సమన్వయంతో, బాధ్యతతో పనిచేసి నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం గణన పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ శిక్షణా కార్యక్రమంలో దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావి, డీఆర్‌ఓ దశరథ, సీపీఓ శ్రీనివాస్ నాయక్,రాష్ట్ర స్థాయి ట్రైనర్లు ఎ.వినయ్,గీత, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పెన్‌పహాడ్‌లో 'మరుగు'న పడ్డ వసతులు...

పనుల కోసం వచ్చే మహిళలు, వృద్ధుల అవస్థలు వర్ణనాతీతం

గంటల తరబడి నిరీక్షణ...

బహిరంగ ప్రదేశాలే శరణ్యం




**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** : మండల కేంద్రానికి నిత్యం వివిధ పనుల నిమిత్తం వచ్చే వందలాది మంది ప్రజలకు కనీస మౌలిక వసతి అయిన పబ్లిక్ టాయిలెట్స్ లేకపోవడంతో మహిళలు, వృద్ధులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మండల కార్యాలయాల చుట్టూ తిరిగే సామాన్య ప్రజలు అత్యవసర సమయాల్లో ఎటు వెళ్లాలో తెలియక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారుల చుట్టూ, ఆఫీసుల చుట్టూ తిరగాలన్నా, పనులు ముగించుకోవాలన్నా గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని, కనీసం టాయిలెట్ సౌకర్యం కూడా లేకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివిధ ధృవీకరణ పత్రాలు, పెన్షన్లు, భూ సమస్యల కొరకు చుట్టుపక్కల గ్రామాల నుండి వచ్చే మహిళలు, వృద్ధుల పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. అత్యవసర సమయాల్లో ఆఫీసు ఆవరణల్లో ఎక్కడైనా మరుగుదొడ్లు ఉన్నాయేమోనని వెతుక్కోవాల్సి వస్తోందని, చివరకు బహిరంగ ప్రదేశాలను ఆశ్రయించక తప్పడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ తెలంగాణ అంటూ ప్రగల్భాలు పలికే పాలకులు, అధికారులు కనీస అవసరాన్ని ఎందుకు విస్మరిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**ఎంపిడిఒ జానయ్య వివరణ...** ఈ విషయమై పెన్‌పహాడ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏ. జానయ్యను వివరణ కోరగా మండల కేంద్రంలో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించడానికి అనువైన స్థలాన్ని అన్వేషిస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో అనుకూలమైన ప్రభుత్వ స్థలం దొరికిన వెంటనే నిధులు, అనుమతుల కొరకు ఉన్నతాధికారులకు తక్షణమే నివేదికలు పంపిస్తామని స్పష్టం చేశారు.

# ప్రజావీరుడు పండుగ సాయన్న : కలెక్టర్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : నిజాం నిరంకుశ పాలనకు, భూస్వామ్య వ్యవస్థ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడి, నిరుపేదల ఆకలి తీర్చిన ప్రజావీరుడు పండుగ సాయన్న అని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పండుగ సాయన్నను తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్‌ఓ ప్రేమ్‌రాజ్, బిసి వెల్ఫేర్ అధికారి విశాల్, డిఎంహెచ్‌ఓ వెంకటరమణ, డిసిఓ శ్రీరామ్, బిసి సంఘాల నాయకులు ఈదుల యాదగిరి ముదిరాజ్, కళా కరుణాకర్, రమేష్, నరసింహ, మల్సూర్ గౌడ్ పాల్గొన్నారు.

**పోరాట యోధుడు పండుగ సాయన్న:మేయర్ చైతన్య శ్రీనివాస్ రెడ్డి**

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** పేదల పక్షాన నిలిచి దోపిడిని ఎదిరించి ప్రజల గుండెల్లో నిలిచిన పోరాట యోధుడు పండుగ సాయన్న అని మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి అన్నారు.పండుగ సాయన్న జయంతి వేడుకలను గురువారం నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ బి.వంశీ కృష్ణ,కార్పొరేటర్లు,కార్యాలయ సిబ్బందితో కలిసి పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పేదల పట్ల ఆయన చూపిన ఆదరణ,అన్యాయాన్ని ఎదిరించిన పోరాట స్ఫూర్తి కారణంగానే ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు.పండుగ సాయన్నను జానపద కథనాల్లో తెలంగాణ రాబిన్ హుడ్ గా అభివర్ణిస్తారని పేర్కొన్నారు. పండుగ సాయన్న ఆశయాలను స్మరించుకుంటూ, ప్రజాసేవకు ప్రాధాన్యతనిస్తూ సమాజ అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.







## స్లాట్ బుకింగ్‌లో సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురండి

సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/మునుగోడు:** పత్తి అమ్ముకునేందుకు స్లాట్ బుకింగ్ లో ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ రైతులకు సూచించారు.తూకం,ధరల్లో తేడా లేకుండా పారదర్శకంగా కొనుగోలు జరగాలని,రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సిసిఐ అధికారులను ఆదేశించారు.గురువారం మండల కేంద్రంలో సలాసర్ బాలాజీ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సిసిఐ అధికారులు, రైతులు,జిల్లా వ్యవసాయ,అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ మాట్లాడారు తూకం ఎలా చేస్తున్నారని అడుగుతూ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని,సిసిఐ కొనుగోలు కేంద్రం రిజిస్టర్ కు జిన్నింగ్ మిల్లు రిజిస్టర్ కు తేడా ఉండకుండా చూడాలన్నారు.తూకం,ధరల్లో తేడా లేకుండా కొనుగోలు చేయాలని చెప్పారు.ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రానున్న యాసంగిలో సమిష్టి వ్యవసాయం చేసేందుకు ముందుకు వస్తే వారి పంటకు తగ్గట్టుగా అమ్ముకునేందుకు జిల్లా యంత్రాంగం తరపున ఏర్పాటు చేస్తామని, ఈ విషయంపై ప్రణాళిక రూపొందించాలని జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్‌ను,డీసీవో మమత,మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవిలను ఆదేశించారు.

## దేవాలయాల అభివృద్ధికి కృషి

నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జై వీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/హాలియా:** పురాతన దేవాలయాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జై వీర్‌రెడ్డి అన్నారు.గురువారం మండలంలోని పేరూరులో గల శ్రీ స్వయంభు సోమేశ్వర స్వామి ఆలయ రాజగోపురం,విమాన గోపురాల నిర్మాణాల కు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన శివాలయం అయిన శ్రీ స్వయంభు సోమేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ ఆలయ పునర్నిర్మాణాన్ని అద్భుతంగా చేపట్టారని కొనియాడారు.ప్రజలంతా ఏకమై ఆలయాల నిర్మాణానికి కలిసికట్టుగా ముందుకు రావడం అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి, దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్ భాస్కర్ రావు,ఆలయ కార్య నిర్వహణ కార్యదర్శి సురుకంటి ఇంద్రసేనారెడ్డి,మార్కెట్ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్ రెడ్డి,ఆలయ చైర్మన్ రెక్కల గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ హక్కులకై పోరాడిన యోధుడు కొమరంబీమ్



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ఆదివాసుల హక్కులకై పోరాడిన వీరుడు కొమరంభీమ్ అని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. గురువారం మండల పరిధిలోని చిల్లేపల్లిలో ఆదవాసి వీరుడు కొమరం భీమ్ 126వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనాటికి గొండు సమాజంలో దేవుడిగా పూజిస్తారని ఆయన పేరు మీద ఒక జిల్లాను ఏర్పాటు చేశారని, ట్యాంక్ బండ్‌పై విగ్రహం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిలకరాజు శ్రీను, పరికె భరత్, ఇన్సాఫ్, ఎస్‌కె సైదా, కాశీం, రహీం, షరీఫ్, మొహబూబీ పాల్గొన్నారు.

